

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 160

శుక్రవారం 24-2-2023



విజయం దూరమైంది
మహిళల టి20 ప్రపంచకప్ సెమీస్‌లో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి - 13లో



ఉపాధి కల్పనకు చోటేది?
కేంద్ర బడ్జెట్‌పై ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కేజ్రీవాల్ పీఏను ప్రశ్నించిన ఈడీ
మద్యం స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు వైభవ్ కుమార్‌ను ఈడీ గురువారం ప్రశ్నించింది.
వివరాలు 6లో ▸



అమెరికాలో మంచు తుపాను
అమెరికాను భీకర మంచు తుపాను వణికిస్తోంది. ఎక్కడి వాహనాలక్కడే నిలిచిపోగా.. విమాన సర్వీసులు రద్దయ్యాయి.
వివరాలు 6లో ▸



నోబెల్ శాంతికి 305 నామినేషన్లు
నోబెల్ శాంతి బహుమతికి నామినేషన్ల గడువు ముగియగా.. ఈ ఏడాది 305 నామినేషన్లు వచ్చాయని ఎంపిక కమిటీ తెలిపింది.
వివరాలు 6లో ▸



కాంగ్రెస్ నేత పవన్ ఖేడా అరెస్ట్
ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేత పవన్ ఖేడాను అస్సాం పోలీసులు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు.
వివరాలు 6లో ▸

ఏది నిజం?

పచ్చ పైత్యం ముదిరిపోయింది!

- వివేకా హత్య కేసులో సీబీఐ పేరు చెబుతూ మరో దుర్మార్గపు వంటకం
- సునీల్ యాదవ్ కదలికలపైనా సీబీఐ పరస్పర విరుద్ధ నివేదికలు
- ఫోన్ లోకేషన్ ద్వారా కనుగొన్నామని 2021, డిసెంబర్‌లో చెప్పిందొకటి..
- 14 నెలల తరువాత ఇప్పుడు చెబుతున్న లొకేషన్ వేరొకటి
- దస్తగిరి, ఎర్ర గంగిరెడ్డి సహా హంతకులు వివేకాకు అత్యంత సన్నిహితులు.. ఆయన కుమార్తెకు, అల్లుడికి, పెద్ద బావమరిదికి కూడా సన్నిహితులే
- ఈ కోణాన్ని ఎంతమాత్రం పట్టించుకోకుండా వెళ్తున్న సీబీఐ
- వివేకాతో వైఎస్ భాస్కర్ రెడ్డికి విభేదాలున్నాయని సీబీఐ వ్యాఖ్యలు
- మరి వివేకా సన్నిహితులు ఈయన మాటెందుకు వింటారంటే నో ఆన్సర్
- వివేకా ఫోన్‌లో డేటాను డిలీట్ చేసినా ప్రశ్నించని వైనం
- సాక్షులు చెప్పని విషయాలు చెప్పినట్టుగా వాంగ్మూలాలు నమోదు
- పచ్చ పత్రికల్లో పతాక శీర్షికల్లో కథనాలుగా అవే వాంగ్మూలాలు
- నాడు గంగాధర్‌రెడ్డి నుంచి తాజాగా శశికళ వరకు అదే తంతు
- కడప ఎంపీ టికెట్‌పై సందిగ్ధత ఉందని తప్పుడు ప్రచారం
- అవినాశ్ కోసం తన తండ్రి ప్రచారం చేశారని చెప్పిన సునీత
- రూ.40కోట్ల సుపారీ అంటూ ఊహాజనిత కథనాలతో ప్రజల్ని మోసపుచ్చే కుట్ర
- కేసు దర్యాప్తును ప్రభావితం చేస్తున్న బీజేపీలోని చంద్రబాబు కోవర్టులు

4లో



విజయవాడలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు



ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ఈనాడు ప్రతులను తగలబెడుతున్న స్థానికులు

కట్టుకథలు రాస్తున్న ఈనాడుపై జనాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' ప్రతులు దహనం.. ఉవ్వెత్తున ఎగసిన నిరసనలు

- పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం.. సోషల్ మీడియాలో బట్టబయలు కావడంతో లోపలి పేజీలో సవరణ
- రామోజీ తీరుపై అన్ని వర్గాల మండిపాటు
- ఈ పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికని నినాదాలు
- చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతో దిగజారిన పాత్రికేయం.. చంద్రబాబు మేలే లక్ష్యంగా రామోజీరావు కుట్ర సిద్ధాంతం
- వయసు పెరిగి.. బుద్ధి మందగించిందని ధ్వజం

సాక్షి, అమరావతి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు' పత్రిక అసత్య కథనాలు వండి వారుస్తోందని, వారికి అనుకూలమైన చంద్రబాబును సీఎంను చేయాలనే కుట్రతో దిగజారుడు వార్తలు ప్రచురిస్తోందని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఎగసిపడింది. తప్పుడు వార్తలు రాసి.. ప్రజలను మోసం చేస్తున్న ఈనాడు పత్రిక ప్రతులను గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాలు, సోషల్ యాక్టివిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో దహనం చేశారు. రామోజీరావు ఇంతగా దిగజారిపోవడం దారుణం అని ఛీకొట్టారు. పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, ప్రభుత్వం మీద బురద జల్లడానికి ఈనాడు చేసిన కుట్ర మరోసారి బట్టబయలు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున నిరసనలు ఎగసిపడ్డాయి. వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్న సెంటర్లలో ఈనాడు రామోజీరావు విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అవి 2021లోని ఫొటోలని సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో ఎవరికీ కనిపించని రీతిలో రెండో పేజీలో సింగిల్ కాలంలో 'సవరణ' వేసి చేతులు దులుపుకుందని ఆందోళనకారులు మండిపడ్డారు. ఈనాడు పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి అని పెద్ద ఎత్తున నినదించారు. చంద్రబాబును


మిగతా 2వ పేజీలో ▶

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే



- పట్టాభి ఘటనపై రామోజీకి మంత్రి అంబటి అల్టిమేటం
- నేటి సాయంత్రం వరకు గడువు ఇస్తున్నాం
- క్షమాపణ కోరకుంటే నేరపూరిత పరువు నష్టం దావా వేస్తాం

2లో



భూమికి ఐదో పొర!

భూమికి నాలుగు పొరలుంటాయని మనకు ఇప్పటిదాకా తెలుసు.. కానీ ఐదో పొర కూడా ఉందట! ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో ఈ విషయం వెల్లడయ్యింది. ఇది భూమి లోలోతుల్లో ఘనాకృతిలోని లోహపు గోళం మాదిరిగా ఉందని తేలింది.

- వివరాలు 6లో

తిరుపతి పుట్టిన రోజు నేడు



- 1130 ఫిబ్రవరి 24న జగద్గురు రామానుజాచార్యులచే శంకుస్థాపన
- ఒకప్పటి అగ్రహారమే నేటి తిరుపతి నగరం
- శ్రీనివాసుడి నిత్య పూజలు చేసే అర్చకులకు ఆవాసాలు
- అప్పట్లో 4 మాడవీధులే.. టీటీడీ ఏర్పడ్డాక నలుదిశలా అభివృద్ధి

5లో



కొత్త గవర్నర్‌తో సీఎం దంపతుల భేటీ

2లో

నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీర నజీర్‌లతో సీఎం జగన్, ఆయన సతీమణి భారతి



సమావేశంలో ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నాం

- ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు దివాకర్
- వారివన్నీ అప్రజాస్వామిక, స్వార్థపూరిత నిర్ణయాలు
- గవర్నర్ దగ్గరకు వెళ్లడం ముమ్మాటికీ తప్పే.. ఏదైనా ఉంటే ప్రభుత్వం వద్దే తేల్చుకోవాలి
- ఈ ప్రభుత్వ హయాంలో వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు

- వివరాలు 10లో

మరింత సులభంగా ఎగుమతులు

- రాష్ట్ర ప్రభుత్వ కృషితో కేంద్రం ఎఫ్ఐఈవో రాష్ట్ర చాప్టర్ ఏర్పాటు
- రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌కే పరిమితమైన ఎఫ్ఐఈవో
- మార్చి 2న విశాఖలో ఎగుమతిదారులతో సదస్సు
- రాష్ట్రంలో ఎగుమతిదారుల సంఖ్య వెయ్యికి పెంచడమే లక్ష్యం

10లో



ధాన్యం రైతులకు రూ.1,611 కోట్లు

తాజాగా ఖాతాల్లో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- గడువులోగా 96.29 శాతం చెల్లింపులు పూర్తి
- ఇప్పటివరకు 32.97 లక్షల టన్నులకుపైగా ధాన్యం సేకరణ
- 5.76 లక్షల మంది రైతులకు రూ.6,483.97 కోట్లు చెల్లింపులు
- గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీల కింద రూ.79.68 కోట్లు



సాక్షి, అమరావతి: ధాన్యం కొనుగోళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు సంపూర్ణ మద్దతు అందిస్తూ అండగా నిలుస్తోంది. పౌరసరఫరాల సంస్థ తాజాగా గురువారం రూ.1,611.27 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో ధాన్యం రైతులకు మొత్తం రూ.6,483.97 కోట్లు అంటే సుమారు 96.29 శాతం మేర నిర్ణీత వ్యవధిలోగా చెల్లింపులు చేయడం విశేషం. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ రవాణా ఖర్చులను కూడా అందిస్తోంది. గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీల కింద రూ.79.68 కోట్లను రైతులకు చెల్లించింది. 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 6,01,147 మంది రైతుల నుంచి రూ.6,734.02 కోట్ల విలువైన 32,97,735 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది.

ఉత్తరాంధ్రలో వారంలోగా..

ధాన్యం సేకరణలో భాగంగా పౌరసరఫరాల సంస్థ జిల్లాల వారీగా తాత్కాలిక అంచనాలు రూపొందించింది. దీని ప్రకారం చాలా జిల్లాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. క్షేత్రస్థాయిలో ఇంకా మిగిలి ఉన్న ధాన్యాన్ని లెక్కించి కొనుగోళ్లకు అనుమతులిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మరో వారంలోగా

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మా మీద కాస్త దయతలచి.. మాకూ రుణాలిప్పించండి సార్!!

పోలవరం నావిగేషన్ కెనాల్‌పై కదలిక

రాష్ట్ర జలవనరులు, పీపీఏ, ఐడబ్ల్యూఏఐ, షిప్పింగ్ శాఖలతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి సమావేశం

భద్రాచలం–ధవళేశ్వరంను జాతీయ జలరవాణా మార్గం–4గా 2016లో ప్రకటించిన ఐడబ్ల్యూఏఐ

- క్లాస్–3 ప్రకారం నావిగేషన్ కెనాల్, టన్నెల్, లాక్‌లను అభివృద్ధి చేయాలని ఆదేశం
- కానీ, అప్పటికే 80 శాతం పనులు చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ
- క్లాస్–3 ప్రకారం చేపడితే అదనంగా రూ.876 కోట్లు అవసరమని వెల్లడి
- ప్రస్తుత కెనాల్‌ను చిన్న పడవలకు ఉపయోగించుకుని పెద్ద నౌకలకు సమాంతరంగా మరో నావిగేషన్ కెనాల్ తవ్వాలని జలవనరుల శాఖ, షిప్పింగ్ శాఖల ప్రతిపాదన
- దీనిపై అధ్యయనం చేయడానికి కమిటీ వేసిన కేంద్ర జల్‌శక్తి శాఖ
- రెండు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని కమిటీకి ఆదేశం.. దాని ఆధారంగా పనులు



జలాశయం పూర్తవుతుండటంతో..

పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేస్తోంది. ప్రాజెక్టు పూర్తయితే నావిగేషన్ కెనాల్, టన్నెల్ పనులు చేపట్టడం చాలా కష్టం. ఈ నేపథ్యంలోనే కేంద్ర జల్‌శక్తి శాఖ రంగంలోకి దిగింది. జాతీయ జలమార్గం ప్రమాణాలతో పోలవరం నావిగేషన్ పనులను చేపట్టాలని ఐడబ్ల్యూఏఐకు సూచించింది. ఈ క్రమంలోనే గురువారం కేంద్ర జల్‌శక్తి శాఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేసింది.

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నావిగేషన్ కెనాల్‌పై కేంద్రం కదిలింది. కేంద్ర షిప్పింగ్, పోర్టుల శాఖ కార్యదర్శి సుదాన్ష్‌పంత్, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) చైర్మన్ సంజయ్ బందోపాధ్యాయ, సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) చైర్మన్ కుశ్వీందర్ వోరా, పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సీఈఓ శివ్‌నందన్ కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి. నారాయణరెడ్డిలతో గురువారం కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ జలమార్గం–4లో పేర్కొన్న క్లాస్–3 ప్రమాణాలతో పోలవరం నావిగేషన్ కెనాల్‌ను అభివృద్ధి చేయాలంటే రూ.876.38 కోట్ల వరకు ఖర్చవుతుందని సమావేశంలో రాష్ట్ర అధికారులు వివరించారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారం ఇప్పటికే నావిగేషన్ కెనాల్, మూడు లాక్‌లు, టన్నెల్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం చేపట్టిన నావిగేషన్ కెనాల్‌ను చిన్న పడవల రవాణాకు ఉపయోగించుకుని.. దానికి సమాంతరంగా క్లాస్–3 ప్రమాణాలతో మరో నావిగేషన్ కెనాల్ తవ్వి, దాన్ని భారీ నౌకల రవాణాకు వాడుకోవాలని ప్రతిపాదించారు. దీనిపై కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ స్పందిస్తూ.. ఈ ప్రతిపాదనపై అధ్యయనానికి కేంద్ర షిప్పింగ్, ఐడబ్ల్యూఏఐ, సీడబ్ల్యూసీ, పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో కమిటీ వేస్తామన్నారు. రెండు నెలల్లోగా అధ్యయనం చేసి ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పోలవరం నావిగేషన్ కెనాల్‌పై

మిగతా 10వ పేజీలో ▶

కొత్త గవర్నర్‌తో సీఎం దంపతుల భేటీ



నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీర నజీర్‌లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం దంపతులకు గవర్నర్ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, రాజ్‌భవన్ అధికారులు స్వాగతం పలికారు. సీఎం జగన్ దంపతులు గవర్నర్ దంపతులను శాలువతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సీఎం జగన్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ బుధవారం రాత్రి విజయవాడకు చేరుకున్న విషయం తెలిసిందే. ఆయన శుక్రవారం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బుద్ధవనానికి బస్సులు

- విజయవాడ, గుంటూరు నుంచి నడపనున్నట్లు తెలిపిన ఎండీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలోని బుద్ధవనం పర్యాటక ప్రదేశానికి విజయవాడ, గుంటూరు నుంచి ఆర్టీసీ బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టాలని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం మాచర్ల, పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లిలోని బస్ స్టేషన్లను పరిశీలించారు. స్థానిక ఉద్యోగులతో ముచ్చటించి ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ సేవలపై ఆరా తీశారు. మాచర్లకు 30 కి.మీ దూరంలోని చారిత్రక బుద్ధవనం ప్రాజెక్టులో పర్యటించారు. కొంతమంది యాత్రికులు బుద్ధవనానికి దూర ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ఎండీని కోరారు. వెంటనే స్పందించిన ఆయన...బుద్ధవనంతోపాటు సమీపంలోని నాగార్జున సాగర్, నాగార్జున కొండ ప్రాంతాలకు బస్సులు నడిపితే పర్యాటకులకు సౌకర్యంతోపాటు ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని అధికారులకు సూచించారు.

హైకోర్టు పోస్టుల రాతపరీక్ష ఫలితాల వెల్లడి

సాక్షి, అమరావతి: హైకోర్టులో పలు విభాగాల్లో 241 పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను హైకోర్టు తన వెబ్‌సైట్‌లో ఉంచింది. రాతపరీక్షలో విజయం సాధించినవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ముందు హాజరయ్యేందుకు తేదీలను ప్రకటించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ గిరిధర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తెలంగాణ

25న హైదరాబాద్‌కు సీజేఐ

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ నెల 25న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే 19వ కాన్వొకేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (వర్సిటీ చాన్సలర్) జస్టిస్ ఉజ్జల్ భూయాన్, రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.

ఇది మీ అంతరాత్మను కదిలించలేదా?

వీధి కుక్కల దాడితో బాలుడి మృతిపై ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ''నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి చంపిన నేపథ్యంలో అధికారులు ఏం చేస్తున్నారు? ఇది మీ అంతరాత్మలను కదిలించలేదా? ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వీధి కుక్కల నియంత్రణకు మీ వద్ద ఏదైనా ప్రణాళిక ఉందా?'' అని జీహెచ్‌ఎంసీ అధికారులను హైకోర్టు నిలదీసింది. ఈ ఘటనకు సంబంధించి బాలుడి తల్లిదండ్రులు పరిహారం పొందేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. అధికారులు తీసుకున్న చర్యలేమిటో కోర్టుకు తెలియజేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలానికి చెందిన గంగాధర్ హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గంగాధర్‌తోపాటు సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లిన ప్రదీప్‌పై వీధికుక్కలు దాడి చేయడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై ఓ పత్రికలో ప్రచురితమైన వార్తను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం గురువారం దీనిపై విచారించింది.

కుక్కల దాడిలో 12 మందికి గాయాలు

యాచారం/ బోనకల్/ అడ్డగూడూరు/ నేలకొండపల్లి: రాష్ట్రంలో గురువారం కూడా కుక్క కాటు ఘటనలు నమోదయ్యాయి. మూడు వేర్వేరు చోట్ల కుక్కల దాడిలో 12 మందికి గాయాలుకాగా.. అందులో నలుగురి ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గురువారం ఉదయం రంగారెడ్డి జిల్లా యాచారంలోని ఎల్లమ్మ దేవాలయం సమీప కాలనీలోకి వచ్చిన ఓ వీధి కుక్క.. వరుసగా ఒకరివెనుక ఒకరిని కరవడం మొదలుపెట్టింది. కుక్క దాడిలో గ్రామానికి చెందిన గడల నందీశ్వర్, కొత్త రాములమ్మ, బెల్లి కొమురయ్య, రేణుక, ఇబ్రహీంపట్నంకు చెందిన కొప్పు సాయమ్మ, మల్కీజ్‌గూడకు చెందిన బోడ వెంకటమ్మ, బూర వెంకటమ్మ, బోడుప్పల్‌కు చెందిన మహేశ్, నందివనపర్తికి చెందిన సుధాకర్, మొండిగౌరెల్లికి చెందిన శ్యాంసుందర్ గాయపడ్డారు. వారికి యాచారం పీహెచ్‌సీలో చికిత్స చేశారు. పరిస్థితి సీరియస్‌గా ఉన్న నందీశ్వర్, కొత్త రాములమ్మ, కొమురయ్య, బోడ వెంకటమ్మలను 108లో హైదరాబాద్ నారాయణగూడలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

■ ఖమ్మం జిల్లా రావినూతలకు చెందిన తాళ్లూరి శ్రీకాంత్ కుమారుడు వరుణ్ సందేశ్ చిరునోములోని ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుండి ఇంటికి వెళ్తుండగా వీధికుక్కలు దాడి చేయడంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి.

■ యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కోటమర్తికి చెందిన చిత్తలూరు పూలమ్మ గురువారం ఉదయం వీధిలో వెళ్తుండగా సుమారు పది కుక్కలు దాడి చేశాయి. ఆమె రెండు కాళ్లకు తీవ్రంగా గాయలవడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

■ ఖమ్మం జిల్లా మోటాపురంలోని ప్రభుత్వ పాఠశాల వద్దకు గురువారం పెద్దసంఖ్యలో వీధికుక్కలు చేరుకున్నాయి. నాలుగు కొండముచ్చులు అక్కడికి రావడంతో వాటిపై కుక్కలు దాడి చేశాయి.

ప్రైవేటు ఆస్పత్రిలో పాణిగ్రహణం

మంచిర్యాల టౌన్: కల్యాణ మంటపంలో పెళ్లి జరగాల్సిన వేళ.. హఠాత్తుగా వధువు అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. దీంతో వధువు చెంతకు వరుడు తరలి వచ్చాడు.. ముహూర్త సమయానికి ఆస్పత్రిలోనే మూడు ముళ్లు వేశాడు.. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం లంబాడిపల్లి గ్రామానికి చెందిన బానోతు శైలజతో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘణపురం మండలం బాస్వరాజ్‌పల్లి గ్రామానికి చెందిన హట్కర్ తిరుపతి వివాహానికి ఈ నెల 23న ముహూర్తం నిర్ణయించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంతలో పెళ్లికూతురు బుధవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో.. వెంటనే ఆమెను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం వధువు కోలుకుంటోంది. పండితులు నిర్ణయించిన ముహూర్తానికే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న వరుడు తిరుపతి.. వెంటనే వధువు శైలజ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వచ్చి ఆమె మెడలో తాళి కట్టాడు.



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు



నెల్లూరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు, విద్యార్థి సంఘం నేతలు



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో పచ్చ పత్రికలను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు



విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పచ్చ పత్రికలను దహనం చేస్తున్న ప్రజలు, వివిధ సంఘాల నేతలు



చిత్తూరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం



విశాఖ జిల్లా గాజువాకలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు



కర్నూలులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

కట్టుకథలు రాస్తున్న ఈనాడుపై జనాగ్రహం

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం చేయాలనే కుట్రతోనే ఈనాడు పత్రిక దిగజారుడు వార్తలు, కథనాలు రాస్తోందని మంత్రులు ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేయాలని, సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లకుండా చేయాలనే దురుద్దేశం.. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చి, చంద్రబాబుకు ప్రజలను చేరువ చేయాలని రాజగురువు రామోజీ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు. ఈనాడు దినపత్రిక కాదు.. చంద్రబాబు కరపత్రిక అని పలు ప్రాంతాల్లో నినదించారు.

ఇవి సోషల్ మీడియా రోజులు

పట్టాభి అనే వ్యక్తి జాతీయ నేతలా ఎల్లో మీడియా జాకీలు వేసి లేపుతోందని, ఇవి ఎల్లో మీడియా రోజులు కావని.. సోషల్ మీడియా రోజులు అని ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎల్లో మీడియా అని ముద్దుగా పిలుచుకునే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, అనుబంధ సంస్థలు ప్రచురిస్తున్న, చూపుతున్న వార్తలు, కథనాలు చూస్తుంటే ఇంకా దిగజారిపోవడానికి వారికి మెట్లు ఏమీ లేవు అని నిరూపించుకున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు మాత్రమే బాగుండాలనేది రామోజీరావు సిద్ధాంతం.. రామోజీరావుకు వయసు పెరిగి.. బుద్ధి మందగించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తూర్పారబట్టారు. కుట్రల రామోజీని బట్టలూడదీసి ప్రజల ముందు నిలబెడతామని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరావు(నాని) హెచ్చరించారు. దుష్ప్రచారం చేసేటప్పుడు బ్యానర్ ఐటమ్స్.. సవరణకు మాత్రం సింగిల్ కాలమా? అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు నిలదీశారు. రామోజీ ఆరాటమే తప్ప.. చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్ లేదని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సంబంధం లేని ఫొటోలను ప్రచురించి ప్రజలను మోసం చేయాలని ఈనాడు యాజమాన్యం కుట్ర చేసిందని, సోషల్ మీడియా దెబ్బకు దిగొచ్చిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ శాసన సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు.



గుంటూరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం



ఒంగోలులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న మహిళలు

రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదు చంద్రబాబు మాత్రం బాగుండాలనేది రామోజీరావు సిద్ధాంతమని పలువురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు.

రామోజీరావు దిష్టి బొమ్మ దహనం

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన ప్రభుత్వంపై ఈనాడు విషం చిమ్ముతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారని విజయవాడలో పలువురు నేతలు మండిపడ్డారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ మంటల్లో ఈనాడు ప్రతులను తగులబెట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో 'పచ్చ'రాతలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. విషపు రాతలు రాస్తున్న 'ఈనాడు' పత్రికను వైఎస్సార్‌సీపీ శ్రేణులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు పెద్ద ఎత్తున సాగాయి. నిరసన కార్యక్రమాలతో విశాఖపట్నం జిల్లా దద్దరిల్లింది. ఇకనైనా నీచపు రాతలు మానుకోవాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు.. రామోజీకి హితవు పలికారు. ప్రభుత్వంపై కక్ష కట్టి ఈనాడు రాస్తున్న అబద్ధపు రాతలను శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా నేతలు ఖండిస్తూ నిరసన తెలిపారు.

పెల్లుబికిన ఆగ్రహం

అసత్యాలను ప్రచారం చేస్తున్న ఈనాడు పత్రికను బహిష్కరించాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి. ఎక్కడికక్కడ ఈనాడు ప్రతులను దహనం చేశారు. వైఎస్సార్ జిల్లాలోని కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, తదితర పట్టణాల్లో ఈనాడు ప్రతులు కాల్చివేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5లను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ తన క్యాంపు కార్యాలయం ఎదుట ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతల ఆధ్వర్యంలో ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎమ్మెల్యేలతో కలిసి ఈనాడు పత్రిక ప్రతులను తగులబెట్టారు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం వలివేరు గ్రామంలో మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

రెడ్ హ్యాండెడ్‌గా చిక్కి సాంకేతిక సాకులా?

- రామోజీపై మాజీ మంత్రులు కొడాలి నాని, కన్నబాబు, వెలంపల్లి మండిపాటు
- పిచ్చి రాతలను ఇంకా సహిస్తామనుకోవద్దు
- బహిరంగ క్షమాపణలు కోరకుంటే ఈనాడు ప్రతులను ఊరూరా దహనం చేస్తాం
- చంద్రబాబు కరపత్రికేనని మరోసారి రుజువైంది
- పోలీసులే లేకుంటే పట్టాభి పరిస్థితిని ఊహించుకోండి

సాక్షి, అమరావతి, కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి జగన్‌పై అనునిత్యం దుష్ప్రచారం చేస్తూ పాత ఫోటోలను అచ్చేసి రామోజీరావు అనే దొంగ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారని మాజీ మంత్రులు కొడాలి నాని, కురసాల కన్నబాబు, వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గతంలో మాదిరిగా పిచ్చి రాతలు రాస్తే ఇంకా చూస్తూ ఊరుకుంటామనుకోవద్దని హెచ్చరించారు. నాలుగు పేజీల్లో పట్టాభి బొమ్మలతో ఎలా తప్పుడు ప్రచారం చేశారో అదే రీతిలో రాష్ట్ర ప్రజలకు, వైఎస్సార్ సీపీకి, ముఖ్యమంత్రి జగన్‌కు, పోలీసు వ్యవస్థకు క్షమాపణలు చెప్పాలని స్పష్టం చేశారు. లేదంటే ఈనాడు ప్రతులను నిత్యం ఊరూరా దహనం చేస్తామని ప్రకటించారు. కుట్రలకు పాల్పడుతున్న రామోజీ నిజ స్వరూపాన్ని ప్రజల్లో ఎండగడతామని తేల్చి చెప్పారు. గన్నవరం ఘటనలో పట్టాభి ఉదంతంతో ఈనాడు దినపత్రిక చంద్రబాబు కరపత్రికేనని మరోసారి రుజువైందని చెప్పారు. అక్కడ పోలీసులే లేకుంటే పట్టాభి పరిస్థితి ఎలా ఉండేదో ఒక్కసారి ఊహించుకోవాలని సూచించారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, అనుబంధ సంస్థల తీరు చూస్తుంటే ఇక దిగజారేందుకు మెట్లే లేవన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. గురువారం తాడేపల్లి, కాకినాడలో వారు మీడియాతో మాట్లాడారు.

పోలీసులే లేకుంటే..

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



రాష్ట్రంలో పట్టాభి లాంటి వాళ్లు బోలెడంత మంది రోజూ ఏదో ఒకటి చేస్తుంటారు. అది కూడా ఒక వార్తా? ఒళ్లు పెరిగినా బుర్ర పెరగని పట్టాభిని అక్కడికి పంపి కుట్రలకు పాల్పడ్డారు. బీసీలపై దాడి చేసింది ఎవరు? ఈ ఘటనలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వారికి ఒక్క దెబ్బకూడా తగలలేదు. మధ్యలో ఉన్న పోలీసులకు మాత్రం తల పగిలింది. పోలీసు వ్యవస్థపై అభాండాలు వేస్తున్నారు. పోలీసులే లేకుంటే పట్టాభి పరిస్థితి ఏమిటి? పట్టాభిని రక్షించి ఆయనకు బదులుగా సీఐ దెబ్బలు తింటే అంతు చూస్తానంటూ మాట్లాడతారా? సీఐ ఇప్పటికీ ఐసీయూలో ఉన్నారు. ఇంత చేస్తే 307 కేసు పెట్టకుండా పోలీసులు ఏం చేస్తారు?

కన్నా గౌరవం పోగొట్టుకున్నారు

అడపా శేషు, కాపు కార్పొరేషన్ చైర్మన్



కన్నా లక్ష్మీనారాయణ టీడీపీలో చేరి కాపుల్లో ఉన్న గౌరవాన్ని పోగొట్టుకున్నారు. వంగవీటి రంగాతో పాటు తనని కూడా హత్య చేసేందుకు చంద్రబాబు ప్రయత్నించారని కన్నా లక్ష్మీనారాయణ గతంలో ఎన్నోసార్లు చెప్పిన విషయం ప్రజలకు గుర్తుంది.

ఇంగిత జ్ఞానం లేదా?: కురసాల కన్నబాబు



వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రిపై బురద జల్లేందుకు బ్యానర్ స్టోరీలను ప్రచురిస్తారు. పేజీలకు పేజీలు నింపుతారు. అదే తప్పు జరిగితే ఫస్ట్ పేజీలో సవరణ వేయాలనే ఇంగిత జ్ఞానం లేదా? జర్నలిజం విలువలు వదిలేసి చంద్రబాబును అధికారంలోకి తేవాలనే లక్ష్యంగా ఈనాడు యాజమాన్యం పని చేస్తున్నట్లు తేటతెల్లమైంది. పట్టాభిని పెద్ద నేతగా చిత్రీకరించేందుకు పుంఖాను పుంఖాలుగా అసత్యాలు, పాత ఫొటోలతో కట్టు కథలు ప్రచురిస్తున్నారు. ఇవి ఎల్లో మీడియా రోజులు కావు.. సోషల్ మీడియా కాలం. ఈనాడు నిర్వాకాలను సోషల్ మీడియా ఎండగట్టడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దిగి వచ్చింది. ముఖ్యమంత్రి జగన్ అత్యధికంగా బీసీలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు టీడీపీ, ఎల్లో మీడియా డ్రామాలాడుతున్నాయి. ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తున్న సీపీఐ నేత నారాయణకు పట్టాభి దారుణమైన దూషణలు వినిపించడం లేదా? విపక్షాలు ఎంత రెచ్చగొడుతున్నా సీఎం జగన్ సంయమనంతో ముందుకు వెళ్తున్నారు.

రామోజీ.. ఎందుకీ సిగ్గులేని జన్మ?

కొడాలి నాని, మాజీ మంత్రి



టేబుల్ మీద ఉన్న ఒక ఫోటో బదులు మరొక ఫోటో వేస్తే సాంకేతిక లోపం అంటారు. మరి 2021 నాటి ఫోటోలు టేబుల్ మీదకు ఎలా వచ్చాయి? మూడేళ్లనాటి పట్టాభి ఫోటోలు ఎవరిచ్చారు? కావాలని ప్రచురించి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేశారు. రాష్ట్ర ప్రజలకు దొంగలా దొరికిపోయి సాంకేతిక లోపం అంటారా? సిగ్గు లేదా? రామోజీరావుకి వయసు రాగానే సరిపోదు. దాదాపు 90 ఏళ్లు వచ్చాయి. ఇంకేం కట్టుకుపోతారు? రాష్ట్ర ప్రజల్ని మోసం చేసి, పేదల్ని ఇంకా కిందకు తొక్కేసి ఏం చేయాలనుకుంటున్నారు. ఎన్టీఆర్‌ని పొట్టనపెట్టుకున్నావ్. వైఎస్ రాజశేఖరరెడ్డిని పొట్టన పెట్టుకోవడానికి ప్రయత్నించావ్. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దృష్టి పెట్టారు. ఎందుకీ సిగ్గులేని జన్మ? సీఎం వైఎస్ జగన్ రాజకీయాలు తెలియని వ్యక్తి కాదు. నాడు ఎన్టీఆర్‌ను ఇబ్బంది పెట్టినట్లుగా ఇబ్బంది పెడదామని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోవడానికి ఆయనేమీ వృద్ధ సింహం కాదు. మీలాంటి వారిని ఎంతో మందిని చూసిన యువసింహం సీఎం జగన్. కాలం మారింది. రామోజీరావు ఆటలు, కుట్రలు ఇక సాగవు. ఎన్టీఆర్ ఉంటే మద్యపాన నిషేధం, బాబు వస్తే నిషేధం వల్ల నష్టం ఇదీ రామోజీరావు విధానం. పట్టాభి బొమ్మలేసుకునే స్థాయికి దిగజారారు. తప్పుడు రాతలపై ప్రజలు ఉమ్మేస్తే కనపడకుండా చిన్న సవరణ ఇచ్చారు. 50 ఏళ్లుగా పెంచి పోషిస్తున్న మీ పాఠకులకైనా క్షమాపణలు చెప్పాలి కదా? పట్టాభిని గన్నవరం పంపి రెచ్చగొట్టి గొడవలు సృష్టించింది చంద్రబాబే. సీఐ తల పగులగొట్టినా కేసు పెట్టకూడదా? పట్టాభికి మాత్రమే భార్యాపిల్లలున్నారా?

వివేకా హత్యలో రూ.40 కోట్ల డీల్ జరిగిందని 20 రోజుల క్రితం లోకేశ్ చెబితే ఈ రోజు సీబీఐ కౌంటర్‌లో అదే ఉంది. లోకేశ్‌కి ముందే ఎలా తెలిసింది? కన్నా లక్ష్మీనారాయణ పనికిరాడనే బీజేపీ పక్కన పెట్టింది. పాదయాత్రలో లోకేశ్ చిటికెలు వేసినా, చప్పట్లు కొట్టినా లాభం లేదు.

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

- పట్టాభి ఘటనపై రామోజీకి మంత్రి అంబటి అల్టిమేటం

సాక్షి, అమరావతి: తప్పుడు కథనాలను ప్రచురిస్తున్న ఈనాడుపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్సార్‌సీపీ యుద్ధం చేస్తుందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టాభి ఘటనలో సాంకేతికంగా జరిగిన తప్పులకు చింతిస్తున్నట్లుగా ఎవరికీ కనపడకుండా రామోజీరావు నాలుగు ముక్కలను ప్రచురించడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే నేరపూరిత పరువు నష్టం దావా (క్రిమినల్ డిఫర్మేషన్) వేస్తామని హెచ్చరించారు. మంత్రి అంబటి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

టీడీపీ పోర్న్ స్టార్లతో బూతులు..

రాజకీయంగా కథ ముగిసిన చంద్రబాబు పునరుజ్జీవం కోసం సీఎం జగన్, ప్రభుత్వంపై బురద జల్లుతూ తప్పుడు కథనాలను ప్రచురిస్తారా? టీడీపీ పోర్న్ స్టార్‌లు పట్టాభి, లోకేశ్, చింతకాయల అయ్యన్నలతో సీఎం జగన్‌ను బూతులు తిట్టిస్తూ చంద్రబాబు సైకోలా ఆనందిస్తుంటే ఆర్థిక నేరగాడు రామోజీరావు వాటిని ప్రచురించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. మార్గదర్శి ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడి రూ.వేల కోట్లతో రామోజీ నిర్మించుకున్న అక్రమ సామ్రాజ్యానికి చంద్రబాబు రక్షకుడిలా వ్యవహరిస్తున్నారు. రామోజీ ఆరాటమేగానీ రాజకీయంగా చంద్రబాబు బతికి బట్టకట్టడం అసాధ్యం.

నైతిక విలువలు లేని కన్నా..

తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం కన్నా లక్ష్మీనారాయణకు బాగా అలవాటే. విభజన తర్వాత కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. బీజేపీ పెద్దలు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తానని చెప్పడంతో వైఎస్సార్‌సీపీలో చేరకుండా గుండె నొప్పి వచ్చినట్లు ఆసుపత్రిలో చేరారు. తర్వాత తిన్నింటి వాసాలు లెక్కపెట్టి జనసేనలో చేరేందుకు ప్రయత్నించారు. అక్కడ బేరం కుదరకపోవడంతో ముహూర్తం పెట్టుకుని మరీ టీడీపీలో చేరటం ద్వారా కన్నా నైతికంగా, రాజకీయంగా చనిపోయినట్లే. వంగవీటి రంగాను, తనను హత్య చేయాలని చంద్రబాబు కుట్ర పన్నారని.. రంగాను చంపడంలో ఆయన సక్సెస్ అయినా తనను చంపలేకపోయారని కన్నా అనేక సందర్భాల్లో చెప్పారు. బాబును గతంలో ఆయన అనేకసార్లు దూషించారు. సీఎం జగన్‌పై నోరు జారొద్దు.. జాగ్రత్త!.

హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి

వరుసగా రెండోసారి ఎన్నిక

హోరాహోరీ పోరులో 20 ఓట్లతో వేణుగోపాలరావుపై విజయం... ఉపాధ్యక్షుడిగా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్



జానకీరామిరెడ్డి



సురేష్‌కుమార్



సాయికుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కె.జానకీరామిరెడ్డి మరోసారి గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి ఉప్పుటూరు వేణుగోపాలరావుపై 20 ఓట్ల తేడాతో గెలిచారు. ప్రతి రౌండ్‌లో నువ్వా, నేనా అన్నట్లు సాగిన ఓట్ల లెక్కింపులో చివరకు విజయం జానకీరామిరెడ్డిని వరించింది. మొత్తం 1,438 ఓట్లు పోల్ కాగా.. జానకీరామిరెడ్డికి 703, వేణుగోపాలరావుకు 683, మరో అభ్యర్థి డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబుకు 38 ఓట్లు వచ్చాయి. కొన్ని ఓట్లు చెల్లలేదు. వేణుగోపాలరావు విజయావకాశాలను ప్రసాద్ బాబు ప్రభావితం చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. ఇప్పటి వరకు సంఘం చరిత్రలో వరుసగా రెండు సార్లు గెలిచిన వ్యక్తి ఎవరూ లేరు. కాగా ఉపాధ్యక్షుడిగా పీఎస్‌పీ సురేష్‌కుమార్ గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి తుహిన్ కుమార్‌పై 52 ఓట్ల తేడాతో గెలిచారు. సురేష్‌కు 739 ఓట్లు రాగా తుహిన్‌కు 687 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్ ఎన్నికయ్యారు. ఆయన టి.సింగయ్య గౌడ్‌పై 142 ఓట్ల మెజారిటీతో గెలిచారు. సంయుక్త కార్యదర్శిగా సాల్మన్ రాజు గెలుపొందారు. ఆయన వై.సోమరాజుపై 56 ఓట్ల తేడాతో విజయం సాధించారు. కోశాధికారిగా బీవీ అపర్ణలక్ష్మి 75 ఓట్లతో, గ్రంథాలయ కార్యదర్శిగా జ్ఞానేశ్వరరావు 4 ఓట్లతో, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి పితాని 213 ఓట్లతో గెలిచారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా అన్నం శ్రీధర్, మారుతి విద్యాసాగర్, కాశీ అన్నపూర్ణ, షేక్ ఆసిఫ్, శాంతికిరణ్, శరత్, అచ్యుతరామయ్య విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా విజయ్‌కుమార్ వ్యవహరించారు. ఎన్నికల్లో జానకీరామిరెడ్డి వర్గం ఓవైపు నిలవగా, ఆయన్ను ఓడించేందుకు టీడీపీ, జనసేన, కమ్యూనిస్టు పార్టీలు ఏకమయ్యాయి.

క్లుప్తంగా...

ఇదెక్కడి 'చిల్లర' నామినేషన్!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి రూ.10 వేలు చిల్లర తెచ్చిన అభ్యర్థి
- లెక్కపెట్టిన విశాఖపట్నం కలెక్టరేట్ సిబ్బంది
- రూ.6 వేలు మాత్రమే ఉన్నాయని తేల్చిన వైనం
- 4 గంటలపాటు హైడ్రామా



సాక్షి, విశాఖపట్నం: ఈ చిత్రాన్ని జాగ్రత్తగా గమనించండి.. చిల్లర లెక్కిస్తూ కొందరు కనిపిస్తున్నారు కదా..! ఇదేదో దేవాలయంలో హుండీ లెక్కింపునకు సంబంధించిన చిత్రం అనుకుంటే పొరపాటే. ఇది విశాఖపట్నం కలెక్టరేట్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కేంద్రం. అయితే ఇక్కడ చిల్లర ఏంటి అని అనుకుంటున్నారా?.. ఈ చిత్రంలో తెల్లటి దుస్తుల్లో ఉన్న వ్యక్తికి చెందిన చిల్లర ఇది. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం ప్రాంతం నుంచి వచ్చిన ఈ వ్యక్తి పేరు.. ఎన్. రాజశేఖర్. ఈయన పట్టభద్రుడు. ప్రస్తుతం శ్రీముఖలింగం దేవాలయ ప్రధానార్చకుడుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి తన వద్ద ఉన్న చిల్లర మొత్తాన్ని డిపాజిట్‌గా కట్టేందుకు తీసుకొచ్చారు. ఈ రెండో చిత్రంలో కనిపిస్తున్న బ్యాగ్‌లో తీసుకొచ్చిన చిల్లరని అధికారులకు రూ.10 వేలు అని చెప్పి అందించారు. ఆ చిల్లర మొత్తం చూసి సిబ్బంది మొత్తం షాక్ అయ్యారు. చిల్లరంతా పోగేసి నలుగురైదుగురు సిబ్బంది లెక్క పెట్టారు. ఇందుకు దాదాపు రెండున్నర గంటల సమయం పట్టింది. రూపాయి, రూ.2, రూ.5 నాణేల్ని లెక్కించగా మొత్తం రూ.6 వేలే ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కాసేపు రాద్ధాంతం కూడా జరిగింది. మిగిలిన మొత్తాన్ని నోట్ల రూపంలో చెల్లించి.. చివరికి నాలుగు గంటల హైడ్రామా అనంతరం రాజశేఖర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఏదేమైనా.. ఈ చిల్లర మొత్తం లెక్కపెట్టి.. నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యే సరికి తల ప్రాణం తోకకొచ్చిందని ఎన్నికల సిబ్బంది వాపోయారు.

అధికార భాషా సంఘం ప్రతిష్టను పెంచాలి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ



రజత్ భార్గవను కలిసి అధికార భాషా సంఘం అధ్యక్షుడు, సభ్యులు

సాక్షి, అమరావతి: అధికార భాషా సంఘం ప్రతిష్టను పెంచేలా సభ్యులు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆకాంక్షించారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఇటీవల కొత్తగా నియమితులైన నలుగురు సభ్యులు కత్తి వెంకటేశ్వర్లు, జి.రామచంద్రారెడ్డి, డి.మస్తానమ్మ, టి.వెంకటయ్య గురువారం సచివాలయంలో రజత్ భార్గవను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషకు సేవ చేసే అదృష్టం దక్కడం గొప్ప వరమన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వివిధ శాఖల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరిగేలా అధికార భాషా సంఘం కృషి చేయాలని కోరారు.

బాలిక గొంతు కోసిన వ్యక్తి

- గంజాయి మత్తులో ఘాతుకం
- నెల్లూరు జిల్లా కావలిలో ఘటన
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



ఖాదర్‌బాషా

కావలి రూరల్: పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆడుకుంటున్న మూడో తరగతి బాలిక (8)ను గంజాయి మత్తులో ఖాదర్‌బాషా (30) అనే వ్యక్తి గొంతు కోసిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో కలకలం రేపింది. గురువారం రెండో పట్టణ ఎస్సై మాల్యాద్రి తెలిపిన వివరాల మేరకు.. కావలి వెంగళరావునగర్‌కు చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. బాలిక తండ్రి కొయ్య పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలిద్దరినీ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాడు. ఈ క్రమంలో మూడో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె పాఠశాల నుంచి వచ్చాక ఇంటి ముందు ఆడుకుంటోంది. ఇదే సమయంలో గంజాయి మత్తులో ఉన్న తుఫాన్‌నగర్‌కు చెందిన ఖాదర్‌బాషా అటుగా వెళుతూ బాలికను పిలిచి బ్లేడ్‌తో కిరాతకంగా గొంతుకోశాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు పరుగున బయటకు వచ్చి చూశారు. చికిత్స నిమిత్తం బాలికను హుటాహుటిన వైద్యశాలకు తరలించారు. అక్కడే ఉన్న నిందితుడు ఖాదర్‌బాషా తానే బాలిక గొంతు కోశానని తల్లిదండ్రులకు చెప్పి పరారవుతుండడంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మాల్యాద్రి తెలిపారు. కాగా బాలికకు ప్రమాదమేమీ లేదని వైద్యులు తెలిపారు. ఆమె గొంతుకు కుట్లు వేసి ఇంటికి పంపారు.

రెడీమేడ్ ఇళ్లు.. భలే మోడళ్లు

దేశంలో పలుచోట్ల లైట్‌హౌస్ ప్రాజెక్టులు

- నిర్మాణ రంగంలో సరికొత్త విప్లవం
- ఖర్చు తక్కువ.. నాణ్యత ఎక్కువ
- 6 రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా 6,368 ఇళ్ల నిర్మాణం
- ఇప్పటికే చెన్నై, రాజ్‌కోట్‌లో పూర్తయిన ప్రాజెక్టులు

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అత్యాధునిక సాంకేతికతతో కూడిన రెడీమేడ్ ఇళ్ల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేస్తోంది. మన దేశ వాతావరణానికి తగ్గట్టుగా తక్కువ ఖర్చుతో.. నాణ్యమైన ఇళ్ల నిర్మాణాన్ని 6 విభిన్న మోడళ్లలో ప్రయోగాత్మకంగా చేపట్టింది. ఈ టెక్నాలజీపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 'గ్లోబల్ హౌసింగ్ టెక్నాలజీ' పేరిట లైట్ హౌస్ ప్రాజెక్టులను ప్రారంభించి.. వాటిని లైవ్ లేబొరేటరీలుగా మార్చింది.









సాక్షి, అమరావతి: పట్టణ గృహ నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఇటుక, సిమెంట్‌తో నెలల తరబడి ఇళ్ల నిర్మాణాలు చేయక్కర్లేకుండా ఫ్యాక్టరీలోనే దాదాపు 90 శాతం ఇంటి పనులు పూర్తయిపోతాయి. విడిభాగాలను సైట్‌కు తరలించి బిగిస్తే బహుళ అంతస్తుల భవనం సిద్ధమైపోతుంది. విదేశాల్లో అమలులో ఉన్న ఈ టెక్నాలజీని ఇప్పుడు మనదేశంలో చేపట్టే నిర్మాణాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తక్కువ ఖర్చుతో వేగంగా బహుళ అంతస్తుల భవనం సిద్ధం కావడం ఇందులో ప్రత్యేకత. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్మాణ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 54 అత్యుత్తమ ప్రాజెక్టులను పరిశీలించి మనకు అనువైన 6 మోడళ్లను ఎంపిక చేసింది. ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్లోబల్ హౌసింగ్ టెక్నాలజీ ఛాలెంజ్ పేరుతో చెన్నై, రాజ్‌కోట్, ఇండోర్, లక్నో, రాంచీ, త్రిపురలో నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణ రంగంలో సరికొత్త విప్లవంగాను, లైట్ హౌస్ ప్రాజెక్టులుగా పేర్కొంటున్న వీటిని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కాలేజీలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణ రంగంలో ఉన్న సంస్థలకు లైవ్ లేబొరేటరీలుగా ఉపయోగపడనున్నాయి.

ఆరు ప్రాజెక్టుల్లో 6,368 ఇళ్ల నిర్మాణం

భిన్న భౌగోళిక, వాతావరణ పరిస్థితులున్న 6 రాష్ట్రాల్లో విభిన్న టెక్నాలజీలను ఉపయోగించి నిర్మాణాలను చేపట్టారు. ప్రీకాస్ట్ కాంక్రీట్ నిర్మాణ విధానంలో చెన్నైలో అన్ని వసతులతో 1,152 ఇళ్లను రికార్డు స్థాయిలో పూర్తి చేశారు. రాజ్‌కోట్‌లో మోనోలిథిక్ కాంక్రీట్ టెక్నాలజీతో 1,144 ఇళ్లను నిర్మించారు. ఈ రెండు ప్రాజెక్టులు కోవిడ్‌తో దేశంలో ప్రతికూల పరిస్థితులున్నా తక్కువ కాలంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఇండోర్‌లో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ శాండ్‌విచ్ ప్యానెల్ విధానంలో 1,024 ఇళ్లు, లక్నోలో పీవీసీ ఫ్రేంవర్క్ టెక్నాలజీతో 1,040 ఇళ్లు, రాంచీలో ప్రీకాస్ట్ కాంక్రీట్–3డీ నిర్మాణ విధానంలో 1,008 ఇళ్లు, అగర్తల (త్రిపుర)లో లైట్‌గేజ్ స్టీల్ స్ట్రక్చరల్ విధానంలో 1,000 ఇళ్లు నిర్మించారు. ఇకపై దేశంలోని అన్ని పట్టణాల్లో ప్రభుత్వం నిర్మించే ఇళ్లకు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని యోచిస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ప్రీకాస్ట్ కాంక్రీట్ విధానంలో..

ఈ విధానంలో భవనం గోడలు, స్లాబ్, మెట్లు, బీమ్ మొదలైన అన్ని భాగాలు ప్లాంట్ లేదా కాస్టింగ్ యార్డ్‌లో తయారు చేసి, సైట్‌లో ఒకదానికొకటి బిగిస్తారు. కాంక్రీట్‌ను కూడా ఫ్లైయాష్, గ్రౌండ్ గ్రాన్యులేటెడ్ బ్లాస్ట్ ఫర్నేస్ స్లాగ్, మైక్రో సిలికా వంటి పారిశ్రామిక ఉప ఉత్పత్తులతో చేస్తారు. దీంతో మన్నికగా ఉండడంతో పాటు సహజ వనరులను సంరక్షించినట్టవుతుని నిపుణులు చెబుతున్నారు. ఈ టెక్నాలజీతో చెన్నైలో 1,152 ఇళ్లను నిర్మించారు.

మోనోలిథిక్ టన్నెల్ కాంక్రీట్‌తో..

'టన్నెల్‌ఫార్మ్'గా పిలిచే అచ్చుల్లో స్లాబ్‌లు, గోడలు, గదులను ఒకేసారి వేస్తారు. ఇవి చాలా బలంగా ఉంటాయి. ఒక్కరోజులో సెంట్రింగ్ సపోర్టును తొలగించవచ్చు. గోడలకు ప్లాస్టరింగ్ అవసరం ఉండదు. వీటికీ ఫ్లైయాష్, గ్రౌండ్ గ్రాన్యులేటెడ్ బ్లాస్ట్ ఫర్నేస్ స్లాగ్, మైక్రో సిలికా వంటి పారిశ్రామిక ఉప ఉత్పత్తులతో కాంక్రీట్ తయారు చేస్తారు. బాక్స్ టైప్ మోనోలిథిక్ స్ట్రక్చర్ కావడంతో భూకంపం, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుంటుంది. గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఈ టెక్నాలజీతో 1,144 ఇళ్లను నిర్మించారు.

శాండ్‌విచ్ ప్యానెల్ టెక్నాలజీ ఇలా..

ఎక్కువ అంతస్తుల భవనాలు నిర్మించేటప్పుడు సంప్రదాయ ఇటుక గోడలకు బదులుగా ఫ్యాక్టరీలో తయారైన సిమెంట్ లేదా కాల్షియం సిలికేట్ బోర్డులను వాడతారు. స్టీల్ ఫ్రేమ్డ్ స్ట్రక్చర్‌కు గోడలుగా ఈ బోర్డులను బిగిస్తారు. వీటిని ఫ్యాక్టరీలోనే తయారు చేసి సైట్‌లో ఒకదానికొకటి అనుసంధానిస్తారు. ఇవి తక్కువ బరువుతో పాటు మెరుగైన థర్మల్ ఇన్సులేషన్‌గానూ పనిచేస్తాయి. బలమైన పునాది కూడా అవసరం లేదు. ఇండోర్ (మధ్యప్రదేశ్)లో ఈ టెక్నాలజీతో 1,024 ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

పీవీసీ పాలిమర్ కాంక్రీట్ టెక్నాలజీ

ఈ టెక్నాలజీలో ఇంటి ప్లాన్ ప్రకారం పాలీ వీనైల్ క్లోరైడ్ (పీవీసీ) వాల్ ప్యానెళ్లు ఫ్యాక్టరీలో తయారు చేసి సైట్‌లో బిగిస్తారు. స్ట్రక్చరల్ ఫ్రేమ్స్ బిగించిన తర్వాత గోడ ప్యానెళ్లను డెక్కింగ్ ఫ్లోర్‌తో అనుసంధానం చేస్తారు. గోడ ప్యానెళ్ల మధ్యనున్న ఖాళీల్లో కాంక్రీట్ నింపుతారు. లక్నోలో 1,040 ఇళ్లను ఈ టెక్నాలజీతో చేపట్టారు.

ప్రీకాస్ట్ కాంక్రీట్- 3డీ వాల్యూ మెట్రిక్ విధానం

3డీ వాల్యూమెట్రిక్ కాంక్రీట్ నిర్మాణంలో గదులు, టాయిలెట్, కిచెన్, బాత్రూమ్, మెట్లు.. ఇలా వేటికవే మాడ్యూల్స్‌గా యార్డులో నిర్మించి సైట్‌లో బిగిస్తారు. ఇలా ఒకదానిపై మరొకటిగా ఎన్ని అంతస్తులైనా బిగించవచ్చు. ఇక్కడ ప్రత్యేకంగా గోడలంటూ వేరుగా ఉండవు. అన్ని వాతావరణాలను తట్టుకోవడం దీని ప్రత్యేకత. ఈ విధానంలో రాంచీలో 1,008 ఇళ్లను నిర్మిస్తున్నారు.

లైట్‌గేజ్ స్టీల్ స్ట్రక్చరల్- ప్రీ ఇంజనీర్డ్ స్ట్రక్చరల్

పునాది అవసరం లేని ఈ టెక్నాలజీలో గాల్వనైజ్డ్ లైట్ గేజ్ స్టీల్ భాగాలతో ఇంటి భాగాలను బిగిస్తారు. ఫ్రేమ్‌ల మధ్యలో ఇన్సులేషన్ మెటీరియల్‌ను నింపి, తేలికపాటి కాంక్రీట్ ప్యానెళ్లను గోడలుగా అతికిస్తారు. ఈ విధానంలో నాలుగు అంతస్తుల భవనాన్ని నెల రోజుల్లోనే నిర్మించవచ్చు. భవనాన్ని విడదీసి మరోచోటుకు తరలించవచ్చు. స్టీల్ ఫ్రేమ్ బీమ్‌లు తేలిగ్గా ఉండటంతో భూకంపాలను తట్టుకుంటుంది. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నిర్మాణాలకు అనువైనది కావడంతో అగర్తల (త్రిపుర)లో 1,000 ఇళ్లను నిర్మించారు.

దిగజారిన 'ఈనాడు'

- అసత్య ప్రచారం మరోసారి బట్టబయలు
- పట్టాభిని పోలీసులు హింసించారంటూ పాత ఫొటోలతో బ్యానర్
- అడ్డంగా దొరికాక లోపలి పేజీలో సింగిల్ కాలం వివరణ
- ఏపీ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మండిపాటు

సాక్షి, అమరావతి: సీహెచ్ రామోజీరావు సారథ్యంలోని ఈనాడులో నిజాయితీ లోపించిందని.. మోసపూరిత, కుట్ర పూరిత అసత్య ప్రచారం మరోమారు తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావులు మండిపడ్డారు. పాత ఫొటోలతో పాఠకులను మోసం చేయడం దురదృష్టకరమని గురువారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. గన్నవరంలో జరిగిన ఘటనలకు సంబంధించి పట్టాభిని కొట్టారంటూ ఈనాడు దినపత్రికలో ప్రచురించిన కథనంలో పాత ఫొటోలు వేసి పాఠకులను మోసం చేయాలని భావించడం దారుణం అన్నారు. అసలు నిజం బయట పడ్డాక, అది సాంకేతిక లోపం వల్ల జరిగిందంటూ లోపలి పేజీలో సింగిల్ కాలమ్ వార్తతో సమర్థించుకునే యత్నం మరీ అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై, పోలీసులపై ప్రజల్లో వ్యతిరేకత పెంచే లక్ష్యంతో రాసినట్లున్న ఆ కథనంలో 2021 ఫిబ్రవరి 3వ తేదీ నాటి ఫొటోలను ముద్రించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆ ప్రకటనల్లో వారు ఇంకా ఏమేం చెప్పారంటే..

- టీడీపీ నేత పట్టాభికి సంబంధించిన వార్తలు బ్యానర్ గానే కాకుండా.. పుంఖానుపుంఖాలుగా మూడు పేజీల్లో పరిచిన తీరు ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తన వివరణను, విచారాన్ని మొదటి పేజీలో వేసి ఉంటే పత్రికా ప్రమాణాలను పాటించినట్లుండేది.
- తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడుకు వత్తాసు పలికే క్రమంలో రామోజీరావు, ఆయన మీడియా నిస్సిగ్గుగా విశ్వసనీయతనే పణంగా పెట్టి అభూత కల్పనలకు పాల్పడి పరువు పోగొట్టుకుంది. ఈ ఘటనతో అయినా కళ్లు తెరవాలి.
- తాము ఏం రాసినా జనం నమ్మేస్తారనుకుని ఇంతకాలం జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు వంకర రాతల గుట్టును సోషల్ మీడియా రట్టు చేసింది. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధించారన్న పట్టాభి మాటలను పట్టుకుని, కనీసం విచారించకుండానే ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజార్చాలనుకోవడం తగదు.
- ఈనాడుతో పాటు చంద్రబాబు విధేయ పత్రికలు, న్యూస్ చానల్స్ తమ వంకర, పక్షపాత, కుట్రపూరిత, మోసపూరిత ధోరణులకు ఇకనైనా స్వస్తి చెప్పాలి.

విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం అండ:మంత్రి పెద్దిరెడ్డి



విద్యుత్ ఉద్యోగులతో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నేతలు సచివాలయంలో గురువారం మంత్రిని, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డిలను కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రధానంగా పాత పద్ధతిలోనే ఇన్‌హౌస్ కమిటీని ఏర్పాటు చేసి పే రివిజన్ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు విద్యుత్ సంస్థలు నేరుగా జీతాలిచ్చేలా చూడాలని కోరారు. పే రివిజన్ కమిషన్(పీఆర్సీ)ను ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై కేబినెట్ సబ్ కమిటీ రిపోర్ట్ వచ్చే వరకూ వేచి చూడాలని, ఆ రిపోర్ట్ ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తెలిపారు. సమాన పనికి సమాన వేతనం విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి రానున్న పీఆర్సీ కమిటీలో చర్చిస్తామని భరోసా ఇచ్చారు. జేఏసీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సెక్రటరీ జనరల్ ప్రతాపరెడ్డి, కన్వీనర్ బి.సాయి కృష్ణ, కో–చైర్మన్ బి.శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు రూ.1,611.27 కోట్లు

మొదటి పేజీ తరువాయి

కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్దేశించారు. కృష్ణా, గోదావరి జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో పంట కోతలు, నూర్పిడులు కొద్దిగా ఆలస్యం అవుతాయి. అందువల్ల అక్కడ వచ్చే నెల నుంచి ధాన్యం కొనుగోళ్లు జరగనున్నాయి.

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఇలా..

జిల్లా	సేకరణ టన్నుల్లో	రైతుల సంఖ్య	ధాన్యం విలువ(రూ.)	చెల్లింపులు శాతాల్లో
పశ్చిమ గోదావరి	3,76,568	63,957	768.20	99.73
ఏలూరు	3,78,560	52,311	773.99	99.19
కృష్ణా	4,96,310	58,476	1,013.74	93.65
శ్రీకాకుళం	4,90,893	1,10,312	1,001.45	93.66
విజయనగరం	3,31,942	87,077	677.17	95.69
తూర్పుగోదావరి	2,52,753	43,129	515.62	99.59
కాకినాడ	2,59,684	53,665	529.79	99.11
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	2,41,892	51,459	493.46	99.79
పార్వతీపురం మన్యం	2,15,329	40,400	439.28	96.60
ఎన్టీఆర్	1,14,676	14,486	236.10	79.12
బాపట్ల	61,720	8,486	127.09	97.21
అల్లూరి సీతారామరాజు	25,874	5,258	52.79	95.21
గుంటూరు	13,310	1,630	27.32	96.93
అనకాపల్లి	28,621	8,594	58.39	91.15
విశాఖపట్నం	5,970	1,342	12.18	98.60
పల్నాడు	2,186	347	4.47	97.32
ప్రకాశం	1,282	199	2.63	92.78
అనంతపురం	115	15	0.24	100
నంద్యాల	51	4	0.11	100

అరుదైన సందర్భాల్లో మధ్యంతర ఉత్తర్వులు

- రొటీన్‌గా, క్యాజువల్‌గా వాటిని ఇవ్వడానికి వీల్లేదు
- రఘురామకృష్ణరాజును అరెస్టుచేయడం అవసరమైతే అర్నేష్‌కుమార్ తీర్పును పాటించండి
- బలవంతపు చర్యలు తీసుకోవద్దన్న ఉత్తర్వులు సైతం అరుదైన కేసుల్లోనే ఇవ్వగలం: హైకోర్టు

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ల, పెనుమంట్ర పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులో నర్సాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజును అరెస్ట్‌చేయాల్సి వస్తే అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పనిసరిగా పాటించాలని హైకోర్టు గురువారం పోలీసులను ఆదేశించింది. సీఆర్‌పీసీ సెక్షన్–482 కింద ఉన్న అధికారాన్ని ఉపయోగించి అరుదుగా మాత్రమే మధ్యంతర ఉత్తర్వులను జారీచేయగలదన్న అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనతో హైకోర్టు ఏకీభవించింది. అలాగే, రొటీన్‌గా, క్యాజువల్‌గా కూడా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయరాదన్న వాదనను సైతం పరిగణనలోకి తీసుకుంది. దర్యాప్తు పురోగతిలో ఉన్నప్పుడు నిందితులను అరెస్టుచేయకుండా, ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులిచ్చే విషయంలో కోర్టులు నియంత్రణ పాటించాల్సి ఉంటుందని హైకోర్టు తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులను అత్యంత అరుదైన సందర్భాల్లోనే ఇవ్వడానికి వీలుంటుందని తెలిపింది. ప్రస్తుత కేసులు తనపై ఉన్న విషయం పిటిషనర్‌కు ఈ ఏడాది జనవరి 27 నుంచే తెలుసునని, ప్రస్తుతం పిటిషన్లు దాఖలు చేసి మధ్యంతర ఉత్తర్వులు కోరడం మినహా, ఇతర చట్ట నిబంధనల కింద ఆయన తీసుకోవాల్సిన చర్యలేమీ తీసుకోలేదని న్యాయస్థానం ఆక్షేపించింది. అలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదన్న దానికి రఘురామ ఎలాంటి వివరణ ఇవ్వలేదదంది. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరిస్తామని పోలీసులు చెబుతున్నారని, దీంతో రఘురామ సురక్షితంగా గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావచ్చునంది. ఒకవేళ అరెస్టు అవసరమైన పక్షంలో పోలీసులు అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును పాటించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ల, పెనుమంట్ర పోలీస్‌స్టేషన్లలో తనపై నమోదైన కేసులను కొట్టేయాలని కోరుతూ రఘురామకృష్ణరాజు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై గురువారం జస్టిస్ భానుమతి విచారణ జరిపారు. రఘురామ తరపు న్యాయవాది పీవీజీ ఉమేష్ వాదనలు వినిపిస్తూ.. ఈనెల 24న గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు ఈ కేసులు పిటిషనర్‌కు ప్రతిబంధకంగా ఉన్నాయని.. పిటిషనర్‌ను అరెస్టుచేయకుండా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. పోలీసుల తరపున అదనపు పీపీ దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఏది పడితే అది మాట్లాడానికి వీల్లేదన్నారు. గవర్నర్ ప్రమాణ స్వీకారానికి రఘురామకు లిఖితపూర్వక ఆహ్వానం ఏదీలేదన్నారు. ఏడేళ్లలోపు శిక్షపడే అన్నీ కేసుల్లో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వాలని అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు చెప్పలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆ కేసులో 'సుప్రీం' మార్గదర్శకాలను పాటించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరైన కారణాలు లేకుండా హైకోర్టులు బలవంతపు చర్యలొద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని దుష్యంత్ కోర్టుకు నివేదించారు.

కమిటీ ద్వారానే వక్ఫ్ భూములు లీజుకిస్తాం

- రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఖాదర్ బాషా
- టీడీపీ హయాంలో అన్యాక్రాంతమైన భూములను వెనక్కి తీసుకుంటాం
- విశాఖలో ఓడిపోయిన టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఆక్రమణలో 250 ఎకరాలు



మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఖాదర్ బాషా తదితరులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణకు ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించిందని బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా చెప్పారు. ఈ కమిటీ నిర్ణయం మేరకే భూములు లీజుకి ఇస్తామని తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ తమ బాధ్యత అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 64 వేల ఎకరాల వక్ఫ్ భూముల్లో 28 వేల ఎకరాలకు పైగా ఆక్రమణలో ఉన్నాయన్నారు. వక్ఫ్ భూములు ఆక్రమించి భవనాలు నిర్మించిన వారి నుంచి లీజ్ వసూలు చేస్తామని, తద్వారా బోర్డుకు ఆదాయమూ వస్తుందని చెప్పారు. వక్ఫ్ బోర్డు భూములు 'అల్లా'కి సంబంధించినవని, వాటిలో ఒక్క రూపాయి కూడా సొంతానికి ఉపయోగించబోమని స్పష్టంచేశారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములన్నింటినీ వెనక్కి తీసుకుంటామని తెలిపారు. విశాఖలో 250 ఎకరాల వక్ఫ్ భూములను టీడీపీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిన అచ్చెన్నాయుడు ఆక్రమించారని, త్వరలో వాటిని వెనక్కి తీసుకుంటామని చెప్పారు. వారి తప్పులు బయటపడతాయనే భయంతోనే ముందస్తుగా పచ్చ పత్రిక ఆంధ్రజ్యోతిలో అవాస్తవాలు రాయిస్తున్నారని మండిపడ్డారు. హిందూజా, ఎన్టీపీసీలకు చంద్రబాబు ప్రభుత్వమే నిబంధనలకు విరుద్ధంగా వక్ఫ్ భూములను ధారాదత్తం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం గుంతలు పూడ్చడానికి హిందుజా నుంచి రూ.200 కోట్లు తీసుకుందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ అగ్రిమెంట్ రద్దు చేస్తే ఈ విషయం బయట పడిందన్నారు. దాన్ని మళ్లీ తాము రెన్యువల్ మాత్రమే చేశామన్నారు. ఆ భూమి అన్యాక్రాంతమైందంటూ అవాస్తవాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

సమర్థంగా రసాయన ప్రమాదాల నియంత్రణ

ఎన్‌డీఎంఏ ప్రతినిధి తకర్, ఎస్‌డీఎంఏ ఎండీ అంబేడ్కర్

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: భారీపరిశ్రమల్లో సంభవించే రసాయన ప్రమాదాలను సైతం సమర్థంగా నివారించే శక్తిసామర్థ్యాలు మనకున్నాయని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రతినిధి బ్రిగేడ్ బి.ఎస్.తకర్ చెప్పారు. అగ్ని ప్రమాదాలతో పాటు ఫ్యాక్టరీల్లో సంభవించే ఇతర ప్రమాదాల నివారణపైనా దృష్టిపెట్టినట్టు తెలిపారు. ఎన్‌డీఎంఏ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎస్‌డీఎంఏ) సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రంలోని 17 జిల్లాల్లో ఆఫ్‌సైట్, ఆన్‌సైట్ ఫ్యాక్టరీల్లో కెమికల్ ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. విశాఖపట్నంలోని ఈస్ట్ ఇండియా హెచ్‌పీసీఎల్ వద్ద నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను బ్రిగేడ్ బి.ఎస్.తకర్, ఎస్‌డీఎంఏ ఎండీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.ఎస్.సి.వర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తకర్ మాట్లాడుతూ ఇలాంటి మాక్‌డ్రిల్స్‌తో పరిశ్రమల్లో రసాయన ప్రమాదాలు జరిగినప్పుడు యాజమాన్యం, ఆయా జిల్లాల యంత్రాంగం స్పందించి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. డాక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ సహజ, మానవ తప్పిదాలతో జరిగే విపత్తులతోపాటు కెమికల్ డిజాస్టర్స్‌పైనా దృష్టి సారించినట్లు తెలిపారు. అవగాహన, ముందుజాగ్రత్త చర్యలతో పాటు ప్రణాళిక రూపొందించడం ద్వారా రసాయనిక ప్రమాదాల స్థాయిని తగ్గించవచ్చన్నారు. భవిష్యత్‌లో వరదలు, తుపాన్లపైనా మాక్‌డ్రిల్స్‌తో అవగాహన కల్పిస్తామని చెప్పారు. 17 జిల్లాల్లో నిర్వహించిన మాక్‌డ్రిల్స్‌లో.. ఫ్యాక్టరీల్లో రసాయనిక ప్రమాదాలు జరిగితే ఎలా ప్రతి స్పందించి చర్యలు తీసుకుంటారో ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రత్యక్షంగా చూపించాయి.

మీలో ఎవరు మంచి పనులు చేస్తారో (మరెవరు చెడ్డపనులు చేస్తారో) పరీక్షించడానికి ఆయన జీవన్మరణాలు సృష్టించాడు. ఆయన మహా శక్తిమంతుడు, గొప్ప క్షమాశీలి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, ఫిబ్రవరి, 24

ఈ యుద్ధం ఇంకెన్నాళ్లు?

పోరుగునున్న బలహీన దేశం ఉక్రెయిన్‌ను లొంగదీసుకునేందుకు రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం ఏడాదయ్యేసరికి మరింత జటిలంగా మారింది. నిరుడు ఫిబ్రవరి 24న రెండు లక్షలమంది సైన్యాన్ని ఉక్రెయిన్ వైపు నడిపించిన రష్యా ఇప్పుడు ఆ సంఖ్యను అయిదు లక్షలకు పెంచింది. ఏడాదైన సందర్భంగా ఉక్రెయిన్ నైతిక స్థైర్యాన్ని పెంచడానికంటూ ఆ గడ్డపై అడుగుపెట్టిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ప్రసంగం, ఆ తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడిన తీరు చూస్తే ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. నిజానికి ఇప్పటికే వైరి వర్గాల మోహరింపు మొదలైంది. ఏడాది క్రితం యుద్ధంలో ప్రధాన పాత్రధారులు రష్యా–ఉక్రెయిన్‌లే. ప్రస్తుతం అమెరికా మద్దతుతో యూరోప్ దేశాలు అందులో పీకల్లోతు కూరుకుపోయాయి. రష్యాకు మారణాయుధాలిస్తే ఖబడ్దార్ అంటూ అమెరికా చేసిన హెచ్చరికకు జవాబన్నట్టు చైనా కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ విధాన నిపుణుడు వాంగ్ యీ బుధవారం మాస్కో సందర్శించి రష్యాతో తమ బంధం మరింత దృఢమవుతుందని ప్రకటించారు. పేరుకు చిన్న దేశమే అయినా అమెరికా పుణ్యమా అని ప్రస్తుతం ఉక్రెయిన్ దగ్గర మారణాయుధాలు, యుద్ధ ట్యాంకులు, గురిచూసి లక్ష్యాన్ని ఛేదించే బాంబులు, అత్యాధునిక యుద్ధ సామగ్రి, కోట్లాది డాలర్ల నిధులు పుష్కలంగా ఉన్నాయి. దేశం మరుభూమిగా మారినా రష్యాను చావుదెబ్బ తీయటంలో అవన్నీ ఉక్రెయిన్‌కు తోడ్పడుతున్నాయి.

నిజానికి అమెరికా మొదట్లో చాలానే ఆశించింది. రష్యాపై ప్రపంచవ్యాప్తంగా ఏహ్యభావం వస్తుందని, అది ఏకాకవుతుందని భావించింది. కానీ అలాంటి ఛాయలు కనబడటం లేదు. తమ దేశంపై 2001లో వేలాదిమంది మరణానికి కారణమైన సెప్టెంబర్ 11 ఉగ్రదాడి అనంతరం 'వాళ్లెందుకు మమ్మల్ని ద్వేషిస్తున్నార'ంటూ అల్‌ఖైదా ఉగ్రవాదుల గురించి ప్రశ్నించిన అమెరికా ఇప్పుడు ఆ ప్రశ్నను కాస్త తిరగేసి అడుగుతోంది. 'వాళ్లెందుకు ద్వేషించటం లేద'న్నది ఆ ప్రశ్న సారాంశం. ఇక్కడ 'వాళ్లు' అంటే రష్యన్లు. నిజమే, అమెరికా ఒత్తిడికి తలొగ్గి అయిష్టంగానైనా ఉక్రెయిన్‌కు మారణాయుధాలు అందజేస్తున్న యూరోప్ దేశాలు రష్యా నుంచి దిగుమతులు మాత్రం ఆపలేదు. తనకు సాగిలపడలేదన్న కక్షతో ఇరాన్‌పై గతంలో తీవ్ర ఆంక్షలు విధించి ఆ దేశాన్ని ఆర్థిక దిగ్బంధం చేసిన అమెరికా ఇప్పుడు రష్యాపై ఆ స్థాయిలో విరుచుకుపడటం లేదు. రష్యా చమురు, సహజ వాయువుల ఎగుమతిలో ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉండటం మాత్రమే కాదు... నికెల్, అల్యూమినియం, టైటానియం వంటి లోహాలూ, రసాయన వాయువులూ, సెమీ కండక్టర్లూ, గోధుమలూ, ఎరువుల ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉంది. కఠిన ఆంక్షలతో ఇవన్నీ ఆగిపోతాయన్న భయాందోళనలు అమెరికా, యూరోప్ దేశాల్లో ఉన్నాయి. ఇక ముడి చమురును రష్యా చాలా చవగ్గా మనకూ, చైనాకూ విక్రయిస్తోంది. మన దేశం అక్కడినుంచి రోజూ 12 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఏడాదిక్రితంతో పోలిస్తే ఇది 33 రెట్లు ఎక్కువ. ఇలా అనేకానేక కారణాలవల్ల రష్యాపై ప్రపంచ దేశాల్లో ఏహ్యభావం లేదు. పైపెచ్చు ఉక్రెయిన్‌కు అత్యుత్సాహంతో అమెరికా, యూరోప్ దేశాలు మారణాయుధాలు అందిస్తున్న తీరువెనక వారికి వేరే ప్రయోజనాలున్నాయని ప్రపంచం విశ్వసిస్తోంది. అది పాశ్చాత్య దేశాల చేతిలో కీలుబొమ్మ అని రష్యా చేస్తున్న ప్రచారం నిజం కావొచ్చన్న అభిప్రాయం కలుగుతోంది. ఒక సర్వే ప్రకారం భారత్, చైనా, తుర్కియే దేశాల్లో అత్యధికులు రష్యాకు అనుకూలంగానే ఉన్నారని వెల్లడైంది. సోవియెట్ యూనియన్ ఉనికిలో ఉన్నప్పుడు దాన్ని అగ్రరాజ్యంగా, ప్రమాదకరమైన శక్తిగా భావించేవారు. ఇప్పుడు రష్యాపై ఆ ముద్ర లేదు.

ప్రచ్ఛన్న యుద్ధ దశ ముగిశాక అమెరికా, రష్యాల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగిన పర్యవసానంగా 2010లో అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందం(స్టార్ట్) కుదిరింది. దాని కాలపరిమితి 2026 ఫిబ్రవరిలో ముగియబోతోంది. కొత్త ఒప్పందంపై మొదలైన చర్చలను నిలిపేస్తున్నట్టు ప్రకటించి పుతిన్ అందరినీ ఆందోళనలో పడేశారు. ఏ పక్షమూ మొదటగా అణ్వాయుధాలు ఉపయోగించకుండా నియంత్రించే ఆ ఒప్పందం ఒక్కటే రెండు దేశాల మధ్యా మిగిలింది. దాన్ని కాస్తా పునరుద్ధరించటానికి చర్యలు తీసుకోకపోతే ప్రపంచ మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఇక రెండు దేశాలూ తమ అణ్వాయుధాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థేమీ మిగలదు. పుతిన్ మరో మాట కూడా అన్నారు. అమెరికా గనుక అణు పరీక్షలు మొదలుపెడితే తాము కూడా సర్వసన్నద్ధంగా ఉన్నామని ప్రకటించారు. యుద్ధం ఆగనంతకాలమూ ఇలా సవాళ్లు, ప్రతి సవాళ్లతో పరిస్థితి నానాటికీ దిగజారుతుంది. యూరోప్ భద్రత ప్రమాదంలో పడుతుంది. యుద్ధాన్ని విరమించి శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోమని మన దేశం ఇరుపక్షాలకూ చెబుతోంది. కానీ మున్ముందు ఇలా మధ్యవర్తిత్వం వహించే అవకాశాలు కూడా ఉండవు. ఇప్పటికే 80 లక్షలమంది ఉక్రెయిన్ పౌరులు కొంపా గోడూ వదిలి వలసపోయారు. వేలాదిమంది మరణించారు. అనేకులు వికలాంగులయ్యారు. అటు రష్యా సైతం భారీగా నష్టపోయింది. బలహీన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలు ఈ యుద్ధంతో సంక్షోభంలో పడ్డాయి. అందుకే మతిమాలిన ఈ యుద్ధాన్ని విరమించేలా రష్యాపై ప్రపంచం ఒత్తిడి తేవాలి. ఉక్రెయిన్‌కు సాయం పేరిట పరిస్థితి మరింత విషమించే చర్యలకు స్వస్తి పలకాలని అమెరికాను కోరాలి. యుద్ధంతో అంతిమంగా మిగిలేది విషాదమేనని గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.పంచమి తె.5.31 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి షష్ఠి, నక్షత్రం: రేవతి ఉ.8.24 వరకు, తదుపరి అశ్విని, వర్జ్యం: తె.4.10 నుండి 5.45 వరకు (తెల్లవారితే శనివారం), దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.32 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, అమృతఘడియలు: ఉ.6.02 నుండి 7.28 వరకు.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం: 6.00
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పచ్చ పైత్యం ముదిరిపోయింది!

వివేకా హత్య కేసులో సీబీఐ పేరు చెబుతూ మరో దుర్మార్గపు వంటకం

చనిపోయిన మనిషి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం శ్మశానానికి తీసుకువెళ్తూ... ఏమో బతుకుతాడేమోననే దింపుడు కళ్లెం ఆశతో మధ్యలో పాడెను ఓసారి కిందకు దించి మరీ చూస్తారు!!. రాష్ట్రంలో రాజకీయంగా టీడీపీ అంతిమయాత్ర కొనసాగుతున్న తరుణంలో... ఎల్లో మీడియాలో ఇదే దింపుడు కళ్లెం ఆశ మిణుకు మిణుకుమంటోంది. అందుకే ఆ పార్టీని బతికించేందుకు రోజుకో రీతిలో రాజకీయ కుట్రకు తెరతీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిత్యం విషం చిమ్ముతోంది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ వార్తలు, కథనాల పేరిట అభూతకల్పనలు, అవాస్తవాలను ప్రతిరోజూ అచ్చేస్తూ... పాత్రికేయ విలువలకు పాతరవేస్తోంది. సీబీఐ న్యాయస్థానంలో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ పేరిట ఈనాడు, దాని తోక మీడియా మరోసారి అదే పచ్చ పైత్యాన్ని ప్రదర్శించాయి. అసలు ఆ అఫిడవిట్‌లో ఏముందనే దానితో పని లేకుండా.... చంద్రబాబు పోసిన 'పచ్చ' సిరాను తమ పెన్నుల్లో నింపేసుకుని విచ్చలవిడి రాతలకు దిగాయి. 2019లో టీడీపీ ఘోర పరాజయం పాలవ్వగానే చంద్రబాబు బీజేపీలోకి పంపిన తన కోవర్టుల ద్వారా ఈ కేసు దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. అందుకే దర్యాప్తు దారితప్పిందన్నది సుస్పష్టం. తమకు అదే కావాలన్న రీతిలో అటు చంద్రబాబు ఇటు పచ్చ మీడియా వైఎస్సార్ కుటుంబంపై నిస్సిగ్గుగా బురద జల్లుతున్నాయి.

సునీల్ యాదవ్‌పై విరుద్ధ వాదనలేల?

ఏది నిజం?

ఈ కేసులో నిందితుడు సునీల్ యాదవ్ కదలికలు అత్యంత కీలకమని సీబీఐ చెబుతోంది. ప్రధానంగా వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున సునీల్‌యాదవ్ ఎక్కడెక్కడ తిరిగారన్నది దర్యాప్తులో తాము కనుగొన్న అతి ముఖ్యమైన విషయంగా పేర్కొంది. మరి అంత ముఖ్యమైన అంశంపై సీబీఐ 2021లో న్యాయస్థానానికి చెప్పిన మాటకు... ఇప్పుడు సీబీఐ కోర్టుకు చెప్పిన మాటకు పొంతన లేదెందుకు? సునీల్ యాదవ్‌ను 2021, ఆగస్టులో సీబీఐ అరెస్టు చేసింది. 2021, డిసెంబర్‌లో చార్జ్‌షీట్ వేసింది. అందులో వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున... వివేకా ఇంటి పరిసరాల్లోనే సునీల్ యాదవ్ తిరిగినట్టు సీబీఐ పేర్కొంది. సునీల్ మొబైల్ ఫోన్ లొకేషన్‌ను గూగుల్ టేకౌట్ విధానం ద్వారా నిర్ధారించి ఈ విషయాన్ని కనుగొన్నట్టు తెలిపింది. కేసులో ఇదే అత్యంత కీలకమైన సాక్ష్యమని కూడా న్యాయస్థానానికి నివేదించింది. మరి సీబీఐ వద్ద అంత పక్కా సమాచారం ఉంటే దాని ఆధారంగా కేసు దర్యాప్తును ఎందుకు వేగవంతం చేయలేదు?. నేరుగా చర్యలు తీసుకోవచ్చు కదా? వెంటనే కేసు దర్యాప్తును కొలిక్కి తేవచ్చు కదా? కానీ అలా చేయలేదు. హత్య జరిగిన నాడు వైఎస్ భాస్కర్ రెడ్డి ఇంట్లో సునీల్ యాదవ్ ఉన్నారని నాటి చార్జిషీట్లో చెప్పనే లేదు.

ఇప్పుడు 14 నెలల తరువాత... హఠాత్తుగా సునీల్ యాదవ్ ఆ రోజు వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టు న్యాయస్థానానికి సీబీఐ చెప్పడం వెనుక మతలబేంటి? బోడిగుండుకు మోకాలికి ముడి పెట్టాలని ఎందుకు ప్రయత్నిస్తోంది? సునీల్ యాదవ్ కదలికలను గుర్తించి ఉంటే 2021 నాటి చార్జ్‌షీట్లోనే ఎందుకు చెప్పలేదు...!? ఇప్పుడెందుకు కొత్తగా చెబుతున్నారు? న్యాయస్థానానికి రెండు వేర్వేరు సందర్భాల్లో రెండు వేర్వేరు వాదనలు వినిపించడమేంటి? ఇదంతా యాదృచ్ఛికం కాదని... ఓ స్కెచ్ ప్రకారమే జరుగుతోందని అర్థం కావటం లేదూ?

వారు వివేకాకు సన్నిహితులు కాదా!?

వివేకా హత్య కేసులో మోకాలికి– బోడి గుండుకు ముడిపెట్టేందుకు పచ్చ మీడియా యత్నిస్తోంది. వివేకానందరెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డి మధ్య విభేదాలున్నాయని ఈనాడు పతాక శీర్షికల్లో రాసింది. వారి మధ్య కడప ఎంపీ టికెట్ కోసం విభేదాలున్నాయని సీబీఐ అధికారులు చెబుతున్నట్లు కూడా పేర్కొంది. పోనీ ఆ మాటకే కట్టుబడి ఉన్నారా అంటే... అదీ లేదు. ఈ కేసులో అరెస్టయిన నిందితులు ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దస్తగిరి వివేకానందరెడ్డికి సన్నిహితులని చెప్పేదీ ఈనాడే. ఆ నలుగురే మళ్లీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలతో కలసి వివేకా హత్యకు కుట్రపన్నారని రాసేదీ ఈనాడే. సీబీఐ అధికారులు కూడా ఇదే మాటలు వల్లె వేస్తున్నారు. ఇది కుట్ర కాదా రామోజీ? ఎర్రగంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరిలు వైఎస్ వివేకానందరెడ్డికి ఎన్నో ఏళ్లుగా సన్నిహితులని సీబీఐ చెబుతోంది. అది నిజం కూడా. వివేకాకు సన్నిహితులు కనక వారికి సహజంగానే వివేకా కుటుంబీకులతో కూడా సన్నిహిత సంబంధాలుంటాయి. అంటే వివేకానందరెడ్డి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలకు కూడా ఆ నలుగురు సన్నిహితులేనన్నది అందరికీ తెలిసిన విషయమే. నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి హైదరాబాద్‌లో తన మనవరాలి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తూ పులివెందుల నుంచి ఒక్క ఎర్ర గంగిరెడ్డినే ఆహ్వానించారు. అంటే వారంతా సన్నిహితులేనన్నది సుస్పష్టం. ఇక వైఎస్ వివేకానంద రెడ్డిని ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరిలు


వివేకా హత్యకు ముందు

అవినాష్ ఇంట్లో సునీల్

ఈనాడు ప్రచురించిన కథనం

హత్య చేశారని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో కూడా పేర్కొంది.

ఇక్కడ గమనించాల్సిందేంటంటే... ఎవరైనా చెబితే ఆ హత్య చేశారా? వ్యక్తిగత, ఆర్థిక విభేదాలతోనే హత్యకు పాల్పడ్డారా? అనేది. వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయన్నది రహస్యమేమీ కాదు. తన రెండో భార్యకు ఆస్తిలో వాటా ఇవ్వాలని... ఆమెకు, తనకు పుట్టిన కొడుకును వారసుడిగా ప్రకటించాలని వైఎస్ వివేకా భావించారు. దీన్ని ఆయన కుటుంబం వ్యతిరేకించింది. ఆయన భార్య హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె సునీత వద్దకు వెళ్లిపోయారు. ఇదంతా పులివెందులలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ వ్యవహారంలోనే వివేకా రెండో భార్యను సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్ రెడ్డి బెదిరించారన్నది కూడా కాదనలేని నిజం. ఈ నేపథ్యంలో వైఎస్ వివేకానందరెడ్డిని సునీల్ యాదవ్, దస్తగిరి, ఉమాశంకర్‌రెడ్డి హత్య చేస్తే...అందుకు ఎర్రగంగిరెడ్డి దగ్గరుండి సహకరిస్తే... దాని వెనుక నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డిల ప్రమేయం ఉండే అవకాశాలూ ఉంటాయి కదా? పైగా వివేకా మరణించిన విషయం మొదటగా ఆయన కుమార్తె సునీత, భార్య సౌభాగ్యమ్మ, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డిలకే తెలిసింది. ఉదయాన్నే జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారానికి బయలుదేరిన వైఎస్ అవినాశ్ రెడ్డికి... నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెబితేనే ఈ మృతి విషయం తెలిసింది. ఆ ఫోన్‌కాల్‌తోనే ఆయన వెనక్కి తిరిగి పులివెందుల వచ్చారు.

ఫోన్లో మెసేజీలు డిలీట్ చేయలేదా?

పైపెచ్చు వివేకా రాసిన లేఖను, ఆయన సెల్‌ఫోన్‌ను తామొచ్చే వరకూ ఎవరికీ ఇవ్వొద్దని పీఏ కృష్ణారెడ్డికి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. వారు వచ్చిన తరువాత, ఆ ఫోన్లోని కొన్ని మెసేజీలను డిలీట్ చేశాకే దాన్ని పోలీసులకు ఇచ్చారు. ఈ పరిణామాలన్నీ వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిల పాత్రపైనా సందేహాలను లేవనెత్తుతున్నాయి కదా? మరి వాళ్లనెందుకు సీబీఐ విచారించటం లేదు? ఆ దిశగా దర్యాప్తు ఎందుకు చేయటం లేదు? అంతేకాదు వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పుడు వేసిన సిట్ దర్యాప్తు నివేదికగానీ...అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నివేదికనుగానీ సీబీఐ ఏమాత్రం పట్టించుకోలేదు. వాటిని పక్కన పడేసి సీబీఐలో కిందిస్థాయి అధికారులు కొందరు... దర్యాప్తును కావాలనుకున్న దిశగా నడిపిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పోనీ టీడీపీ, ఈనాడు ఆరోపిస్తున్నట్టుగా వైఎస్ వివేకా, వైఎస్ అవినాశ్ మధ్య విభేదాలు ఉండటమే నిజమైతే... వివేకా సన్నిహితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరిలు సహజంగానే అవినాశ్‌కు దూరంగా ఉంటారు. తమకు ఆప్తుడైన వివేకా అంటే సరిపడని అవినాశ్ రెడ్డితో వారెందుకు సన్నిహితంగా ఉంటారు? మరి ఆ నలుగురే హత్య చేశారు అనుకుంటే దాంతో అవినాశ్‌కి గానీ ఆయన కుటుంబ సభ్యులకుగానీ ఎటువంటి సంబంధం ఉండదు కదా?. ఈ చిన్న లాజిక్‌ను సీబీఐ, టీడీపీ, పచ్చ మీడియా ఎందుకు మిస్ అవుతున్నాయి? కేవలం ముఖ్యమంత్రి కుటుంబంపై బురదజల్లేందుకేనని అర్థం కావటం లేదా?

సాక్షులు చెప్పని మాటలు కూడా...

సీబీఐ దర్యాప్తు తీరులో విస్మయం కలిగించే అంశమేంటంటే... ఈ కేసులో సాక్షులు చెప్పని విషయాలనూ వారి వాంగ్మూలాలుగా నమోదు చేయడం!!. బహుశా గతంలో ఎప్పుడూ పోలీసుల విచారణలో గానీ, సీబీఐ దర్యాప్తులో గానీ ఇలాంటి ఆరోపణలు రాలేదు. కానీ వివేకా హత్య కేసులో ఎంతోమంది సాక్షులు తాము చెప్పని మాటలను సీబీఐ అధికారులు ఏకపక్షంగా నమోదు చేసేసి... మీడియాకు లీకులిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సీబీఐ అధికారులు పేర్కొన్న శశికళ అనే మహిళ వాంగ్మూలం కూడా అదే రీతిలో ఉంది. వివేకా గుండెపోటుతో మరణించినట్లుగా ఎంపీ అవినాశ్ రెడ్డి తనతో చెప్పారని శశికళ వాంగ్మూలమిచ్చినట్లుగా సీబీఐ పేర్కొంది. కానీ ఈ విషయాన్ని శశికళ ఖండించారు. అవినాశ్ రెడ్డి తనతో ఏమీ చెప్పనే లేదని... తాను అసలు అవినాశ్‌తో ఈ విషయంపై మాట్లాడనే లేదని ఆమె స్పష్టం చేశారు. అదే మాటను ఆమె గతంలో సిట్ విచారణలోనూ, ప్రస్తుత సీబీఐ దర్యాప్తులోనూ చెప్పారు. కానీ తాను చెప్పని మాటలను చెప్పినట్టుగా సీబీఐ అధికారులు ఎందుకు వాంగ్మూలంగా రాసుకున్నారో తెలియడం లేదని శశికళ వాపోయారు. ఈ విషయాన్ని తనతో కనీసం నిర్ధారించుకోకుండా ఈనాడు, ఇతర మీడియా ఏకపక్షంగా రాసేసినట్లు ఆమె తెలియజేశారు. రామోజీరావు నీతిమాలిన పాత్రికేయంపై ఆమె మండిపడ్డారు. గతంలోనూ పలువురి విషయంలో ఇలాంటివి జరగటం ఇక్కడ గమనార్హం. వైఎస్సార్ కుటుంబ సభ్యుడు వైఎస్ అభిషేక్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వెల్లపు వర ప్రసాద్, రఘునాథ రెడ్డి, అనంతపురం జిల్లాకు చెందిన గంగాధర్‌రెడ్డిలతోపాటు 71 ఏళ్ల ప్రభావతమ్మ అనే మహిళ కూడా ఇలాగే చెప్పారు. తాము చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ అధికారులు వాంగ్మూలం నమోదు చేశారని వారు తెలియజేశారు. దీనిపై అధికారికంగా ఫిర్యాదు కూడా చేశారు. ఎందుకిలా జరుగుతోంది? ఈ తరహా సీబీఐ వాంగ్మూలాలు ఎల్లో మీడియాకు మాత్రమే ఎలా చేరుతున్నాయి? దీనివెనక ఉన్న అదృశ్య శక్తులేంటి? అన్నివేళ్లూ చూపిస్తున్నది చంద్రబాబు వైపే!!. వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక ఇలా దొడ్డిదారి పోరాటానికి బాబు దిగారన్నది తేలిగ్గానే అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో ఓడిపోయాక బీజేపీలోకి పంపిన కోవర్టులు చంద్రబాబుకు ఈ వ్యవహారంలో సహకరిస్తున్నారన్నది రహస్యమేమీ కాదు.

ఫ్లెక్సీలో ఫొటో ఉంటే ప్రభావితం చేయడమా..!?

సీబీఐ పేరు చెబుతూ 'ఈనాడు' రాసిన మరో దుర్మార్గపు రాత ఇది. ఈ కేసులో అరెస్టయిన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు తన ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా వేయించిన ఫ్లెక్సీలో ఎంపీ అవినాశ్ రెడ్డి ఫొటో పెట్టారట. తద్వారా తన వెనుక ఎంతమంది పరపతి గలవారున్నారో అని కేసును, సాక్షులను ప్రభావితం చేసేందుకు యత్నించారట!!. అదీ ఈనాడు వెళ్లగక్కిన పైత్యం. ఫ్లెక్సీలో ఓ నాయకుడి ఫొటో పెడితే అది సాక్షులను ప్రభావితం చేయడం అవుతుందా? గతంలో బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఉండేవి. కొన్నేళ్లుగా ఫ్లెక్సీలు వచ్చాయి. చిన్న సెలూన్ ప్రారంభోత్సవం నుంచి షాపింగ్ మాల్స్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సాధారణమైపోయింది. ఆ సందర్భంగా తమ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతల ఫొటోలు ఆ ఫ్లెక్సీల్లో వేయటం సహజం. దీన్ని కూడా తప్పుబడతారా? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రమంతటా ఆయన ఫొటోలు ఎందరో ఫ్లెక్సీల్లో వేశారు... ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్నాసరే ఆయన ఫొటోలు ఆ పార్టీ నేతలు ఫ్లెక్సీల్లో వేస్తున్నారు. అంత మాత్రాన వారంతా చంద్రబాబు ఫొటో చూపించి అందర్నీ బెదిరిస్తున్నట్టు భావించాలా? మరి ఫ్లెక్సీల్లో చంద్రబాబు ఫొటోలుంటే లేని అభ్యంతరం... ఎంపీ అవినాశ్ రెడ్డి ఉంటే మాత్రం బెదిరించడం.. సాక్షులను ప్రభావితం చేయడం ఎలా అవుతుంది రామోజీ గారూ?.

అవినాశ్‌కు టికెట్టు ఖరారు చేశాక కూడా...

సీబీఐ కౌంటర్ అఫిడవిట్ అంటూ ఈనాడు, దాని తోకమీడియా వండిన కథనాలన్నీ అవాస్తవాలే. అసలు కడప ఎంపీ టికెట్‌పై విభేదాలు రేగే అవకాశం ఎక్కడుంది? అవినాశ్ రెడ్డి అప్పటికే కడప ఎంపీ. ఆయనకే టికెట్ ఇస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అప్పటికే ధ్రువీకరించారు. జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్న వైఎస్ వివేకానందరెడ్డి... ఎంపీగా అవినాశ్‌ను గెలిపించడానికి ప్రచారం కూడా మొదలు పెట్టారు. ముందురోజు రాత్రి జమ్మలమడుగులో ప్రచారం చేసి ఇంటికి వచ్చాక... ఆ రోజు అర్ధరాత్రి ఆయన హత్యకు గురయ్యారు. ఎంపీగా అవినాశ్ విజయం కోసం తన తండ్రి ప్రచారం చేస్తున్నారని వైఎస్ వివేకా హత్య తరువాత ఆయన కుమార్తె సునీత మీడియాతో కూడా చెప్పారు. మరి ఎంపీ టికెట్‌పై వివేకా, అవినాశ్ మధ్య విభేదాలున్నాయని పచ్చ మీడియా పదే పదే రాస్తుండటం రాజకీయ కుట్ర కాక మరేమిటి?

ఇక వివేకా హత్యకు రూ.40కోట్లు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారనే మరో నిరాధార ఆరోపణ కూడా పదే పదే చేస్తున్నారు. అందుకోసం రూ.5 కోట్లు అడ్వాన్స్ ఇచ్చారని... అందులో తనకు రూ.కోటి కూడా ఇచ్చారని దస్తగిరి అప్రూవర్‌గా మారుతూ ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు సీబీఐ తెలిపింది. మరి హత్య చేయడానికి 10 రోజులు ముందే చేతిలో కోటి రూపాయలున్న దస్తగిరి.. ఆ తరవాత రూ.5వేలు, రూ.10వేల అప్పు కోసం పులివెందులలో అందరి చుట్టూ ఎందుకు తిరిగాడు?

సునీల్ యాదవ్ తనకివ్వాల్సిన రూ.3 లక్షలు ఇప్పించాలంటూ... ఆ మేరకు దస్తావేజులు చూపిస్తూ మరీ దస్తగిరి ప్రాథేయపడటం నిజం కాదా...! ఆ దస్తావేజులను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు కదా!. అంటే దస్తగిరికి రూ.కోటి ఇచ్చారన్నది అబద్ధమని స్పష్టమవుతోంది కదా? దీన్నిబట్టి దస్తగిరి అప్రూవర్‌గా మారుతూ ఇచ్చిన వాంగ్మూలంలోని విషయాలన్నీ కల్పితాలే తప్ప వాస్తవాలు కాదని తెలియటం లేదా? హత్య వెనుక ఎంపీ అవినాశ్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారని గంగిరెడ్డి తనకు చెప్పినట్లుగా దస్తగిరి వెల్లడించిన విషయం అవాస్తవం కాదా?

ఐక్యరాజ్యసమితిని సంస్కరించరా?

ఐక్యరాజ్యసమితి (యూఎన్ఓ)ని గొప్ప ఉద్దేశ్యంతో 1945 అక్టోబర్ 24న స్థాపించినా... దాని నిర్వహణ, ఇతర అంశాలకు అవసరమైన ఆర్థిక సంపత్తి కోసం అమెరికాపైనే ఎక్కువగా ఆధారపడటం పెద్ద లోపంగా నిలిచింది. అలాగే శాశ్వత సభ్యత్వం ఉన్న ఐదు దేశాలూ... ఏదో రూపంలో తమకున్న వీటో పవర్‌తో యూఎన్ స్థాపిత లక్ష్యాలు సాకారం కాకుండా స్వప్రయోజనాల కోసం అడ్డుకోవడం మరో సమస్య. దాదాపూ ఏడు దశాబ్దాల యూఎన్ ప్రస్థానంలో దాని స్వరూప, స్వభావాలు అలాగే ఉండిపోవడం వల్ల ప్రపంచానికి పెద్దగా ఒరిగింది ఏమీ లేదు. కాలంతోపాటూ అదీ మారుతూ ఉండకపోవడం పెద్ద లోపం. ముఖ్యంగా శాశ్వత సభ్యత్వం పొందటానికి అర్హత ఉన్న అనేక దేశాలు రంగంలోకి వచ్చినా... వాటికి సభ్యత్వం ఇవ్వకపోవడం వల్ల సంపన్న, అభివృద్ధి చెందిన దేశాల పెత్తనానికే అది వేదికగా కొనసాగుతోంది. ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండాలలోని అర్హత ఉన్న దేశాలకు శాశ్వత సభ్యత్వం ఇవ్వక పోవడం వల్ల వర్ధమాన దేశాలకు అన్యాయం జరుగుతోంది.



అలాగే యూఎన్‌లో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకూ పవర్‌లో సమతుల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సమస్యల నేపథ్యంలో, దేశాల మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని చాలా దేశాల ప్రజలు భావిస్తున్నారు. ఐక్యరాజ్యసమితిలో 193 దేశాలు సభ్యత్వం కలిగి ఉన్నా... అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు ఉన్న వీటో అధికారం కారణంగా వాటి మాటకు తిరుగులేకుండా పోతోంది. ప్రస్తుతం భద్రతా మండలిలో ఉన్న ఐదు శాశ్వత సభ్య రాజ్యాలతో పాటు తామూ శాశ్వత సభ్య రాజ్యాలుగా అవతరించడమే లక్ష్యంగా ఏర్పడిన జి –4 (భారత్, జపాన్, జర్మనీ, బ్రెజిల్) దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్య రాజ్యాలుగా అవతరించే విధంగా ఐక్యరాజ్యసమితిని సంస్కరించాల్సిన సందర్భం వచ్చింది.

అగ్ర రాజ్యం కనుసన్నల్లో పనిచేస్తూ ఆర్థికంగా వెనకబడిన దేశాల సమస్యలను పట్టించుకోవడంలేదనీ, సంక్షోభాలను ఎదుర్కొంటున్న దేశాల పట్ల నిష్క్రియాపరత్వాన్ని ప్రదర్శిస్తున్నదనీ ఐక్యరాజ్య సమితిపై విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి పేలవంగానైనా ప్రయత్నాలు చేయకపోవడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. యుద్ధం ఏడాదిగా జరుగుతున్నా ఐక్యరాజ్యసమితి సరియైన చర్యను తీసుకోవడం లేదనీ... దాని మౌనం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. ఐరాస సొంతంగా నిర్ణయాలు తీసుకొని ప్రపంచ శాంతి పట్ల ఒక ధైర్యాన్నీ, భరోసాను ఇవ్వాలని ప్రపంచ సమాజం ఆశిస్తోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఐక్యరాజ్యసమితిని సంస్కరించకపోతే నానాజాతిసమితి మాదిరిగానే ఐక్యరాజ్యసమితి కూడా వైఫల్యం చెందుతుందని హెచ్చరిస్తున్నారు. భారత్ లాంటి దేశాలకు ఐక్యరాజ్యసమితిలో ప్రముఖమైన ప్రాధాన్యతను ఇచ్చినప్పుడే ప్రపంచ శాంతి పరిఢవిల్లడానికి అవకాశం ఉంటుందనీ, అందుకోసం ఇండియాకు భద్రతా సమితిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలనే సంగతి మరువరాదు.

– కేతూరి శ్రీరామ్, ఎంఏ, రాజనీతి శాస్త్రం

ఉపాస ముండున్రి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్తకు బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గా పాన్ డబ్బ మా దోస్తుల అడ్డ. పొద్దు మీకంగనే మా దోస్తులందరు గాడ జమైతరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింఁడ్రో నాకెర్క లేదు. గని నేను బోయినంక గాల్లు గిట్ల మాట్లాడుకుండ్రు.

''రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర జేస్తుండు. తెలంగాన దెచ్చినోల్లకు రొండుపార్లు మోక ఇచ్చిండ్రు. తెలంగాన ఇచ్చిన మా కాంగ్రెస్‌కు ఒకపారి మోక ఇయ్యండ్రి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక బంగారు తెలంగాన ఏమో గని గాయిన కుటుంబం బంగారు కుటుంబమైంది. మంచి నీల్లు ఏమో గని మందు ఏర్లై పారుతున్నది'' అని సత్నారి అన్నడు.

''గీ సర్కార్ ఎవ్వరితో నడుస్తున్నదో ఎర్కేనా?'' అని ఇస్తారి అడిగిండు.

''ఎవ్వరితోని నడుస్తున్నది'' అని యాద్గిరి అడిగిండు.

''గీ సర్కార్ ముఖ్యమంత్రి తోని నడుస్త లేదు. మంత్రుల తోని నడుస్త లేదు. ఎమ్మెల్యేలతోని నడుస్త లేదు. అఫిసర్లతోని నడుస్త లేదు. పోలీసోల్ల తోని నడుస్త లేదు. మందు తోని నడుస్తున్నది'' అని ఇస్తారి అన్నడు.

''అందరికి చెయ్యిచ్చుకుంట రేవంత్ రెడ్డి పాదయాత్ర జెయ్యబట్టిండు. గా లెక్కనే కద్మ కాంగ్రెస్ లీడర్లు గూడ హాత్ సే హాత్ జోడో పాదయాత్ర జెయ్యాలని గాయిన అన్నడు.''

''కుక్కలు గిన రేవంత్ ఎంటబడ్డయా?''

''పాదయాత్ర అనంగనే కుక్కలెందుకు యాది కొచ్చినయి?''

''నడ్సెటోల్ల ఎంటనే కుక్కలు బడ్తయి. మొరిగి ఊకోకుంట కరుస్తయి. గీ నడ్మ పట్నంల కుక్కలు ఎక్వ అయినయి. తొవ్వ పొంటి బోయెటోల్లను ఒక్క తీర్గ గరు స్తున్నయి.''

''కుక్క గర్సినోల్లు దవకానకు బోయి సూది మందు దీపిచ్చుకుంట లేరా?''

''దవకానకు బోతె కుక్క కాటుకు మందులు దొరుక్త లేవు. దాంతోని కుక్క కాటుకు చెప్పు దెబ్బనే మందు అనుకుంటున్నరు.''

''చెప్పులన్న దొరుక్తున్నయా?''

''చెప్పులెందుకు దొర్కయి?''

''పాదయాత్రలు జేస్కుంట లీడర్లు మీటింగులు బెడ్తున్నరు. బెట్టి స్పీచ్ దంచుతున్నరు. చెప్పిందే చెప్పుకొంట బోర్ గొట్టే లీడర్ల మీద జెనం చెప్పులేస్తున్నరు.''

''హాత్ సే హాత్ జోడో జెయ్య బట్కె కాంగ్రెస్ లీడర్లందరు ఒక్కటైతరా?''

''అందరు ఒక్క మాట మీద నడిస్తె కాంగ్రెస్ ఎట్ల అయితది. వొచ్చెపారి తెలంగానల కాంగ్రెస్ సర్కారొస్తది అని రేవంత్ అంటుంటె, ఏ పార్టికి మెజార్టి రాదు. హంగ్ వొస్తది. కాంగ్రెస్, బీఆర్ఎస్ గల్సి సర్కార్ ఏర్పాటు జేస్తయని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నడు.''

''అపొజిసన్ పార్టిలన్ని ఒక్కటైతె బీజేపీకి నూరు సీట్లు గూడ రావని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నడు.''

''అపొజిషన్ పార్టీలన్ని ఒక్కటైతె ప్రదాని ఎవరైతరు. నితీశ్ కుమార్ ప్రదాని కుర్సి మీద గూసోవాలనుకుంటున్నడు. ప్రదాని కుర్సి కోసమే కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ జేసిండు. ప్రదాని కుర్సి కోసమే రాహుల్ గాంది భారత్ జోడో యాత్ర జేసిండు. మమతా బెనర్జీ, కేజ్రీవాల్ గూడ ప్రదాని కుర్సి కోసం తన్లాడుతున్నరు. ఎండ కాలం షురువు గాక ముందే ఎండలు గొడ్తున్న తీర్గ ఎలచ్చన్లు రాక ముందే ఎలచ్చన్ల కాక షురువైంది. కుర్సీలాట మొదలైంది.''



''శివరాత్రి మంత్రి మల్లారెడ్డి కీసర గుట్టకు బోయిండు. గాడ జాత్ర అయితున్నది. గాడ ఆటల పోటీలు బెట్టిండ్రు. ఆటల పోటీల ముంగట మీటింగ్ బెట్టిండ్రు. ఎలచ్చన్ల కోడున్నదని చెప్పినా ఇనకుంట మంత్రి మల్లా రెడ్డి స్టేజ్ ఎక్కిండు. జాత్రల కోడేంది గీడేంది. నేను పాలమ్మిన. పూలమ్మిన. కాలేజీలు బెట్టిన. నా లెక్క మీరందరు పైకి రావాలె అని మంత్రి అనంగనే కిందున్నోల్లు స్టేజి మీది కొచ్చిండ్రు'' అని సత్నారి జెప్పిండు.

తోక: మా దోస్తులల్ల ఒకడు ఒక 'ఆహ్వాన పత్రిక' బంపిండు. గా దాంట్ల గిట్లున్నది. మీ పిల్లా జెల్లా తోని శివరాత్రి నాడు మా ఇంటి కొచ్చి ఉపాస ముండుండ్రి. యాడాదైనంక గాడు ఎమ్మెల్యే అయ్యిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

స్వదేశీ మ్యాప్‌లు ఎంతో కీలకం

‘మ్యాపథాన్’ సదస్సులో సౌరభ్‌గౌర్



వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లతో ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ


ఏర్పేడు(తిరుపతి జిల్లా): దేశానికి స్వదేశీ మ్యాప్‌లు ఎంతో కీలకమని, దీనిపై యువత దృష్టి సారించాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్ పిలుపునిచ్చారు. ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో గురువారం నవవిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ సహకారంతో ‘మ్యాపథాన్’ పేరుతో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఐటీ ముంబయి–ఫాసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కన్నన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ స్టార్టప్‌లను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న సౌరభ్‌గౌర్ మాట్లాడుతూ దేశీయంగా మ్యాప్‌ల తయారీతో యువతకు ఎన్నో అవకాశాలు వస్తాయని, విదేశీ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, ప్రొఫెసర్ కన్నన్ మాట్లాడుతూ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌ల ప్రాముఖ్యతను వివరించారు. ఉత్తరప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి మిషన్ డైరెక్టర్ వంశీ, ఐసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నందిని, తమిళనాడు పాపులేషన్ హెల్త్ రిజిస్ట్రీ నోడల్ అధికారి విదుతలై విరుంబి, తమిళనాడు వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దివ్యలక్ష్మి, ఐఐటీ తిరుపతి నవవిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కాణిపాకంలో రెండు నూతన ఆర్జిత సేవలు

- మార్చి 4, 5వ తేదీల్లో సహస్ర నామార్చన, ఉదయాస్తమాన సేవ ప్రారంభం

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో మార్చి 4వ తేదీన నూతనంగా సహస్ర నామార్చన ఆర్జిత సేవను ప్రారంభించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ సేవ ఉదయం 6 గంటల నుంచి 6.45 వరకు జరుగుతుందన్నారు. ఈ సేవలో మహా మంగళ హారతిని భక్తులు దర్శించుకోవచ్చని తెలిపారు. ఈ సేవలో పాల్గొనాలంటే రూ.1,000 టికెట్ కొనుగోలు చేయాలని, ఇద్దరు భక్తులకు అనుమతి ఉంటుందన్నారు. వీరికి స్వామివారి శేష వస్త్రాలు, పెద్ద లడ్డూ అందించనున్నట్లు తెలిపారు. అలాగే మార్చి 5వ తేదీన ఉదయాస్తమాన సేవను నూతనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సేవలో పాల్గొనే భక్తులు రూ.లక్ష చెల్లిస్తే పది సంవత్సరాల పాటు, సంవత్సరంలో ఒకరోజు ఇద్దరు ప్రధాన ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించే అన్ని సేవల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

తిరుపతి పుట్టిన రోజు నేడు



ఫొటో : మోహన్ కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్

నగర ప్రస్తుత స్వరూపమిదీ	
విస్తీర్ణం	27.44 చదరపు కి.మీ.
మొత్తం గృహాలు:	82 వేలు
కుటుంబాలు:	1.12 లక్షలు
జనాభా:	3.86 లక్షలు
స్టార్ హోటళ్లు: 15	ఇతర హోటళ్లు: 286
మాల్స్, ఫంక్షన్ హాల్స్:	24
స్కూళ్లు, కళాశాలలు:	222

తిరుమలను తలచుకుంటే.. గోవింద నామం మనసులో మార్మోగుతుంది. కలియుగ ప్రత్యక్ష దైవం మనో నేత్రం ఎదుట ప్రత్యక్షమవుతారు. ఏడు కొండలవాడు కొలువైన తిరుమల ఆలయంతోపాటు ఆయన పాదాల చెంత ఉన్న తిరుపతి నగరం ఆవిర్భావమూ ఆసక్తికరమే. కలియుగం (కలియుగం మొదలై ఫిబ్రవరి 13వ తేదీ నాటికి 5,125 ఏళ్లు పూర్తయింది)లో శ్రీనివాసుడు ఏడు కొండలపై శిలా రూపంలో కొలువుదీరగా.. ఆ స్వామిని కొలిచే భక్తుల ఆవాసాల కోసం ఏడు కొండల దిగువన తిరుపతి వెలసింది. పూర్వం తిరుమల చుట్టూ అడవులు, కొండల నడుమ అలరారే శ్రీవారి ఆలయం మాత్రమే ఉండేది. భక్తులు క్రూర జంతువుల భయంతో గుంపులుగా కాలినడకన తిరుమల యాత్ర చేసేవారు. పూర్వం శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ, ధ్వజారోహణం మాత్రమే తిరుమల కొండపై నిర్వహించేవారు. వాహన సేవలన్నీ తిరుచానూరులోనే నిర్వహించేవారు. ప్రతిరోజూ తిరుచానూరు నుంచి తిరుమలకు వెళ్లి రావటం ఇబ్బందిగా ఉండటంతో అర్చకులు కపిల తీర్థం వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంతం పేరు కొత్తూరు, కోటవూరుగా పిలిచేవారు. – (సాక్షి, ఏపీ నెట్‌వర్క్)

రామానుజాచార్యులచే శంకుస్థాపన

శ్రీనివాసుని పూజా కైంకర్యాలను వైఖానస సంప్రదాయంలో కొనసాగించాలని నిర్దేశించిన జగద్గురువు రామానుజాచార్యులు అర్చకుల నివాసాల కోసం తిరుచానూరు–తిరుమల మధ్య నేటి పార్థసారథి ఆలయ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. శ్రీరంగం నుంచి శ్రీరంగనాథస్వామి శిలావిగ్రహాన్ని తెప్పించి పార్థసారథి సన్నిధికి పక్కన ప్రతిష్ఠించేందుకు ఆలయాన్ని నిర్మించారు. ఆ విగ్రహాన్ని తరలించే సమయంలో స్వల్పంగా దెబ్బ తినటంతో దాన్ని పక్కన పెట్టి.. ఆ ఆలయంలో గోవిందరాజస్వామిని తిరుమలేశుని ప్రతిరూపంగా ప్రతిష్ఠించారు. పక్కనపెట్టిన రంగనాథస్వామి విగ్రహం ప్రస్తుతం మంచినీళ్ల కుంట ఒడ్డున దర్శనమిస్తోంది. ఆ తర్వాత 1130వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన గోవిందరాజస్వామి ఆలయం నాలుగు వైపులా మాడ వీధులు, అందులో అర్చకుల నివాసాలకు రామానుజాచార్యులు శంకుస్థాపన చేశారు. ఆ బ్రాహ్మణ అగ్రహారాన్నే తర్వాత గోవిందపట్నంగా.. రామానుజపురంగా పిలిచేవారు. ఆ తరువాత 1220–40 మధ్యకాలం నుంచి తిరుపతిగా పేరొందింది. అప్పటినుంచి తిరుపతిలో ఆవాసాలు, ఆలయాలు పెరుగుతూ వచ్చి ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకుంది. 120 సంవత్సరాల సుదీర్ఘ జీవితాన్ని గడిపిన రామానుజాచార్యులు మూడుసార్లు తిరుమలకు వచ్చారని ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఆయన తన 112వ ఏట గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మాడ వీధులకు శంకుస్థాపన చేశారు. దీని ప్రకారం తిరుపతి ఆవిర్భవించి ఈ నెల 24వ తేదీకి 893 సంవత్సరాలు అవుతోంది.



కపిలతీర్థం జలపాతం

వెలుగులోకి తెచ్చిన భూమన

వెలుగుచూసిన అంశాలపై తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సమగ్ర అధ్యయనం చేయించి 2022 ఫిబ్రవరి 24న తొలిసారిగా తిరుపతి 892వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ ఏడాది టీటీడీ, తిరుపతి నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 893వ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్టు భూమన ప్రకటించారు. ఆ వేడుకల్లో భాగంగా నగర వాసులందరూ భాగస్వాములయ్యే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు నాలుగు మాడవీధుల్లో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియం

పరమ పవిత్రం తిరుపతి



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి పరమ పవిత్రమైనది. ముక్కోటి దేవతలు శ్రీగోవిందరాజస్వామిని కొలుస్తారు. ఇక్కడ స్థానికులతో పాటు అనేక మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారు ఉన్నారు. తిరుపతి ప్రాముఖ్యత గురించి తెలియజేయాలన్నదే నా తపన. ప్రతి ఒక్కరూ నగర ప్రాభవాన్ని కాపాడుకోవాలి. తిరుపతి వైభవాన్ని చాటిచెబుదాం. శ్రీవారి నిలయమైన తిరుపతి ఆవిర్భావ వేడుకలను కలిసిమెలసి జరుపుకుందాం.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

ఆడుకుంటూనే అనంత లోకాలకు..

- కరెంటు తీగలకు చిన్నారులు బలి




శశాంత్‌కుమార్ (ఫైల్) మనోజ్‌కుమార్ (ఫైల్)

చెన్నూరు: ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులకు పొరపాటున విద్యుత్ తీగలు తగలడంతో మృత్యువాతపడ్డారు. ఈ విషాద ఘటన వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాదర్‌ఖాన్ కొట్టాలు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..డేరంగుల రమణ, వెంకట లక్షుమ్మల కుమారుడు వెంకట శశాంక్ కుమార్ (12) ఓ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓర్సు వెంకట నరసయ్య, జ్యోతిల కుమారుడు మనోజ్‌కుమార్ (4) అంగన్‌వాడీ పాఠశాలకు వెళుతున్నాడు. ఈ చిన్నారులు గురువారం ఇంటిపైన ఆడుకుంటూ పక్కనే ఉన్న రేకుల ఇంటిపైకి వెళ్లారు. పొరపాటున ఆ ఇంటిపై నుంచి వెళుతోన్న కరెంటు తీగలు వీరికి తగలడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి చెప్పారు. డీఎస్పీ వెంకట శివారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, ముందురోజు గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యంలో చిన్నారులు ఆనందంగా గడిపారు. దీంతో గురువారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నారు. చివరికి విధి చేతిలో కీలుబొమ్మలయ్యారు. వెంకట శశాంక్ కుమార్ తండ్రి కువైట్‌లో ఉన్నాడు. ఘటన జరిగినప్పుడు అతడి తల్లి, మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు పనులకు వెళ్లారు.

తల్లి ఒడికి చేరిన పసికందు



ఆత్మకూరు (నంద్యాల): నాలుగు రోజులపాటు వివిధ మలుపులు తిరిగిన పసికందు తల్లి ఒడికి చేరింది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న బాలిక గర్భం దాల్చింది. నాలుగు రోజుల క్రితం ఇంటివద్దే ఓ చిన్నారికి జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న తండ్రి కుటుంబ పరువుపోతుందన్న ఉద్దేశంతో కుమార్తెను మందలించి.. ఆ పసికందును ఓ సంచిలో పెట్టి సమీపంలోని పొలం గట్టుపై వదిలేశాడు. అటుగా వెళ్తున్న ముష్టిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి పాప ఏడుపు విని తనకు పిల్లలు లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లాడు. ఈ విషయం గ్రామంలో గుప్పుమంది. ఆ నోటా ఈ నోటా విషయం సచివాలయ సిబ్బంది దృష్టికి వెళ్లడంతో ఐసీడీఎస్, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పసికందును గురువారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంతలో పాపకు జన్మనిచ్చిన బాలిక అక్క, బావ, కుటుంబ సభ్యులు కూడా విషయం తెలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని చిన్నారిని తీసుకెళతామని పట్టుబట్టారు. వివరాలు చెప్పేందుకు ఇష్టపడకపోవడంతో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పాపను ఆ దంపతులకు అప్పగించారు. దీంతో నాలుగు రోజుల అనంతరం ఆ పసికందు తల్లి ఒడికి చేరింది. ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం, చిన్నారికి జన్మనిచ్చింది కూడా ఓ బాలిక కావడంతో వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

వారాహి అలంకారంలో చండీమాత దర్శనం



సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో నిర్వహిస్తున్న లక్ష చండీ మహాయజ్ఞం 13వ రోజు గురువారం విజయవంతంగా కొనసాగింది. యజ్ఞ భూమిలో చండీమాత మహావారాహి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంటీ మాత పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పండితులు సప్తసతీ పారాయణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. చండీమాతని ఆరాధిస్తూ 6,912 పారాయణ హోమాలు జరిపారు. కాగా, శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి కురుక్షేత్ర సమీపంలోని పంచకుల ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న చండీమాత ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అఖండ భారతావనిలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న లక్ష చండీ మహా యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగి పరిపూర్ణమయ్యేలా నిర్వాహకులకు శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అలాగే పంచకుల ప్రాంతంలోనే ఉన్న కాళికాదేవి మందిరం, మానసాదేవి మందిరం సందర్శించి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

రాజధాని ఎక్కడ నిర్మిస్తారో ఆ పార్టీలు చెప్పాలి

879వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు

తాడికొండ: ఎన్నికల వేళ సమీపిస్తుండడంతో తమను అధికారంలోకి తెస్తే ఏపీలో రాజధాని నిర్మిస్తామని చెబుతున్న బీజేపీ, బీఆర్‌ఎస్ తదితర పార్టీలు ఎక్కడ రాజధాని నిర్మిస్తారో ప్రజలకు చెప్పాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 879వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ వద్ద నుంచి నిధులు తీసుకొచ్చే దమ్ములేని బీజేపీ రాష్ట్ర నాయకులు, రాజధాని నిర్మిస్తామని చెప్పడం హాస్యాస్పదం కాదా అని ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో నిరాశ్రయులుగా ఉన్న 54 వేల మంది పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకొస్తే తప్పుడు కేసులు వేసి అడ్డుకున్న వారికి అండగా నిలుస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

వేడుకగా శ్రీకాళహస్తీశ్వరుడి వసంతోత్సవం

శ్రీకాళహస్తి రూరల్ (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వసంతోత్సవం వేడుకగా నిర్వహించారు. సన్నిధి వీధిలోని వసంత మండపంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తులకు వివిధ జలాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరిపారు. రాత్రి వేళ ఎనిమిది గంటలకు స్వామి అమ్మవార్లు సింహం–కామధేనువు వాహనాలపై ఊరేగుతూ భక్తులకు అభయం ఇచ్చారు. శుక్రవారం రాత్రి జరిగే పల్లకీ సేవ, శనివారం జరిగే ఏకాంత సేవలతో ఉత్సవాలు ముగుస్తాయి.



స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వర్జీనియా రైతుకు మంచికాలం



ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో 21వేల హెక్టార్లలో సాగు	మార్చి 23 నుంచి పొగాకు బేళ్ల కొనుగోళ్లు ప్రారంభం

బుట్టాయగూడెం: ప్రధాన వాణిజ్యపంట వర్జీనియా పొగాకు సాగు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో ఆశాజనకంగా సాగుతున్నది. గతంతో పోల్చితే ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు, రైతులు భావిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది ఒక ఎకరం విస్తీర్ణంలో 33 క్వింటాళ్ల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. దీంతో రైతులు పొగాకు క్యూరింగ్ చేసి గ్రేడింగ్ పనులు పూర్తి చేసుకుని అమ్మకాలకు బేళ్లు సిద్ధం చేస్తున్నారు.



పొగాకు గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

13,775 బ్యారన్‌ల రిజిస్ట్రేషన్

ఈ ఏడాది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఎస్‌ఎల్‌ఎస్ 5 పొగాకు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 21 వేల హెక్టార్లలో 11,705 మంది రైతులు పంట సాగు చేస్తున్నారు. సుమారు 13,775 బ్యారన్‌లను రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కాగా ఈ ఏడాది సుమారు 47.48 మిలియన్ కేజీల పొగాకు పంట పండించేందుకు బోర్డు అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

కర్ణాటక తరహాలో ధరపై ఆశలు

ఉమ్మడి జిల్లాలోని ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలో గల జంగారెడ్డిగూడెం-1, 2, కొయ్యలగూడెం, జిల్లా విభజనతో తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల్లో మార్చి 23 నుంచి పొగాకు బేళ్ల కొనుగోళ్లు ప్రారంభమవుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. అలాగే వీటితోపాటు రాష్ట్రంలోని 19 వేలం కేంద్రాల్లో అదే రోజు పొగాకు బేళ్ల కొనుగోళ్లు ప్రారంభమవుతాయని అంటున్నారు. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంలో వర్జీనియా పొగాకు బేళ్ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అక్కడ మొదటి బేడు కేజీ రూ.272 ధర ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా తమకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉందని పొగాకు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి బాగుంది



గతేడాదితో పోల్చితే పొగాకు పంట దిగుబడి బాగుంది. పంటల దిగుబడిలో నాణ్యతాలోపాలు లేకుండా పండిస్తున్నాం. బేళ్లను కూడా పురుగుమందుల అవశేషాలు లేకుండా నాణ్యంగా ఉండేలా చూస్తున్నాం. మద్దతు ధర లభించి మా కష్టానికి ఫలితం ఉంటుందని భావిస్తున్నాం.

– కలగర నాని, పొగాకు రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

సాగులో ఖర్చులు పెరిగాయి



ఈ ఏడాది పొగాకు పంట ఆశాజనకంగా ఉంది. అధిక దిగుబడులు వస్తాయని భావిస్తున్నాం. సాగులో ఖర్చులు పెరిగాయి. నేను ఈ ఏడాది ఏడు ఎకరాల్లో పొగాకు పంట వేశా.ఎరువులు, ఇతర పంట పెట్టుబడి ఖర్చులు పెరిగాయి గిట్టుబాటు ధర వస్తుందని ఆశతో ఉన్నా.

– ఎ.శ్రీనివాస్, పొగాకు రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

ప్లాంట్ పొజిషన్ ప్రకారం గ్రేడ్ చేసుకోవాలి

మార్చి 23 నుంచి పొగాకు బేళ్ల కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పొగాకును ప్లాంట్ పొజిషన్ ప్రకారం గ్రేడ్ చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మండెలను తిరగేసుకోవాలి. నాణ్యమైన పొగాకును మార్కెట్‌కు తీసుకొచ్చి రైతులు లాభాలు పొందాలి.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు ఆర్‌ఎం, రాజమండ్రి

శ్రీసిటీని సందర్శించిన ఎస్టోనియన్ వ్యాపార ప్రతినిధులు



శ్రీసిటీ ఉత్పత్తుల గురించి ఎస్టోనియన్ ప్రతినిధుల బృందంకు వివరిస్తున్న శ్రీసిటీ ఎండీ

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): సెమెట్రాన్, ఎంఎంహెచ్ గ్రూపు ఎక్స్‌పోర్ట్స్ విభాగాధిపతి, ఎస్టోనియా మాజీ రక్షణ మంత్రి మార్గెస్ త్సాక్నా నేతృత్వంలోని ఎస్టోనియన్ వ్యాపార ప్రతినిధుల బృందం, భారతీయ జాయింట్ వెంచర్ పార్ట్‌నర్స్ ఎపిరాస్ హెల్త్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో కలసి గురువారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి శ్రీసిటీలోని మౌలిక సదుపాయాల గురించి వివరించారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీలో వ్యాపార అనుకూల వాతావరణం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభ కలిగిన మానవ వనరులు, ప్రభుత్వ సహకారం కచ్చితంగా వారిని ఆకట్టుకుంటుందన్నారు. ఎస్టోనియా ఉత్తర ఐరోపా లోని ఇతర దేశాల నుంచి పెట్టుబడులకు మార్గం సుగుమం చేస్తుందన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవడం, దాని వ్యాపార సామర్థ్యాన్ని అంచనా వేయడం, ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాలను అన్వేషించడమే వారి పర్యటనకు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దేశీయ, ఎగుమతి ప్రయోజనాల కోసం ఆసియా, యూరోపియన్ యూనియన్, ఆఫ్రికా కోసం మేక్ ఇన్ ఇండియా కింద మొబైల్ హెల్త్ కేర్ యూనిట్లను భారత్‌లో తయారు చేయాలని, కంపెనీ ప్రతిపాదిస్తున్న నేపథ్యంలో అనువైన పారిశ్రామిక ప్రదేశం కోసం అన్వేషిస్తున్నట్లు ఎస్టోనియా వ్యాపార ప్రతినిధుల బృందం తెలిపింది.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

- 20 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: ఎర్రచందనం అంతర్ రాష్ట్ర స్మగ్లర్ ఇరగం రెడ్డి నాగదస్తగిరి రెడ్డిని వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. సిద్ధవటం మండలం పెద్దపల్లి పంచాయతీ, కడప – రాజంపేట మెయిన్‌రోడ్‌లో గురువారం ఉదయం కొందరు స్మగ్లర్ల కదలిక సమాచారం అందుకున్న పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. స్మగ్లర్లు పోలీసులపైకి రాళ్లు, గొడ్డళ్లతో ఎదురుదాడి చేసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నాగదస్తగిరి రెడ్డిని అరెస్ట్ చేశారు. మిగిలిన స్మగ్లర్లు అడవిలోకి పరారయ్యారు. ఘటనా స్థలం నుంచి పోలీసులు 20 ఎర్రచందనం దుంగలు (603 కిలోలు), రెండు కార్లు, ఇతర సామగ్రిని సీజ్ చేశారు.

నాగదస్తగిరి రెడ్డి నేర చరిత్ర

ప్రొద్దుటూరు అమృతనగర్‌లో నివాసం ఉంటున్న నాగదస్తగిరిరెడ్డి మోస్ట్ వాంటెడ్ దొంగ. రాయలసీమ వ్యాప్తంగా సుమారు 36 ఇంటి దొంగతనాలకు పాల్పడ్డాడు. తన బావమరుదులు లాల్‌బాషా, జాకీర్, ఫక్రుద్దీన్‌తో కలిసి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నాడు. ఇతడిపై రాయలసీమ జిల్లాలలో మొత్తం 86 ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. రెండుసార్లు పి.డి.యాక్ట్ కింద అరెస్టయి జైలుకు వెళ్లాడు.

గుర్రంకొండ కోటలో అగ్ని ప్రమాదం

- 450 ఎకరాల్లో కొండ, కోట పరిసరాలు దగ్ధం
- కోటలో రంగినీ మహల్‌కు తప్పిన ముప్పు



గుర్రంకొండ కోటతో పాటు కొండను చుట్టుముట్టిన అగ్నికెరటాలు

గుర్రంకొండ/తంబళ్లపల్లె: అన్నమయ్య జిల్లాలోని చారిత్రక గుర్రంకొండ కోటలో అగ్ని ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కొండకు వెనుక వైపున నిప్పు అంటించారు. మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడి కొండ మొత్తం వ్యాపించాయి. కోటతో పాటు కొండ పరిసరాల్లో 450 ఎకరాలలోని గడ్డి, చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. పర్యాటకశాఖ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు కోట వద్దకు చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. ఎంతోసేపటికీ అదుపులోకి రాలేదు. కోటలోపల జాతీయ రహదారి పక్క నుంచి మొదలైన మంటలు కోట గోడలకు పాకాయి. కంద్రిగ వైపు ఉన్న కొండ ప్రాంతంలో కూడా మంటలు చుట్టుముట్టాయి. కోటగోడల చుట్టూ నలువైపులా మంటలు వ్యాపించాయి. అప్పటికే కోట ముందు భాగం, కోటగోడల వరకు కాలిబూడిదయ్యింది. విద్యుత్‌శాఖ సిబ్బంది కోట వద్దకు చేరుకొని కరెంటు సరఫరా నిలిపివేశారు. అతి కష్టమ్మీద గురువారం వేకువజామున మంటలు ఆర్పివేశారు. కొద్ది సమయం ఆలస్యం జరిగినా కోటలో రంగినీ మహల్ అగ్నిప్రమాదానికి గురయ్యేది. అగ్నిప్రమాదానికి కారకులైన దుండగులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

మల్లయ్యకొండలో 600 హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి: అన్నమయ్య జిల్లాలోని మల్లయ్యకొండ సాధు, ఇనుముకొండల అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం నిప్పుపెట్టారు. సుమారు 600 హెక్టార్లకు పైగా అడవి కాలిపోయింది. అటవీశాఖ అధికారులు గురువారం గ్రామస్తుల సహకారంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు..ఐదుగురు కూలీల మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడులో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ధర్మపురి జిల్లా రెడ్డియూరు సమీపంలోని నూల హళ్లీ మల్లైకారన్ సావలూరు కోట్టై గ్రామానికి చెందిన 12 మంది కూలీలు ట్రాక్టర్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా వి. కోట మండలానికి బుధవారం రాత్రి కూలి పని కోసం బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో కృష్ణగిరి జిల్లా కావేరి పట్నం వద్ద వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ట్రాక్టర్ నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న వారంతా చెల్లాచెదురుగా పడ్డారు. ఈ ప్రమాదంలో మునుస్వామి(50), వర్షిణి (3 నెలలు), ట్రాక్టర్ డ్రైవర్ ముత్తు (20), మల్లి (65), వాసంతి (45) మరణించారు. మరో ఏడుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సీఎం స్టాలిన్ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షలు పరిహారం ప్రకటించారు.

ఐఏఎస్ రోహిణికి కోర్టులో ఊరట

బనశంకరి: కర్ణాటకలో ఐపీఎస్ అధికారిణి డీ.రూపా మౌద్గిల్, ఐఏఎస్ రోహిణి సింధూరి మధ్య ఆరోపణల వ్యవహారంలో రోహిణి సింధూరికి బెంగళూరు నగర 74 వ సిటీ సివిల్‌కోర్టు ఉపశమనమిచ్చింది. ఆమె పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేయరాదని రూపా సహా పలువురికి కోర్టు గురువారం ఆదేశించింది. కోర్టు ఐపీఎస్ రూపా అభ్యంతరాలు తెలియజేయడానికి అవకాశమిస్తూ మార్చి 7కి విచారణను వాయిదా వేసింది. రోహిణి సింధూరికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పరువు నష్టం కలిగించే పోస్టులను పెట్టిన ఐపీఎస్ రూపా, వాటిని షేర్ చేసిన పాత్రికేయులతో సహా మొత్తం 66 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ కోర్టు సమన్లు జారీ చేసింది.

క్లుప్తంగా...

అన్నాడీఎంకే పగ్గాలు పళనిస్వామికే

న్యూఢిల్లీ: తమిళనాడులో అన్నాడీఎంకే పార్టీపై సర్వాధికారం మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామికే దఖలుపడింది. పార్టీకి ఆపద్ధర్మ ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని కొనసాగిస్తూ మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ గత ఏడాది సెప్టెంబర్‌లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఈ మేరకు ఈ జనవరి 12న రిజర్వ్‌చేసిన తీర్పును జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ హ్రిషికేశ్ రాయ్‌ల సుప్రీంకోర్టు బెంచ్ గురువారం వెల్లడించింది. గత ఏడాది జూలై 11వ తేదీన జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో పార్టీ నియమావళికి సవరణలు చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త, సంయుక్త సమన్వయకర్త పోస్టులను రద్దుచేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఒ. పన్నీర్‌సెల్వమ్‌ను, ఆయన వర్గీయులు కొందరిని పార్టీ నుంచి తప్పించారు. ప్రధాన కార్యదర్శి పదవి సృష్టించి ఆ బాధ్యతలు పళనిస్వామికి అప్పజెప్పారు. ఈ తీర్మానానికి ముందువరకు సమన్వయకర్తగా పన్నీర్‌సెల్వం, సంయుక్త సమన్వయకర్తగా పళనిస్వామి ఉండేవారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగింపు, సర్వసభ్య సమావేశ తీర్మానాలపై పన్నీర్‌సెల్వం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా ఏకసభ్య జడ్జి జయచంద్రన్ జూన్ 23నాటి యథాతథస్థితి కొనసాగాలంటూ ఆగస్ట్ 17న ఉత్తర్వులిచ్చారు. దీనిని పళనిస్వామి వర్గం హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు సవాల్‌చేయగా సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దుచేస్తూ తీర్పు వచ్చింది. ఈ తీర్పును సవాల్‌చేస్తూ పన్నీర్‌సెల్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం ఆయనకు చుక్కెదురైంది.


నోబెల్ శాంతి బహుమతికి 305 నామినేషన్లు

కోపెన్‌హగెన్: ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతికి నామినేషన్ల గడువు ఫిబ్రవరి ఒకటవ తేదీన ముగిసింది. ఈ ఏడాది 305 నామినేషన్లు వచ్చాయని నార్వేలోని నోబెల్ శాంతి బహుమతి ఎంపిక కమిటీ తెలియజేసింది. గతంతో పోలిస్తే ఈసారి తక్కువ నామినేషన్లు వచ్చాయి. గత ఎనిమిదేళ్లుగా ప్రతి సంవత్సరం 300 మందికిపైగానే నామినేట్ అవుతున్నారు. 2016లో మాత్రం 376 మంది నామినేట్ అయ్యారు. నోబెల్ శాంతి బహుమతి విజేత ఎంపిక ప్రక్రియను రహస్యంగా నిర్వహిస్తారు. ప్రముఖ వ్యక్తులు, అంతర్జాతీయ ప్రజా ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నామినేషన్లు దాఖలు చేస్తుంటారు. ప్రముఖుల పేర్లను ఇతరులూ నామినేట్ చేయొచ్చు. 2021లో అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ పేర్లను ఇతరులు నామినేట్ చేశారు.

భూమికి ఐదో పొర!

తాజాగా కనిపెట్టిన శాస్త్రవేత్తలు • ఘనపు లోహ గోళంలా ఉందని వెల్లడి


అశోక చక్రానికి కనిపించే మూడు సింహాలతో పాటు కనిపించని నాలుగో సింహమూ ఉన్నట్టుగా, భూమికి మనకిప్పటిదాకా తెలియని ఐదో పొర ఉందట! భూగర్భం తాలూకు మిస్టరీలను ఛేదించేందుకు తాజాగా చేపట్టిన ప్రయోగాల్లో ఈ విషయం యాదృచ్ఛికంగా వెలుగుచూసిందని సైంటిస్టులు చెబుతున్నారు. భూమికి నాలుగు పొరలుంటాయని మనకిప్పటిదాకా తెలుసు..



భూమి తాలూకు ఇన్నర్ కోర్ గుండా భూకంప తరంగాలు ఎంత వేగంతో చొచ్చుకుని సాగిపోతున్నాయో తెలుసుకునేందుకు ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు గత దశాబ్దకాలంగా పలు ప్రయోగాలు చేస్తున్నారు. వాటిలో భాగంగా రిక్టర్ స్కేల్‌పై ఆరుకు పైగా తీవ్రతతో కూడిన 200కు పైగా భూకంపాల తాలూకు గణాంకాలను వారు లోతుగా విశ్లేషిస్తున్నారు. చివరికి ఈ భూకంప తరంగాలు భూమి కేంద్రకం గుండా నేరుగా ప్రయాణిస్తున్నట్టు అంచనాకు వచ్చారు. ఇన్నర్ కోర్ తాలూకు అత్యంత లోతైన భాగాలకు సంబంధించి పలు కొత్త విషయాలు ఈ అధ్యయనం ద్వారా వెలుగుచూశాయి. మరింత సమాచారం కోసం ఆ తరంగాల ప్రయాణ సమయాల్లో మార్పులను పరిశోధకులు తాజాగా మరింత లోతుగా విశ్లేషించారు. ఈ క్రమంలో భూమికి ఇప్పటిదాకా మనకు తెలియని ఐదో పొర ఉందన్న విషయం బయట పడిందని చెబుతున్నారు! ఇది భూమి లోలోతుల్లో ఘనాకృతిలోని లోహపు గోళం మాదిరిగా ఉందని చెప్పారు. ఇన్నర్ కోర్ తాలూకు కేంద్ర స్థానంలో ఇమిడిపోయి ఉన్న ఈ పొరను ప్రస్తుతానికి 'అత్యంత లోపలి ఇన్నర్ కోర్'గా వ్యవహరిస్తున్నారు. దీనిపై మరిన్ని పరిశోధనలు చేస్తే భూ కేంద్రానికి సంబంధించి మనకెంతో ప్రయోజనకరమైన సమాచారం వెలుగుచూడొచ్చని చెబుతున్నారు. ఈ తాజా అధ్యయన ఫలితాలను జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించారు.

20 ఏళ్ల కిందే సూత్రీకరించినా..

నిజానికి భూమి లోలోతుల్లో ఇలాంటి ఒక లోహపు గోళం ఉందని 20 ఏళ్ల కిందే సైంటిస్టులు అంచనా వేశారు. బహుశా అది ఇన్నర్ కోర్ తాలూకు లోలోతుల్లో దాగుండవచ్చని సూత్రీకరించినట్టు ఏఎన్‌యూ తాలూకు రీసెర్చ్ స్కూల్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌లో పని చేస్తున్న డాక్టర్ థాన్సన్ వివరించారు. ఇప్పుడు దానికి సంబంధించి తిరుగులేని రుజువులు లభించడం తమను ఆశ్చర్యానందాలకు లోను చేస్తోందన్నారు. మనకిప్పటిదాకా తెలిసిన భూమి తాలూకు నాలుగు పొరలు క్రస్ట్, మాంటిల్, ఔటర్ కోర్, ఇన్నర్ కోర్.



ఇన్నర్ కోర్ లోతుల్లో ఉన్న ఐదో పొర ఇనుము–నికెల్ లోహ మిశ్రమంతో కూడి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఐదో పొర కూర్పు

భూమి ఇన్నర్ కోర్‌లోని పదార్థాల గుండా భూకంప తరంగాలు ఎలా దూసుకెళ్తాయో, నెమ్మదిస్తాయో వివరంగా తెలుసుకునే అనిసోట్రోఫీ ఆధారంగా ఈ మేరకు నిర్ధారణకు వచ్చినట్టు వారు వివరించారు. 'ఈ తరంగాలు భూ కేంద్రం సమీపంలోని పలు ప్రాంతాలను భిన్న కోణాల్లో పదేపదే స్పృశించాయి. ఇన్నర్ కోర్ లోపలి ఘనాకృతి బయటి పొరతో పోలిస్తే భిన్నంగా ఉండొచ్చు. భూమి ఆవిర్భావ సమయంలో జరిగిన పరిణామాల వల్ల ఇన్నర్ కోర్‌లో ఈ ఘనాకృతి రూపుదిద్దుకుని ఉంటుంది' అని భావిస్తున్నారు.

ఇలా వెలుగు చూసింది

భూకంపం సంభవించినప్పుడు దాని తరంగాలు భూ కేంద్రకం గుండా సరిగ్గా భూమి అవతలి వైపు దూసుకెళ్తాయి. అనంతరం వెనుదిరిగి భూకంప కేంద్రం వద్దకు ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో అలస్కాలో సంభవించిన ఓ భూకంపాన్ని పరిశోధకుల బృందం అధ్యయనం చేసింది. దాని తాలూకు తరంగాలు దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రం గుండా భూమి అవతలి వైపునకు చొచ్చుకుపోయి తిరిగి అలస్కాలోని భూకంప కేంద్రం వద్దకు చేరుకున్నాయి. ఈ తరంగాల ప్రయాణ మార్గాన్ని లోతుగా పరిశీలించే క్రమంలో ఇన్నర్ కోర్‌లోని ఐదో లోహపు పొర ఉనికి తొలిసారిగా వెలుగు చూసిందని పరిశోధక బృందం తాజాగా వివరించింది. ''ఈ భూకంప తరంగాల ప్రయాణ ధోరణిని నిశితంగా గమనించాం. అవి దక్షిణ అట్లాంటిక్ మహాసముద్ర అంతర్భాగం నుంచి అలస్కా వైపు తిరిగొచ్చే క్రమంలో ఐదు చోట్ల నిర్దిష్ట ప్రతిస్పందనలు వెలువరిస్తూ ప్రయాణించినట్టు తేలింది. అలా ఐదో పొర ఉనికి బయట పడింది. ఇది వాస్తవమేనని పలు ఇతర భూకంపాల తాలూకు తరంగాల ప్రయాణ ధోరణులను పరిశీలించిన మీదట నిర్ధారణ అయింది' అని చెప్పుకొచ్చింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రెస్ నేత పవన్ ఖేడా అరెస్ట్

- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దింపిమరీ అరెస్ట్‌చేసిన అస్సాం పోలీసులు
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఖేడా
- మధ్యంతర బెయిల్ మంజూరు

గువాహటి/న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అస్సాంలో నమోదైన కేసులో ఆ రాష్ట్ర పోలీసులు కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ మీడియా విభాగ చీఫ్ పవన్ ఖేడాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానం నుంచి దింపిమరీ అరెస్ట్‌చేశారు. దీంతో అదే విమానంలో ప్రయాణిస్తున్న సీనియర్ నేతలు రణదీప్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌సహా కొందరు పార్టీ నేతలు విమానం నుంచి బయటికొచ్చి రన్‌వేపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఖేడా అరెస్ట్ వ్యవహారంతో కొద్దిసేపు రన్‌వేపై ఉద్రిక్తత నెలకొంది. అరెస్ట్ నేపథ్యంలో ఖేడా వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆయనకు మధ్యంతర బెయిల్‌కు అనుమతిస్తూ ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

అసలేం జరిగింది?

ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు వెళ్లేందుకు ఖేడా సిద్ధమయ్యారు. ఇందుకోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో విమానయాన సంస్థ విమానం ఎక్కారు. కొద్దిసేపట్లో విమానం టేకాఫ్ అవుతుందనగా విమానం సిబ్బంది ' లగేజీలో సమస్య ఉంది. పోలీసులు మీతో మాట్లాడాలనుకుంటున్నారు' అని ఖేడాకు సమాచారమిచ్చారు. కిందకు దిగిన ఆయనను ఢిల్లీ పోలీసులు సమీపించి అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. అందుకు ససేమిరా అంగీకరించని ఖేడా వెంటనే రన్‌వేపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఆయనను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని తర్వాత అస్సాం పోలీసులకు అప్పజెప్పారు. బుధవారం అస్సాంలోని హాఫ్లాంగ్‌లో బీజేపీ నేత శామ్యూల్ ఛాంగ్‌సన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఆ రాష్ట్ర పోలీసులు ఖేడాను అరెస్ట్‌చేశారు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ' ఈ వివాదంలో 17వ తేదీన ముంబైలో ఆయన ఇప్పటికే బేషరతు క్షమాపణలు చెప్పారు. అస్సాం, లక్నో, వారణాసిలలో నమోదైన వేర్వేరు కేసులను కలిపి ఒకే చోట విచారించాలి' అని ఖేడా తరఫు లాయర్ సింఘ్వీ సుప్రీంకోర్టును కోరారు. దీంతో 'ఖేడాకు ఈనెలాఖరు దాకా రక్షణ కల్పిస్తాం. మధ్యంతర బెయిల్ కోసం నేడు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచండి. అక్కడ మధ్యంతర బెయిల్ పొందండి' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. అస్సాం, లక్నో, వారణాసిలో నమోదైన మూడు కేసులు కలిపి విచారించేందుకు మీ స్పందన తెలపాలంటూ అస్సాం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కేసు విచారణను 27వ తేదీకి వాయిదావేసింది. తర్వాత ఢిల్లీలోని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట పోలీసులు ఖేడాను హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ అర్చనా బనివాల్ ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చారు.

నియంతృత్వ పాలన ఇది: కాంగ్రెస్

'అరెస్టులతో మోదీ సర్కార్.. హిట్లర్–షాహీ పాలన స్థాయికి దేశ ప్రజాస్వామ్యాన్ని దిగజారుస్తోంది. నియంతృత్వ పోకడలను అడ్డుకోవాల్సిందే' అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ట్వీట్‌చేశారు. కాంగ్రెస్ నేతలు చట్టానికి అతీతులమనే భావనలో గడిపేస్తున్నారని బీజేపీ ఎద్దేవా చేసింది.



రన్‌వేపై కూర్చుని ధర్నాకు దిగిన ఖేడా, పార్టీ నేతలు

సీఎం కేజ్రీవాల్ పీఏను ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అవకతవకలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు(పీఏ) బిభవ్ కుమార్‌ను ప్రశ్నించింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై అతడి వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. బిభవ్ తన మొబైల్ నంబర్ ఐఎంఈఐ(ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ)ని 2021 సెప్టెంబర్–2022 జూలై మధ్యలో నాలుగు సార్లు మార్చినట్లు కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో పేర్కొంది. అయితే, ఈడీ ఆరోపణలను ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఖండించారు.

పంజాబ్‌లో రచ్చరచ్చ

- పోలీసులతో అమృత్‌పాల్ సింగ్ మద్దతుదారుల ఘర్షణ
- కత్తులు, తుపాకులతో పోలీసు స్టేషన్ వద్ద హల్‌చల్



పోలీసులపైకి దూసుకొస్తున్న దృశ్యం

అమృత్‌సర్ పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'వారిస్ పంజాబ్ దే' గ్రూప్ అధినేత అమృత్ పాల్ సింగ్ మద్దతుదారులు గురువారం వీరంగం సృష్టించారు. అడ్డుగా ఉంచిన బారికేడ్లను తొలగించి పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. ఓ కేసులో అమృత్‌పాల్ సింగ్ ప్రధాన అనుచరుడైన లవ్‌ప్రీత్ సింగ్ అలియాస్ లవ్‌ప్రీత్ తుఫాన్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వందలాది మంది 'వారిస్ పంజాబ్ దే' సభ్యులు, మద్దతుదారులు కత్తులు, తుపాకులతో అమృత్‌సర్‌లో భారీ బల ప్రదర్శన చేపట్టారు. అమృత్‌సర్–జలంధర్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. అజ్నాలా పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. చుట్టూ ఉన్న కంచెను ఛేదించుకొని ముందుకెళ్లారు. బారికేడ్లను తొలగించారు. పోలీసులను నిలదీశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అతికష్టం మీద పోలీసులు 'వారిస్ పంజాబ్ దే' సభ్యులను అడ్డుకోగలిగారు. రాజకీయ దురుద్దేశంతోనే తన అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారని అమృత్‌పాల్ ఆరోపించారు. కేసును వెనక్కి తీసుకోకపోతే జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. తాము చేతగాని వాళ్లం కాదని, అందుకే ఈ బలప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. గతంలో సామాజిక సేవ, మత ప్రచారం కోసం 'వారిస్ పంజాబ్ దే'ను ఏర్పాటుచేశారు.

హరిత ప్రగతి బాట

వెబినార్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: పవన, సౌర, బయోగ్యాస్ వంటి పునరుత్పాదక ఇంధనాల తయారీకి భారత్‌లో ఉన్న అవకాశాలు బంగారు గని లేదా చమురు క్షేత్రం కంటే తక్కువేమీకాదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని, పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆయన ఆహ్వానించారు. హరిత ప్రగతిపై 2023–24 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన వివిధ అంశాలపై గురువారం నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని ప్రసంగించారు. ఈ బడ్జెట్ కేవలం ఒక అవకాశం కాదని, భవిష్యత్తులో మన భద్రతకు హామీ ఇస్తుందని చెప్పారు. 2014 నుంచి పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు.

గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ

దేశంలో 2014 తర్వాత ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్‌లు కొత్తతరం సంస్కరణలతో కూడుకున్నవేనని తెలియజేశారు. ఆధునిక యుగంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనిపెట్టే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. హరిత ప్రగతి, ఇంధన సరఫరాలో మూడు అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మొదటిది పునరుత్పాదక ఇంధనాల ఉత్పత్తి. రెండోది శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకోవడం, మూడోది గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా ముందుకు సాగడం. ఇథనాల్ బ్లెండింగ్, పీఎం కుసుమ్ యోజన, సౌర విద్యుత్ తయారీకి ప్రోత్సాహకాలు, రూఫ్‌టాప్ సోలార్ పథకం, బ్యాటరీ స్టోరేజీ వంటి వాటికి కొన్నేళ్లుగా బడ్జెట్లలో పెద్దపీట వేస్తున్నామని గుర్తుచేశారు.

గోబర్ధన్ యోజన కింద 500 కొత్త ప్లాంట్లు

పునరుత్పాదక ఇంధన వనరుల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువు కంటే ముందే పూర్తి చేస్తున్నామని మోదీ హర్షం వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలపాలన్న లక్ష్యాన్ని ఐదు నెలల ముందే అధిగమించామని చెప్పారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని 2025–26 నాటికి చేరుకోబోతున్నామని పేర్కొన్నారు. దేశంలో మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2030 నాటికి 500 గిగావాట్లకు చేరుకుంటుందని తెలిపారు. కొత్తగా 'ఈ20' ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. భారత్‌లో పంట వ్యర్థాలకు కొదవ లేదని, ఈ అవకాశం వదులుకోవద్దని దేశవ్యాప్తంగా ఇథనాల్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. 5 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కోసం నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభించామని, ఈ విషయంలో ప్రైవేట్ రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడానికి రూ.19,000 కోట్లు కేటాయించామని వివరించారు. పేడ నుంచి గ్యాస్ ఉత్పత్తి కోసం గోబర్ధన్ యోజన కింద 500 కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించామని, ఈ ఆధునిక ప్లాంట్ల కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయబోతున్నామని వెల్లడించారు.

బ్రిటన్ సూపర్‌మార్కెట్లలో పరిమితులు

లండన్: బ్రిటన్‌లోని ప్రముఖ సూపర్‌మార్కెట్ సంస్థలు కొన్ని పండ్లు, కూరగాయల కొనుగోళ్లపై పరిమితులు విధించాయి. అననుకూల వాతావరణ పరిస్థితులు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా సరఫరా కొరత తలెత్తింది. నెల రోజుల వరకు ఇవే పరిస్థితులు కొనసాగుతాయంటూ ప్రభుత్వం హెచ్చరించడంతో సూపర్ మార్కెట్ యాజమాన్యాలు ఈ చర్యను ప్రకటించాయి. టమాటాలు, క్యాప్సికం, దోసకాయలు, బ్రకోలి, క్యాలిఫ్లవర్ తదితరాల సరఫరా తక్కువగా ఉండటంతో వీటిని ఒక్కో వినియోగదారుకు మూడు వరకే విక్రయిస్తామని టెస్కో, అస్డా, మోరిసన్స్, ఆల్డి సంస్థలు తెలిపాయి. ఆఫ్రికా, యూరప్‌ల్లో ప్రతికూల వాతావరణం, ఇంధన ధరలు పెరగడం, బ్రిటన్, నెదర్లాండ్స్‌లో గ్రీన్‌హౌస్ వ్యవసాయంపై ఆంక్షలు కారణంగా పండ్లు, కూరగాయల దిగుబడి, రవాణాపై తీవ్ర ప్రభావం పడింది.

ఆరుగురు టీటీపీ ఉగ్రవాదులు హతం

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లో గురువారం పాక్ భద్రతా బలగాల దాడిలో ఆరుగురు తెహ్రీక్–ఇ–తాలిబన్(టీటీపీ) ఉగ్రవాదులు హతమయ్యారు. లక్కి మర్వాత్ జిల్లాలోని అబ్బాసా ఖట్టక్ పోలీస్ ఠాణాపై ఉగ్రమూకలు దాడికి పథకం వేశారనే సమాచారంతో బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారి నుంచి గ్రెనేడ్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. టీటీపీని పాక్ ప్రభుత్వం నిషేధించింది. గత నెలలో టీటీపీ జరిపిన ఆత్మాహుతి దాడిలో 100 మందికి పైగా మృతి చెందారు.

ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణను ప్రత్యేక కోర్టు మార్చి 17వ తేదీకి వాయిదా వేసింది. రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగ్‌పాల్ గురువారం ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణ చేపట్టారు. ఈడీ తరఫు న్యాయవాది నవీన్ కుమార్ వాదనలు వినిపించారు. ఆధారాలు ధ్వంసం చేయడానికి యత్నించారని ఆరోపించారు. ఈడీ చార్జిషీట్‌లోని అంశాలు నమ్మశక్యంగా లేవని నిందితుల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణ మార్చి 17కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

గని ప్రమాదంలో 48 మంది గల్లంతు

బీజింగ్: చైనాలోనిఇన్నర్ మంగోలియా ప్రాంతంలోని అల్గ్జా లీగ్ గని కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో 48 మంది జాడ తెలియాల్సి ఉందని చైనా అధికార వార్తాసంస్థ గురువారం తెలిపింది. భారీగా మట్టిచరియలు విరిగిపడటంతో బుధవారం ఆగిపోయిన సహాయక చర్యలను గురువారం తిరిగి ప్రారంభించారు. ఇప్పటివరకు ఐదుగురు చనిపోయినట్లు ధ్రువీకరించారు. గాయపడిన ఆరుగురిని ఆస్పత్రికి తరలించారు. 48 మంది జాడ గుర్తించాల్సి ఉంది. ఇటీవలికాలంలో చైనాలో గని ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. గత ఏడాది జరిగిన 367 గని ప్రమాద ఘటనల్లో 518 మంది చనిపోయినట్లు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం వెల్లడించింది.

సరిహద్దు మార్గాన్ని తెరిచిన తాలిబన్లు

పెషావర్: అఫ్గానిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దుల్లోని కీలకమైన తోర్ఖామ్ మార్గాన్ని తాలిబన్ పాలకులు గురువారం తెరిచారు. వైద్యం, ఇతర అత్యవసరాల నిమిత్తం సరిహద్దులు దాటి వచ్చే వారికి పాకిస్తాన్ యంత్రాంగం అవసరమైన తోడ్పాటు ఇవ్వడం లేదంటూ తాలిబన్లు ఆదివారం తోర్ఖామ్ మార్గాన్ని మూసివేశారు. పాకిస్తాన్– మధ్య ఆసియా దేశాలకు ముఖ్యమైన సరఫరా మార్గం ఇదే. ఇది మూసుకుపోవడంతో పాకిస్తాన్ హుటాహుటిన ఉన్నత స్థాయి బృందాన్ని కాబూల్‌కు పంపించింది. డిమాండ్లను నెరవేర్చేందుకు అంగీకరించడంతో తాలిబన్లు శాంతించారు. అధికారుల సూచనలతో సరిహద్దులు తెరుచుకున్నాయి. దీంతో, అఫ్గాన్ ప్రజల కోసం ఆహార పదార్థాలు, తదితర అత్యవసరాలతో సరిహద్దుల్లో నిలిచిపోయిన వందలాది ట్రక్కులు ఖైబర్ పాస్ గుండా ముందుకుసాగాయి.



సాల్ట్‌లేక్ సిటీలో కారుపై మంచును తొలగిస్తున్న మహిళ

అమెరికాలో భీకర మంచు తుపాను

పియెర్రె: అమెరికాను భీకర మంచు తుపాను వణికిస్తోంది. రోడ్లపై మంచు పేరుకుపోవడంతో ఎక్కడి వాహనాలక్కడే నిలిచిపోయాయి. వందలాది నివాసాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. విమాన సర్వీసులు రద్దయ్యాయి. స్కూళ్లు మూతబడ్డాయి. వాతావరణ విభాగం 1989 తర్వాత మొదటిసారిగా మంచు తుపాను(బ్లిజ్జార్డ్) హెచ్చరికలను జారీ చేసింది. కొన్ని తీర ప్రాంతాల్లో అలలు 3 నుంచి 4.3 మీటర్ల ఎత్తున ఎగిసిపడుతున్నాయి. తుపాను తీవ్రత దృష్ట్యా సుమారు 24 రాష్ట్రాల్లోని 6.5 కోట్ల మంది ప్రజలకు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు. వ్యోమింగ్, ఆరిజోనా, న్యూ మెక్సికో, పోర్ట్‌ల్యాండ్, ఓరెగాన్ పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మిషిగన్, ఇలినాయీ, కాలిఫోర్నియాల్లో విద్యుత్ లైన్లు తెగిపోవడంతో జనం రాత్రిళ్లు చీకట్లోనే గడిపారు. మంచు, చలిగాలులతో కాలిఫోర్నియా, సియెర్రా నెవడాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సుమారు 1,800 విమాన సర్వీసులు రద్దు కాగా, మరో 6 వేలకు పైగా సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇలా ఉండగా, మరికొన్ని రాష్ట్రాల్లో ఇందుకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. నాష్‌విల్లేలో బుధవారం అత్యధికంగా 26.67 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై 127 ఏళ్ల రికార్డు బద్దలైందని అధికారులు చెప్పారు. ఇండియానా పొలిస్, సిన్సినాటి, అట్లాంటా, లెక్సింగ్టన్, కెంటకీ, అలబామాల్లోనూ ఇదే స్థాయిలో ఎండలున్నాయి.

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా అజయ్ బంగా!



వాషింగ్టన్: ప్రపంచ బ్యాంకు సారథిగా భారత్–అమెరికన్ అజయ్ బంగా పేరును నామినేట్ చేసిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ప్రపంచ బ్యాంక్‌ను సమర్థంగా ముందుకు నడిపించగల సత్తా అజయ్ బంగాకు ఉందని ప్రశంసించారు. ప్రపంచ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదిస్తే అత్యంత ప్రతిష్టాత్మక పదవికి అజయ్ బంగా ఎంపికైనట్లే. అదే జరిగితే ఆయన ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి భారత్–అమెరికన్‌గా, తొలి సిక్కు–అమెరికన్‌గా రికార్డు సృష్టిస్తారు. 62 ఏళ్ల బంగా జనరల్ అట్లాంటిక్ వైస్–చైర్మన్‌గా పనిచేస్తున్నారు. గతంలో మాస్టర్‌కార్డ్ అధ్యక్షుడు, సీఈఓగా సేవలందించారు. 2016లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. అమెరికాలో ప్రఖ్యాత పురస్కారాలు స్వీకరించారు.

నేటి నుంచే కాంగ్రెస్ మేధో మథనం!

- ఎన్నికల రోడ్‌మ్యాప్‌పై సమీక్ష
- రాయ్‌పూర్‌లో ప్లీనరీకి ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న 15,000 మంది ప్రతినిధులు

రాయ్‌పూర్: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ప్లీనరీ జరగనుంది. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం రోడ్‌మ్యాప్ ఖరారు చేయడంతో పాటు అధికార బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా భావసారూప్యత ఉన్న పార్టీలతో పొత్తులపై మేధో మథనం నిర్వహించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు పార్టీ అగ్రనేతలు ప్లీనరీకి హాజరవుతారు. దాదాపు 15,000 మంది ప్రతినిధులు పాల్గొంటారని అంచనా.

సీడబ్ల్యూసీకి ఎన్నికలు?

ప్లీనరీలో మొదటి రోజు పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక విభాగమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)కి ఎన్నికలు నిర్వహించాలో లేదో స్టీరింగ్ కమిటీ నిర్ణయించనుంది. ఈ ఏడాది దేశంలో ఎనిమిది రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్, కర్ణాటకలో ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఢీకొట్టాలంటే మెజార్టీ రాష్ట్రాల్లో పాగా వేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ప్లీనరీలో విస్తృతంగా చర్చించబోతున్నారు. గెలుపు వ్యూహాలపై పార్టీ నేతలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. ఎన్నికల సన్నద్ధతతోపాటు పార్టీలో అంతర్గత విభేదాల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరిస్తారు. అలాగే భావసారూప్యం కలిగిన పార్టీతో పొత్తులపై ప్లీనరీలో కొంత స్పష్టత రానుంది. సీడబ్ల్యూసీలో మొత్తం 25 మంది సభ్యులు ఉంటారు. కాంగ్రెస్ రాజ్యాంగం ప్రకారం పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేత సీడబ్ల్యూసీలో సభ్యులవుతారు. 12 మందిని ఎన్నుకుంటారు. మరో 11 మందిని నామినేట్ చేస్తారు. సీడబ్ల్యూసీకి చివరిసారిగా 1997లో కోల్‌కతాలో సీతారాం కేసరి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023

అమిత హుషారు

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. గురువారం ఉమ్మడి బళ్లారి జిల్లా సండూరులో జరిగిన బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న దృశ్యం



న్యూస్‌రీల్



గురువారం రాత్రి బెళగావిలో జరిగిన కిత్తూరు చెన్నమ్మ నాటకంలో ఓ నృత్యహేల

తుమకూరులో పీయూ ఇంగ్లిష్ పేపర్ లీక్

తుమకూరు: జిల్లాలో పీయూ మొదటి వార్షిక పరీక్ష మంగళవారం జరగాల్సి ఉంది. అయితే వాట్సాప్‌లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ ప్రశ్నాపత్ర లీక్ అయింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఆ పరీక్షను మార్చి 6కు వాయిదా వేశారు. రాష్ట్రంలో అన్ని చోట్ల ఈ ప్రశ్నాపత్రం లీక్‌కాలేదని, మొదట తుమకూరు జిల్లావ్యాప్తంగా బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. కోళాల కాలేజీ నుంచి లీకేజీ పర్వం ఆరంభమైనట్లు తెలుస్తోంది. దీంతో ఆ కాలేజీని రద్దు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఎంతో ప్రిపేర్ అయి వస్తే పరీక్ష రద్దు చేశారని, తమకు న్యాయం చేలని కోరారు.

ఫైనాన్స్ వేధింపులకు చిరుద్యోగి బలి

మైసూరు: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ సిబ్బంది వేధింపులను తట్టుకోలేక ఒక చిరుద్యోగి తన పొలంలో క్రిమినాశక మందును తాగి మరణించాడు. ఈ ఘటన నంజనగూడు తాలూకా చిక్కకవలందె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మహేశ్ (48) నంజనగూడు పారిశ్రామిక ప్రాంతంలో ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తున్నాడు. ఇతనికి కవలందెలో పొలం కూడ ఉంది. ఇతని భార్య గిరిజాంబ పేరిట మూడు లక్షల రూపాయలను ఒక ఫైనాన్స్ సంస్థ అప్పు ఇచ్చింది. రెండు నెలల కంతులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బాకీ డబ్బుల గురించి ఆ కంపెనీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. త్వరలో చెల్లిస్తానని చెప్పినా కూడా సిబ్బంది పగలూ రాత్రి కాల్ చేసి అసభ్యంగా దూషించేవారు. దీన్ని సహించలేక మహేశ్ తన పొలంలోనే విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కవలందె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

1 నుంచి ఉద్యోగుల సమ్మె

మైసూరు: వేతన పెంపు, పాత పెన్షన్ విధానం అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మార్చి 1 నుంచి నిరవధిక ధర్నాకు దిగనున్నట్లు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లాధ్యక్షుడు జె.గోవిందరాజు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆందోళనపై నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఏడో వేతన సంఘం సిఫార్సుల మేరకు వేతనాల పెంపు జరగాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే 40 శాతం ఫిట్‌మెంట్ విడుదల చేయాలన్నారు.

ఎన్‌ఐఏచే కమ్యూనిటీ హాల్ సీజ్

యశవంతపుర: మంగళూరు వద్ద బెళ్లారెలో బీజేపీ నాయకుడు ప్రవీణ్ నెట్టారు హత్యకు సంబంధించి ఎన్‌ఐఏ అధికారులు విచారణను వేగవంతం చేశారు. మిత్తూరులోని ఫ్రీడం కమ్యూనిటి హాల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ హాల్‌ను ఉగ్రవాదులు ఉపయోగించుకున్నట్లు ఎన్‌ఐఏ విచారణలో బయట పడింది. హాల్ సీజ్‌పై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఎన్‌ఐఏ అధికారు సమాచారం ఇచ్చారు.

పలువురు ఐపీఎస్‌ల బదిలీ

శివాజీనగర: ఐపీఎస్ బదిలీల్లో భాగంగా మంగళూరు పోలీస్ కమిషనర్ ఎన్. శశికుమార్‌ను రైల్వే పోలీస్ డీఐజీగా బదిలీ చేశారు. బెంగళూరు పశ్చిమ సంచార విభాగపు డీసీపీ కులదీప్ కుమార్ ఆర్.జైన్‌ను మంగళూరు పోలీస్ కమిషనర్‌గా నియమించారు. బెంగళూరు వైర్‌లెస్ ఎస్పీగా ఉన్న కిశోర్ బాబును నిఘా ఎస్పీగా, కేఎస్‌ఆర్‌టీపీ బెంగళూరు కమాండెంట్ కే.వంశీకృష్ణను బెంగళూరు వైర్‌లెస్ ఎస్పీగా, మహమ్మద్ సుజీతాను బెంగళూరు సీఏఆర్‌డీసీపీ నుంచి బెంగళూరు దక్షిణ ట్రాఫిక్ విభాగపు డీసీపీగా బదిలీ చేశారు.

మూత్ర విసర్జన చేయలేదు!

బనశంకరి: విజయపుర నుంచి మంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ నాన్ ఏసీ స్లీపర్ బస్‌లో ప్రయాణికుడు ఒక యువతిపై మూత్రవిసర్జన చేశారనేది అబద్ధమని సంస్థ తెలిపింది. దీనికి సంబంధించి కేఎస్‌ఆర్టీసీ మంగళూరు విభాగం సీనియర్ కంట్రోలర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం మత్తులో ప్రయాణికుడు యువతిపై మూత్ర విసర్జన చేయలేదన్నారు. ఖాళీ సీటుపై మూత్ర విసర్జన చేసిన అతడిని మందలించి బస్సులో నుంచి కిందికి దించి ప్రయాణం కొనసాగించామన్నారు.



తమను పర్మినెంట్ చేయాలని బెంగళూరులో కొనసాగుతున్న జాతీయ ఆరోగ్య పథకం సిబ్బంది ధర్నా

ఖజానాకు మద్యం కిక్కు

- ఏటా వందశాతం ఆదాయం
- 21 ఏళ్లవారికే విక్రయించేలా పాతచట్టం అమలు



రాష్ట్రంలో మద్యం వినియోగం ఏటేటా పెరుగుతూ సర్కారుకు ఖుషీనిస్తోంది

శివాజీనగర: రాష్ట్రంలో మద్యం వినియోగం సర్కారు నిర్దేశించిన మేరకు వంద శాతాన్ని చేరుతోంది. ఇది నెలా, రెండు నెలలకో కాదు, గత ఐదేళ్లుగా మద్యం ద్వారా కాసుల వర్షం కురుస్తోంది. స్వయంగా అబ్కారీ మంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. మద్యం కొనుగోలు వయోపరిమితి 21 సంవత్సరాల నుంచి 18 ఏళ్లకు తగ్గించడంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో సర్కారు దిగివచ్చింది. పాత పద్ధతిలోనే 21 ఏళ్లనే కొనసాగుతుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కే.గోపాలయ్య తెలిపారు. గురువారం విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో జేడీఎస్ సభ్యుడు గోవిందరాజు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. వయో పరిమితిని తగ్గిస్తూ జనవరి 9న ఉత్తర్వులు జారీ చేశాం, అయితే ఇందుకు అనేక అభ్యంతరాలు రావడంతో పరిశీలన జరిపి పాత పద్ధతినే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఐదేళ్లుగా మద్యం ఆర్థిక లక్ష్యం సఫలం

గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాల గురించి అనేకచోట్ల కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. మద్యానికి బాగా గిరాకీ ఉండడంతో ఈ సంవత్సరం ఎక్సైజ్ శాఖ నిర్ధారించిన ఆర్థిక లక్ష్యాన్ని దాటుతుందని చెప్పారు. గత ఐదు సంవత్సరాలు వరుసగా నిర్ధారిత లక్ష్యాన్ని చేరుకొన్నట్లు చెప్పారు.

ఐదు సంవత్సరాల్లో.. లక్ష్యాన్ని మించి రాబడి

- 2017–18లో ఇచ్చిన లక్ష్యం రూ.17,600 కోట్లు కాగా, 17,948 కోట్ల రాబడి వచ్చింది.
- 2018–19లో లక్ష్యం రూ.19,750 కోట్లు కాగా, 19,943 కోట్ల ఆదాయం.
- 2019–20లో లక్ష్యం రూ.20,950 కోట్లు కాగా, 21,593 కోట్ల ఆర్జన.
- 2020–21లో లక్ష్యం 22,700 కోట్లు, సమకూరింది 23,332 కోట్లు
- 2021–22లో లక్ష్యం 24,580 కోట్లు, వచ్చింది 26,377 కోట్లు.



- 2022–23లో లక్ష్యం 32,000 కోట్లు కాగా, జనవరి ఆఖరికి 24,724 కోట్లు వసూలు.

బెంగళూరును చెత్తబుట్ట కానివ్వం

- అక్కడక్కడా సమస్యలు ఉండొచ్చు
- విధాన పరిషత్‌లో సీఎం బొమ్మై



నగరంలో ఓ మార్కెట్లో చెత్త (ఫైల్)



గురువారం విధాన పరిషత్ సమావేశం

బనశంకరి: బెంగళూరు నగరం చెత్త బుట్ట అనే పేరు రావడానికి అవకాశమిచ్చేది లేదని సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. గురువారం అసెంబ్లీలో విధాన పరిషత్‌లో సభ్యుల ప్రశ్నలపై ఆయన మాట్లాడుతూ నగర చెత్త సమస్యను ప్రస్తావించారు. బెంగళూరులో కొన్నిచోట్ల చెత్త సమస్య ఉండటం సహజం. అన్నిచోట్లా ఆ సమస్య లేదు. వీటిని సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటీ సిటీని చెత్తమయం చేసేందుకు అనుమతించబోమన్నారు. ఇక జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం దేశంలోనే 2వ స్థానంలో నిలిచిందని చెప్పారు. 11,914 జీఎస్టీ వంచన కేసుల్లో రూ.1819 కోట్ల పన్నులు వసూలయ్యేలా చేశామన్నారు.

107 కొత్త పోలీస్ స్టేషన్లు

- రాష్ట్రంలో కొత్తగా 107 పోలీస్‌స్టేషన్లు నురూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని, వివిధ చోట్ల ల్యాబోరేటరీలనును నెలకొల్పుతామని హోంమంత్రి జ్ఞానేంద్ర తెలిపారు.
- రాష్ట్రంలో 100 ప్రాథమిక కేంద్రాలను ఆరోగ్యసముదాయ ఆరోగ్యకేంద్రాలుగా ఉన్నతి కల్పిస్తామని ఆరోగ్యశాఖామంత్రి సుధాకర్ తెలిపారు.
- బీడీఏ నుంచి ఒకసారి స్వాధీనం చేసుకున్న భూములకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తీర్మానించిందని సీఎం బొమ్మై తెలిపారు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా డీ నోటిఫికేషన్ చేసిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయన్నారు. బీబీఎంపీ, బీడీఏ ఆస్తులను రక్షిస్తామన్నారు.
- పాత పింఛన్ విధానం అమలుకు చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. 2006 సంవత్సరం ప్రాతిపదికగా అమలు చేస్తామని చెప్పారు.
- వన్యజీవులు, మనుషుల మధ్య దాడుల నివారణకు అనేక చర్యలు తీసుకున్నామని న్యాయశాఖామంత్రి జేసీ.మాదుస్వామి తెలిపారు. ఏనుగు కారిడార్ ఏర్పాటు చేశామన్నారు.
- డాక్టర్ల వేతనం పెంచాలని అన్నిపార్టీల సభ్యులు డిమాండ్ చేశారు.

కుటుంబాన్ని బలిగొన్న అప్పులు

- హావేరి జిల్లాలో విషాదం



కూతురు, తల్లిదండ్రులు (ఫైల్)

యశవంతపుర: అప్పుల బాధతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న ఘటన హావేరి జిల్లా సవణూరు తాలూకా తొండూరు గ్రామంలో జరిగింది. హనుమంతగౌడ పాటిల్ (54), భార్య లలిత (50), కూతురు నేత్ర పాటిల్ (22)లు ఆత్మహత్య చేసుకున్నారు. రైతు అయిన హనుమంతగౌడ ఇటీవల కొత్త ఇంటిని కట్టి, కూతురు నేత్రకు వివాహం చేశారు. ఇందుకుగాను సుమారు రూ.25 లక్షలు వరకు అప్పు చేశారు. అప్పులు చెల్లించలేక ముగ్గురూ ప్రాణాలు తీసుకోవడమే శరణ్యమనుకున్నారు. అల్లుని ఊరైన రాణిబెన్నూరుకు వెళ్లగా అక్కడ పెద్దలు వారి పరిస్థితిని గమనించి సర్దిచెప్పి వాపస్ పంపారు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చిన హనుమంతగౌడ, లలిత ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. విషయం తెలిసి నేత్ర కూడా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ సేవించిన విద్యార్థులు సస్పెండ్

యశవంతపుర: మత్తు పదార్థాలను సేవించారని ఉడుపి జిల్లాలోని మణిపాల్ వర్సిటీ 42 మంది విద్యార్థులను నెల రోజుల పాటు సస్పెండ్ చేసింది. వర్సిటీలో ఆరోగ్యకరమైన వాతావారణం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్సిటీ యజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 42 మంది విద్యార్థులు డ్రగ్స్ సేవించి తరగతులకు హాజరైనట్లు తెలిపింది. కాగా, మంగళూరులో కొందరు వైద్య విద్యార్థులను ఇదే కారణంతో ఇటీవల పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. రాష్ట్రంలో విద్యాలయాల్లో విద్యార్థులు మాదకద్రవ్యాల కేసుల్లో పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది.

ప్రాథమిక నివేదిక సమర్పణ

- బీడీఏ కార్యాలయంపై లోకాయుక్త దాడి కేసు

శివాజీనగర: కొన్ని రోజుల క్రితం బీడీఏ కార్యాలయంపై లోకాయుక్త దాడికి సంబంధించి లభించిన ఆధారాల వివరాలపై నివేదికను సమర్పించాలని లోకాయుక్త సూచించింది. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు లోకాయుక్తకు ప్రాథమిక నివేదికను సమర్పించారు. లోకాయుక్త న్యాయ విభాగానికి బీడీఏ అక్రమాలపై ప్రాథమిక నివేదికను సమర్పించగా, ప్రాథమిక తనిఖీ సమయంలో పలు అక్రమాలు బయటపడినట్లు తెలిసింది. లోకాయుక్త పోలీసుల దాడి సమయంలోనే ఇప్పటికే పలు అక్రమాలు బహిరంగమైనట్లు తెలిసింది. భూస్వాధీన, భూ పరిహారం, ఇళ్ల స్థలం, ఫ్లాట్ పంపిణీ, ఒకే సైట్ పలువురికి పంపిణీ చేయటం తెలిసింది. అంతేకాకుండా కార్నర్ సైట్, సీఏ సైట్‌ల పంపిణీ విషయంలోనూ అక్రమాలు చోటు చేసుకోవటం బయటపడింది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో అక్రమాల్లో పాల్గొన్న అధికారులకు నోటీసులు ఇచ్చి, అటువంటి అధికారులను విచారణ చేపట్టేందుకు లోకాయుక్త సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

యాచక దందా ఆటకట్టు

- నగరవ్యాప్తంగా దాడులు
- 55 మందికి విముక్తి



బెంగళూరులో ఏ కూడలిలో చూసినా ఇంతే

శివాజీనగర: బలవంతంగా మహిళలు, పిల్లలచే భిక్షాటన చేయిస్తున్న వైనంపై బెంగళూరు సీసీబీ అధికారులు దాడులు జరిపి 55 మందిని కాపాడారు. నగరవ్యాప్తంగా ఒకే సమయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ ఎస్.డీ.శరణప్ప తెలిపారు. ముగ్గురు బాలురు, 5 మంది బాలికలు, 18 మంది తల్లీ బిడ్డలు, 5 మంది పురుష యాచకులను అదుపులోకి తీసుకుని బాలల, మహిళా సంరక్షణాలయాలకు తరలించారు. ఇతర ప్రాంతాల నుంచి పిల్లలను ఎత్తుకు వచ్చి వారికి మత్తుమందు ఇచ్చి నిద్రపుచ్చుతారు, తరువాత చింపిరి బట్టలు వేసి దయనీయంగా మార్చి కూడళ్లలో నిలబడి యాచిస్తారు. ఎవరో ఒకరు దయతలచి డబ్బులు ఇస్తూ ఉంటారు. రోజువారి వసూలైన మొత్తం ఈ యాచకులను వెనుకనుంచి నడిపించే వారు దోచుకుంటారు. దీనిపై పలు స్వచ్ఛంద సంస్థల నుంచి సమాచారం అందుకుని దాడులు నిర్వహించారు.

పిల్లలను ఎత్తుకొచ్చి యాచన

- భిక్షాటన ద్వారా ఆర్జించాలని కొందరు మహిళలు ఇతరుల పిల్లలను ఎత్తుకుని వచ్చినట్లు గుర్తించారు.
- యాచకుల్లో ఎక్కువమంది కూలీ కార్మికులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారు. కొంచెం కన్నడను నేర్చుకొని యాచిస్తారు.
- సొంతంగా పిల్లలు లేని మహిళలు రోజుకింత ఇస్తామని ఇతరుల పిల్లలను బాడుగకు తెచ్చుకుంటారు. మరికొందరు ఏకంగా కిడ్నాప్ చేసి తెచ్చుకున్నట్లు తేలింది. ఆ పిల్లలు ఎప్పుడూ నిద్రలో ఉండేలా మత్తు మందులను ఇచ్చి యాచన సాగిస్తారని గుర్తించారు.
- భిక్షాటన చేస్తున్న మహిళలకు– వారి జోలెలో ఉన్న పిల్లలకు అస్సలు పోలికలు లేకపోవటం కనిపించింది. కేసు విచారణలో ఉంది.

కదం తొక్కిన రైతులు





కలెక్టరేట్ ముందు ఆందోళనలు చేస్తున్న రైతు సంఘాలు

- మండ్య కలెక్టరేట్ ముట్టడి

మండ్య: వివిధ డిమాండ్ల సాధన కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో అన్నదాతలు మండ్య కలెక్టరేట్‌ను ముట్టడించారు. నగరంలోని సర్ ఎం. విశ్వేశ్వరయ్య విగ్రహం ఎదుట ఎద్దుల బండి, ట్రాక్టర్లతో వేలాది మంది రైతులు, అక్కడి నుంచి జిల్లాధికారి కార్యాలయం చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు నేతలను అడ్డుకునేందుకు పోలీసులు రోడ్డుపై పెట్టిన బ్యారికేడ్లను కూడా ఛేదించుకుంటూ జిల్లా అధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు. 105 రోజులుగా టన్ను చెరకుకు రూ. 4500, పాలకు ప్రోత్సాహక ధనం ఇవ్వాలని కోరుతూ నిరవధిక ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం రైతుల సమస్యలపై స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి మైసూరుకు చెందిన నేత్రావతి ట్రాక్టర్ నడిపి అందరి దృష్టిని ఆకర్షించారు. బ్యారికేడ్లను దాటుకుంటూ ముందుకు వెళుతున్న సమయంలో పోలీసులకు, రైతులకు వాగ్వాదం జరిగింది. రైతుల ఆందోళనతో కలెక్టరేట్ పరిసరాల్లో రద్దీ నెలకొంది.

త్వరలో ఎలెక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు



సాక్షి బెంగళూరు: బెంగళూరు నగర వాసులకు అతి త్వరలో డబుల్ డెక్కర్ బస్సుల్లో ప్రయాణించే అనుభవం రానుంది. ఇవన్నీ ఎలెక్ట్రిక్ బస్సులే కానున్నాయి. ఓ ప్రముఖ సంస్థతో బస్సుల కొనుగోలుకు బీఎంటీసీ ఒప్పందం చేసుకుంది. తొలుత ఐదు డబుల్ డెక్కర్ బస్సులకు రూ. 10 కోట్లు బీఎంటీసీ చెల్లించనుంది. తొలి బస్సు మార్చిలో, మరో నాలుగు బస్సులు ఏప్రిల్‌లో వస్తాయి. ఇందులో ఏసీ సహా పలు ఆధునిక వసతులు ఉంటాయని బీఎంటీసీ వర్గాలు తెలిపాయి. మొదటి ఏసీ డబుల్ డెక్కర్ బస్సు హెబ్బాల నుంచి సిల్క్ బోర్డు మార్గంలో ప్రయాణించనుంది. వోల్వో వజ్ర బస్సులో చెల్లించే టికెట్ చార్జీలే ఈ బస్సులోనూ ఉండనున్నాయి. ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే సుమారు 250 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ బస్సుకు ముందు భాగం, వెనుక భాగంలో తలుపులు ఉంటాయి. 65 మంది ప్రయాణించవచ్చు.

మధురం గానామృతం



ప్రశాంతి నిలయం: సత్యసాయి వైభవాన్ని చాటుతూ మధుర స్వరాలతో నిర్వహించిన సంగీత కచేరితో భక్తులు తన్మయులయ్యారు. గురువారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి హయ్యర్ లర్నింగ్ సంగీత కచేరి బృందం విద్యార్థులు గానాలాపనను నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ ప్రేమ తత్వాన్ని కొనియాడుతూ నిర్వహించిన సంగీత కచేరి భక్తులను ఆద్యంతం ముగ్ధుల్ని చేసింది. సుమారు గంట పాటు కచేరీ సాగింది. పలు రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొన్నారు.





నీలి జలాలపై రివ్వుమంటూ

గురువారం ఉడుపి వద్ద స్వర్ణ నదిలో ప్రారంభమైన జాతీయ డ్రాగన్ రేస్ పడవల పోటీల దృశ్యాలు. దేశం నలుమూలల నుంచి పోటీదారులు తరలివచ్చారు

క్లుప్తంగా

హత్య కేసు ఛేదించారని ఖాకీలకు సన్మానం



సన్మానం చేసిన దృశ్యం

తుమకూరు: కుణిగల్ తాలూకా సీనప్పనహళ్లిలో మంజునాథ అనే యువకున్ని భార్య సుపారీ ఇచ్చి హత్య చేయించడం తీవ్ర సంచలనం కలిగించింది. ఈ కేసులో దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసిన పోలీసులను గ్రామస్తులు సన్మానించారు. తాలూకాలోని ఉత్రిదుర్గ హోబళి సీనప్పనహళ్లి గ్రామంలో ఇటీవల హర్షిత అనే యువతి తన భర్త మంజునాథ్‌ను సుపారీ ఇచ్చి చంపించింది. ఆమె పిన్ని కొడుకు, మరో యువకుడు కలిసి హత్య చేశారు. మంజునాథ శవాన్ని, అతని బైక్‌ను కిత్నా మంగళ చెరువులో పడేసి పరారయ్యారు. పోలీసులు నాలుగు రోజుల్లో ఈ కేసును ఛేదించి 8 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ కుమార్, డీవైఎస్పీ లక్ష్మీకాంత్, సీఐ అరుణ్ సోలంకి, ఎస్సై గురుప్రసాద్, ఎస్ఐ జమాల్ అహ్మద్, సిబ్బందిని గ్రామస్తులు సన్మానించారు.

లారీ ఢీకొని పాదచారి మృతి

తుమకూరు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన తుమకూరు తాలూకా ఓబళాపుర గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగింది. ఓబళాపుర గ్రామం వద్ద స్థానికుడు అంజనమూర్తి (35) రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. తరువాత రోడ్డు పక్కకు తలకిందులుగా పల్టీ కొట్టింది. లారీ డ్రైవర్ బీనీర్‌కు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

రోడ్డు వంతెనకు చురుగ్గా మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కర్ణాటక-తెలంగాణ రాష్ట్రాల మధ్య జాతీయ రహదారి- 167లో కృష్ణా నదిపై వారధిగా ఉన్న పాత రోడ్డు వంతెనకు చురుగ్గా మరమ్మతులు సాగుతున్నాయి. వంతెన దుస్థితికి చేరడంతో ఈనెల 22 నుంచి 25 వరకు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. ఈనేపథ్యంలో ఇరు రాష్ట్రాల మధ్య వంతెనపై వాహన రాకపోకలను నిలిపివేయడంతో ప్రజలు నడుచుకుంటూ వెళుతున్నారు.

అక్రమ తుపాకుల పట్టివేత

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లాలో తుపాకులను మరమ్మతు చేసే షాపులపై పోలీసులు దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్‌లేని 10 తుపాకులు, రెండు రివాల్వర్లు, 62 తూటాలను సీజ్ చేశారు. ఆరుమంది నేత్రకుండ ఎస్టేట్‌కు చెందిన వ్యక్తులపైన కేసులు నమోదు చేశారు.

అనుమానం పెనుభూతమై..

- భర్త చేతిలో భార్య హతం



మృతురాలు పవిత్ర, నిందితుడు నాగరాజ్

రాయచూరు రూరల్: అనుమానం పెనుభూతమై భర్త చేతిలో భార్య హత్యకు గురైన సంఘటన జిల్లాలోని మాన్వి తాలూకా సాదాపూర్‌లో జరిగింది. బుధవారం రాత్రి భార్య శీలాన్ని శంకించిన భర్త నాగరాజ్ వాగ్వాదానికి దిగి కోపోద్రేకంతో ఇంట్లోనే భార్య పవిత్ర(24)ను గొడ్డలితో నరికి హత్య చేశాడని మాన్వి సీఐ వీరభద్రయ్య తెలిపారు. నాగరాజ్‌ను అరెస్ట్ చేసి మాన్వి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వాలి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం సిరవారలో నీటిపారుదల శాఖాధికారులతో సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. నీటి గేజ్ నిర్వహణను చేపట్టి ఆయకట్టు భూములకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఎయిడెడ్ టీచర్ల ధర్నా



నల్లబ్యాడ్జీలతో ధర్నా చేస్తున్న టీచర్లు

గంగావతి: పింఛన్ కోసం ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు కారటగిలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసనను వ్యక్తం చేశారు. ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు గత 139 రోజులుగా బెంగళూరులోని ఫ్రీడం పార్క్‌లో దీక్ష చేస్తున్నా ప్రభుత్వం దిగి రాక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోరాటాన్ని ఉధృతం చేశామన్నారు. సింధనూరుకు చెందిన ఉపాధ్యాయుడు శంకరప్ప బోరెడ్డి ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. త్వరలో తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

కర్ణాటకను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



అమిత్‌షాను సన్మానించి జ్ఞాపికను బహూకరిస్తున్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న ప్రజలు, పార్టీ కార్యకర్తలు

సాక్షి,బళ్లారి: వచ్చే ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీని సొంతంగా అధికారంలోకి తెస్తే దక్షిణ భారతంలోనే కర్ణాటకను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లాలోని సండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ విజయసంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. జేడీఎస్, కాంగ్రెస్‌లు రెండూ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆ పార్టీలకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. సుపరిపాలన అందించే బీజేపీకి ఓటు వేయాలన్నారు. దేశ భద్రత, అభివృద్ధి కోసం మోదీని బలపరచాలన్నారు. మోదీ ప్రధాని అయిన తర్వాతనే పాకిస్థాన్ గుండెల్లో వణుకు పుట్టిందన్నారు. కాంగ్రెస్ హయాంలో రామ మందిరం నిర్మించలేకపోయారని గుర్తు చేశారు. మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కోవిడ్‌లో దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. ప్రజలకు ఉచితంగా టీకాలు వేయించామన్నారు. మరోసారి బీజేపీపై నమ్మకం ఉంచాలని, బీజేపీనే ఈ దేశానికి అవసరం అన్నారు. కశ్మీర్ భారత్ భూభాగమేనని నిరూపిస్తూ ఆర్టికల్-370ని అమలు చేశామన్నారు. రైతుల శ్రేయస్సు కోసం మోదీ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా ప్రతి రైతుకు మేలు చేస్తున్నామన్నారు. అనంతరం అమిత్‌షాకు వెండి గదను బహూకరించి ఘనంగా సన్మానించారు.

మళ్లీ పార్టీ గెలుపే లక్ష్యం- మాజీ సీఎం యడ్డి

వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని, అయినా రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేసి 140 సీట్లలో పార్టీ అభ్యర్థులను గెలిపిస్తానని మాజీ సీఎం యడియూరప్ప తెలిపారు. ఆయన గురువారం సండూరులో విజయసంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్, మంత్రులు శ్రీరాములు, ఆనంద్‌సింగ్, లోక్‌సభ సభ్యులు దేవేంద్రప్ప, కరడి సంగణ్ణ, ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర రెడ్డి, ఎంఎస్ సోమలింగప్ప, ఎమ్మెల్సీ వైఎం.సతీష్, మాజీ లోక్‌సభ సభ్యురాలు జే.శాంత, జిల్లా బీజేపీ అధ్యక్షులు మురహరగౌడ, పార్టీ నాయకుడు కే.ఎస్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

హుబ్లీలో అమిత్‌షాకు ఘన స్వాగతం

హుబ్లీ: వాణిజ్య నగరి హుబ్లీకి గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విచ్చేశారు. బళ్లారి కార్యక్రమం నేపథ్యంలో ప్రత్యేక విమానంలో హుబ్లీ విమానాశ్రయానికి వచ్చిన ఆయన్ను కలిసేందుకు స్థానిక నేతలు తరలి వచ్చారు. భారీ బందోబస్తు మధ్య ఆయన అనంతరం హెలిక్యాప్టర్ ద్వారా బళ్లారి జిల్లా సండూరుకు వెళ్లారు. ఆయనకు విమానాశ్రయంలో గౌరవ వందనం సమర్పించారు. జిల్లాధికారి గురుదత్త హెగ్డె, పోలీస్ కమిషనర్ రమణగుప్త ప్రభుత్వ గౌరవ లాంఛనాలతో ప్రత్యేకంగా ఘన స్వాగతం పలికారు.

1 నుంచి ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె

కంప్లి: 7వ వేతన కమిషన్ అమలుతో పాటు పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని, లేని పక్షంలో మార్చి 1 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టీ.గిరీష్ బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పురసభ, జెస్కాం మినహా తాలూకాలోని 571 మంది ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారన్నారు. సంఘం పదాధికారులు దొడ్డబసప్ప, పీ.బసవరాజ్, కే.విరుపాక్షి, కే.వీరేష్, హన్మంతప్ప, మునవర్, టీఎం.బసవరాజ్, సుగ్గేనహళ్లి రమేష్, కే.శివానంద డీఎస్.కరిబసప్ప, రేణుకమ్మ, సునీత, పూజారిలు పాల్గొన్నారు.

హొసపేటి: 7వ వేతన కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు మార్చి ఒకటో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విజయనగర జిల్లాధ్యక్షుడు జి.మల్లికార్జునగౌడ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ విధులకు గైర్హాజరై సమ్మెకు మద్దతు తెలుపుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల జీత భత్యాలను సవరించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కడ్లె వీరభద్ర, బసవరాజ్ పాల్గొన్నారు.

హత్య చేసి ముక్కలు చేశారా?

- మండ్య తాలూకా కెరెగోడు వద్ద మానవ అవశేషాలు



లభించిన మానవ శరీర అవశేషాలు

మండ్య: మండ్య తాలూకా కెరెగోడు పోలీసు స్టేషన్ పరిధిలో ఐదు వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తి శరీర భాగాలు దొరకడం తీవ్ర కలకలం కలిగించింది. హోడాఘట్ట గ్రామ శివార్లలో కాలువలో మధ్యాహ్నం 12.30 గంటలకు నడుము నుంచి మోకాలు వరకు ఉన్న శరీర భాగం దొరికింది. సమాచారం అందిన పోలీసులు పరిసర ప్రాంతాల్లో గాలిస్తూ వెళ్లగా దణాయకనపుర వద్ద ఒక చోట చేయి, మరో చోట మరో చేయి భాగం, ఇంకోచోట కాలు కనిపించాయి. శివార-బెసగరహళ్లి ముఖ్యరోడ్డు పక్కన ఉన్న కాలువలో మరో కాలు దొరికింది. ఇంకా శోధన కొనసాగించగా సాయంత్రం 6.30 గంటలకు కొప్ప వద్ద కుళ్లిపోయిన స్థితిలో తల దొరికింది. అయితే గొంతు నుంచి నడుము వరకు ఉన్న భాగం ఇంకా లభించలేదు.

మిస్టరీగా కేసు..

కొన్ని నెలల క్రితం శ్రీరంగపట్టణం, పాండవపుర పోలీసు స్టేషన్ పరిధిలో ఇదేమాదిరిగా ముక్కలైన ఇద్దరు మహిళల శరీర భాగాలు లభించాయి. ఈ కేసులను మండ్య పోలీసులు ఛేదించారు. అంతలోనే మరో సంఘటన జరగడం గమనార్హం. ఈ శరీరభాగాలు కొద్దిగా కుళ్లిన స్థితిలో ఉండడం బట్టి ఒకటి రెండు వారాల కిందటే ఎవరో హత్య చేసి పడవేసి ఉంటారని, వయసు 35- 40 ఏళ్ల మధ్యలో ఉండవచ్చని అనుమానిస్తున్నారు. శరీర భాగాలను మండ్య మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఈ కేసు పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

రైలు కిందపడి ఉపాధ్యాయుడి ఆత్మహత్య



శంకరప్ప బోరెడ్డి (ఫైల్)

శివాజీనగర/రాయచూరు రూరల్: పింఛన్ కోసం బెంగళూరులో జరుగుతున్న ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల నిరవధిక సమ్మెకు రాయచూరు జిల్లా నుంచి వచ్చిన ఉపాధ్యాయుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శంకరప్ప బోరడ్డి (47) మృతి చెందిన దురదృష్టవంతుడు. బోరడ్డి బాగలకోటె జిల్లా బీళగి తాలూకా సునక గ్రామానికి చెందినవాడు. రాయచూరు జిల్లా సింధనూరు పట్టణంలో ఎయిడెడ్ పాఠశాలలో గణిత శాస్త్రం ఉపాధ్యాయుడిగా ఉన్నారు. ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులతో పింఛన్ కోసం జరుగుతున్న ధర్నాలో పాల్గొనేందుకు రాయచూరు నుంచి బెంగళూరుకు వచ్చారు. మంగళవారం ఫ్రీడం పార్కులో జరిగిన కర్ణాటక రాష్ట్ర ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ధర్నా ముగిసిన తరువాత మెజిస్టిక్ రైల్వే స్టేషన్ వద్దకు వచ్చి రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకొన్నారు. మృతుడి కుటుంబంవారు వచ్చేలోగా పోలీసులే శవపరీక్ష చేయించారు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని పంపేందుకు అన్ని ఏర్పాట్లను చేసుకొన్నారు. దీనిపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడైన ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులు బాగలకోటె జిల్లా పాలక మండలి భవనానికి అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకొచ్చారు. అంబులెన్స్‌ను గేట్‌లోనే పోలీసులు అడ్డుకొన్నందుకు పోలీసులతో కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఆత్మహత్య చేసుకొన్న ఉపాధ్యాయుడి కుటుంబానికి ఉద్యోగం, తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వంపై మాజీ మంత్రి ఎస్.ఆర్.పాటిల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

స్కూల్ బస్సు ఢీకొని 42 గొర్రెలు బలి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కంప్లి: స్కూల్ బస్సు ఢీకొని 42 గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. పట్టణంలోని ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన బస్సు సాయంత్రం స్కూల్ వదిలిన తర్వాత విద్యార్థులను సణాపురంలో దించేందుకు వెళ్లింది. మార్గమధ్యంలో అళ్లళ్లి తాండా వద్ద సణాపురానికి చెందిన గొర్రెల కావర్లు పంపాపతి, రుద్రప్ప, గణేష్‌లు గొర్రెల మందతో వెళుతుండగా బస్సు వేగాన్ని తగ్గించేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. అయితే బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. బస్సులో పిల్లలకు ఎలాంటి హాని జరగలేదు. విషయం తెలిసిన పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే గణేష్, పశువైద్యులు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. గొర్రెల యజమానులకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇక పాఠశాల యాజమాన్యం ప్రముఖురాలు జయలక్ష్మి బాధితులకు గొర్రెలను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై కంప్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఊరెళ్లిన వృద్ధురాలు, ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని కసాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని లక్ష్మీదేవి అనే మహిళకు చెందిన ఇల్లు కాలిపోయింది. లక్ష్మీదేవి కొడుకు లిద్దరూ వ్యాపారరీత్యా బళ్లారిలో స్థిర పడటంతో లక్ష్మీదేవి కొన్నిరోజులు కొడుకుల దగ్గర, మరికొన్ని రోజులు గ్రామంలో సొంత ఇంటిలోనూ ఉంటుంది. కొన్నిరోజుల కిందట ఇంటికి తాళం వేసి బళ్లారిలో కొడుకుల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇరుగుపొరుగు వారు ఇళ్ల ముందు ఉన్న చెత్తను ఊడ్చి నిప్పు పెట్టారు. ఆ నిప్పురవ్వలు గాలికి ఎగిరి లక్ష్మీదేవి ఇంటిపై పడ్డాయి. మట్టిమిద్దె కావడం, మిద్దెపై ఉన్న గడ్డి ఎండిపోయి ఉండటంతో మంటలు రాజుకున్నాయి. ఆ మంటలు నెమ్మదిగా లోపలికి దిగి ఇంటి పైకప్పుకు వేసిన దూలాలకు వ్యాపించాయి. మంటలు క్రమంగా పెరిగి గురువారం ఉదయానికి ఇల్లు మొత్తం కాలిపోసాగింది. ఉదయాన్నే విషయం గమనించిన ఇరుగు పొరుగు వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకొని మంటలను ఆర్పి వేశారు. కాగా ఈ ఘటనలో ఇల్లంతా కాలిపోవడంతో దాదాపు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత వృద్ధురాలు లక్ష్మీదేవి తెలిపారు.

ఇంటిస్థలం కబ్జా చేశారని ఆవేదన

- ఖర్చుల కోసం తాళి అమ్ముకున్నా
- లోకాయుక్త ఎస్పీకి మహిళ మొర



సమస్యను చెప్పుకుంటూ విలపిస్తున్న బాధితురాలు మంజుల

పావగడ: తన ఇంటి స్థలాన్ని శ్రీనివాసగుప్త అనే వ్యక్తి కబ్జా చేశాడని, ఈఓ శివరాజయ్య కు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని, తనకు తల దాచు కోడానికి ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, ఇంటి స్థలం విడిపించుకోడానికి తాళి బొట్టు అమ్మి కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని మంగళవాడకు చెందిన దళిత మహిళ మంజుల విలపిస్తూ లోకాయుక్త ఎస్పీ పాషావలికి మొరపెట్టుకుంది. ఆమె ఆవేదన అందర్నీ కలచివేసింది. వివరాలు.. స్థానిక టీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె లోకాయుక్త ఎస్పీ పాషావలికి సమస్యను చెప్పుకుంది. ఎస్పీ పాషావలి మాట్లాడుతూ బాధితుల సమస్యలు సకాలంలో పరిష్కరించకపోతే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ప్రజావాణి కార్యక్రమానికి ఎంతో ఆశతో వస్తారని, అయితే అధికారుల నిర్లక్ష్య ధోరణితో సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జఠిలం మవుతున్నాయని ఆగ్రహించారు. ఇంటి స్థలం కోల్పోయిన మంజుల ఇంటి స్థలాన్ని తక్షణమే విడిపించి ఆమెకు ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఈఓ శివరాజయ్యను ఆదేశించారు.

సర్వే, టీపీ, పీడీఓలపై అధిక ఫిర్యాదులు..

సర్వే శాఖ, టీపీ, పీడీఓలపై ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని ఎస్పీ తెలిపారు. నిడుగల్‌కు చెందిన జయమ్మ ఇంటిలో దొంగతనం జరిగి నాలుగు నెలలైనా ఇంతవరకు సంఘటనపై కేసు నమోదు కాకపోవడంపై సీఐ కాంతరెడ్డిపై ఆయన మండిపడ్డారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో 15 మంది బాధితులు ఫిర్యాదులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మంజునాథ్, ఎస్ఐలు సత్యనారాయణ, శివరుద్రప్ప, తహసీల్దార్ సుజాత, ఈఓ శివరాజయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

పార్టీలకతీతంగా వార్డుల అభివృద్ధి



మాట్లాడుతున్న పురసభ అధ్యక్షురాలు లలితా శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ఆయిషా

శ్రీనివాసపురం : పట్టణంలోని అన్ని వార్డుల్లో పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని పురసభ అధ్యక్షురాలు ఎం ఎస్ లలితా శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వ సభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవిలో నీటి సమస్య నివారణకు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. రోడ్లు, డ్రైనేజీల శుభ్రతకు ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షురాలు ఆయిషా నయాజ్ మాట్లాడుతూ సర్వ సభ్య సమావేశంలో ఆదాయ, వ్యయ సమాచారం ఇవ్వాలన్నారు. పురసభలో జనన, మరణ సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయడం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పురసభ కార్యాలయం ముందు పార్కు నిర్మాణం, అన్ని వార్డులకు వార్డు సంఖ్యలు ఇవ్వడం, పార్కింగ్ టైల్స్ ఏర్పాటు, పురసభ సిబ్బంది విశ్రాంతి గృహాల నిర్మాణం, నీటి సరఫరాకు ఔట్ సోర్సు కాంట్రాక్టు ఇవ్వడం, పౌర కార్మికులకు ఉదయం ఉపాహారం ఇవ్వడం తదితర 27 అంశాలను ఆమోదించారు. సమావేశంలో పురసభ ముఖ్యాధికారి వై ఎస్ సత్యనారాయణ, ఆరోగ్య అధికారి కె జి రమేష్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వి నాగరాజ్, ఇంజినీర్ శ్రీనివాస్, సంతోష్, సురేష్ తెలిపారు.

అవినీతి నిర్మూలనకు చీపురు అభియాన్



చీపుర్లతో రోడ్లు ఊడుస్తున్న ఆప్ కార్యకర్తలు

శ్రీనివాసపురం : సమాజంలో పేరుకు పోయిన అవినీతిని నిర్మూలించడానికి చీపురు అభియాన్‌ను చేపట్టినట్లు, ప్రతి ఒక్కరు చీపురు పట్టి అవినీతిని నిర్మూలించాలని ముళబాగిలు తాలూకా ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు సంగసంద్ర విజయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం ముళబాగిలు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద చీపురు అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. తాలూకాలో ఎక్కడ చూసినా తాండవిస్తున్న అవినీతి అక్రమాలతో ప్రజలు విసిగి పోయి అవినీతిపై పోరాటానికి సిద్ధమవుతున్నారన్నారు. చీపురు కేవలం చెత్త శుభ్రం చేయడానికి మాత్రమే కాదు అవినీతిని అడ్డుకోవడానికి కూడా ఆయుధమన్నారు. ప్రభుత్వ అవినీతిని ఎండగట్టడానికి పార్టీ కృతనిశ్చయంతో ఉందన్నారు. ఢిల్లీ తరహాలో విద్య, ఉచిత విద్యుత్ ఇవ్వడానికి పార్టీ సిద్ధంగా ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జేడీఎస్‌కు మద్దతివ్వండి



మాట్లాడుతున్న జీకే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం : రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటర్లు వచ్చే ఎన్నికల్లో జేడీఎస్‌కు మద్దతు తెలపాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీకే వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం జేవీ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కేవలం ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అత్యధిక స్థానాలు సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా ఆస్తులు సంపాదించుకోలేదన్నారు. రాష్ట్ర జేడీఎస్ ప్రధాన కార్యదర్శి బీవీ శివారెడ్డి మాట్లాడుతూ నబార్డు నుంచి కేంద్రం డీసీసీ బ్యాంకు స్త్రీశక్తి సంఘాలకు ఇస్తున్న రుణాలను కొంత మంది తమ స్వంత జేబు నుంచి ఇస్తున్నట్లు ప్రచారం సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా కేజీఎఫ్ జేడీఎస్ అభ్యర్థి రమేష్‌బాబు, జెడ్పీ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి, ఎంఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యతనివ్వాలి

మాలూరు : ప్రజలు గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యతనివ్వడంతో పాటు పరిసరాల సంరక్షణ, కాలానుగుణంగా ఆరోగ్య పరీక్షలను చేయించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సొసగెరె జీపీ అధ్యక్షురాలు ఎస్ రేణుకా సీఎం నారాయణస్వామి తెలిపారు. గురువారం జీపీ సభాంగణంలో నిర్వహించిన ఒకరోజు సదస్సును ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. జీపీ ఉపాధ్యక్షుడు ఎస్‌పీ ఈశ్వర్, జీపీ సభ్యులు పాల్గొన్నారు.

ఐదో రోజున పవమాన హోమం

గంగావతి రూరల్: ఆనెగుంది మేగోటె దుర్గామాత ఆలయంలో అమ్మవారి మూర్తి ప్రాణప్రతిష్ఠాపన వేడుకల్లో భాగంగా ఐదో రోజు గురువారం రాజవంశస్తురాలు లలితారాణి శ్రీ రంగదేవరాయలు, రాజా కృష్ణదేవరాయలు దంపతుల నేతృత్వంలో కల్బుర్గి వేద పాఠశాల పరిమళాచార్య బృందం వారు నవదుర్గా మంత్ర ఉచ్చరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత మానసపుత్ర, దాసోహరత్న బ్రహ్మానందస్వామీజీ ఆధ్వర్యంలో గణపతి హోమం, పవమాన హోమంతో పాటు వివిధ ధార్మిక కార్యక్రమాలు నెరవేర్చారు. వాజేంద్ర ఆచారి, మేనేజర్ రాజన్న స్వామి, ఇంజనీర్ శ్రీధర్, రామణ్ణ, బాలుస్వామి పాల్గొన్నారు.

కొప్పళ జిల్లా ఎస్పీగా యశోద



గంగావతి: కొప్పళ జిల్లా ఎస్పీగా యశోద వంటగోడిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ స్థానంలో విధులు నిర్వహిస్తున్న అరుణాంశుగిరి బదిలీ అయ్యారు. నూతనంగా నియమితురాలైన ఎస్పీ ఇప్పటి వరకు బెళగావిలో లోకాయుక్త ఎస్పీగా విధులు నిర్వహించారు. గంగావతి తహసీల్దార్ యూ.నాగరాజ్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంజునాథ్ హిరేమఠ్‌ను గంగావతి తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

కేఆర్‌పీపీలోకి చేరిక

సాక్షి,బళ్లారి: బళ్లారి మాజీ ఎమ్మెల్యే కే.భాస్కర్ నాయుడు మనవడు, మాజీ ఎమ్మెల్సీ కే.నిరంజన్ నాయుడు తనయుడు విక్రమ్ నాయుడు కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీలో చేరారు. ఆయన బుధవారం రాత్రి బెంగళూరులోని గాలి జనార్దనరెడ్డి స్వగృహంలో కేఆర్‌పీపీ కండువా వేసుకున్నారు. ఈసందర్భంగా పార్టీ వ్యవస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విక్రమ్ నాయుడి చేరిక తమ పార్టీకి మరింత బలం చేకూర్చిందన్నారు. అనంతరం విక్రమ్ నాయుడు మాట్లాడుతూ తాను కేఆర్‌పీపీ చేరడంపై హర్షం వ్యక్తం చేశారు.

రౌడీలకు వార్నింగ్

హుబ్లీ: మరో రెండు నెలల్లో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జంట నగరాల్లోని రౌడీషీటర్లకు పోలీస్ కమిషనర్ రమణగుప్తా గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. వీరందరినీ గురువారం తన కార్యాలయానికి పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. కసబా పోలీస్ స్టేషన్ పరిధిలో 100 మందికి పైగా రౌడీషీటర్లకు పరేడ్‌లో కట్టుదిట్టంగా ఆదేశాలను జారీ చేశారు.

డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బదిలీ



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు అధ్యాపకుల స్వాగతం

గంగావతి రూరల్: నగరంలోని కొల్లి నాగేశ్వరరావు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.బి.హెబసూరు బదిలీ చేస్తూ గురువారం విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం కన్నడ విభాగం సీనియర్ లెక్చరర్ జగదేవి కలశెట్టి ప్రసుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఆమెను కాలేజీ లెక్చరర్లతో పాటు సిబ్బంది వర్గం సన్మానించి పుస్తకంతో స్వాగతం పలికారు. బదిలీ అయిన డా.ఎస్.బి.హెబసూరును విజయనగర(హొసపేటి)లోని ఆనంద్‌సింగ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సేవలందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

కేజీఎఫ్ : ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం ప్రతి అధికారి కర్తవ్యమని తహసీల్దార్ దయానంద తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వచ్చే ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అందరం ఒత్తిళ్లను అధిగమించి న్యాయసమ్మతంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. నోటిఫికేషన్‌కు ముందే బూత్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని బూత్‌ల్లో మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ర్యాంప్‌లను సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల విధులకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో టీపీ ఈఓ మంజునాథ్, నగరసభ కమిషనర్ అంబికా పాల్గొన్నారు.

పీటీసీఎల్‌పై ఆర్డినెన్స్ తేవాలి

మాలూరు : రాష్ట్ర ప్రభుత్వం పీటీసీఎల్ చట్టానికి అడ్డుగా ఉన్న స్టేను ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తెచ్చి దళితులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం తప్పదని కర్ణాటక దళిత సింహసేన రాష్ట్ర అధ్యక్షుడు హూవళ్లి ప్రకాష్ తెలిపారు. గురువారం పట్టణంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ భూ పరభారె నిషేధ చట్టం-1978ని అప్పటి రెవిన్యూ మంత్రి బి.బసవలింగప్ప, ముఖ్యమంత్రి దేవరాజ్ అరసుపై ఒత్తిడి తెచ్చి ఆ చట్టాన్ని 31సీ, 46 కిందికి తీసుకు రావడంతో దళితులకు ఎంతో అనుకూలమైందన్నారు. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ 2017లో అప్పటి ప్రభుత్వం మళ్లీ పీటీసీఎల్ చట్టాన్ని తెచ్చిందన్నారు. దీని వల్ల దళిత రైతులకు అనానుకూలం అవుతోందని, వెంటనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తేవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కర్ణాటక దళిత సింహసేన జిల్లా అధ్యక్షుడు ఎం హనుమాన్, తాలూకా అధ్యక్షుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పన్ను అభియాన్



అభియాన్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు : తాలూకాలోని కేజీహళ్లి జీపీలో చెత్త సేకరణ పన్నుపై అవగాహన కల్గించడం కోసం గురువారం అభియాన్‌ను పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడిన కేజీహళ్లి పంచాయతీ అధికారిణి మంజుల గ్రామంలోని అన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరణకు వారంలో రెండు సార్లు వాహనం తమ ఇంటి ముందుకు వస్తుందని, గ్రామస్తులు చెత్తను వాహనంలోనే వేయాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. పంచాయతీ అధ్యక్షురాలు అరుణమ్మ శ్రీనివాస్, పవిత్ర, కృపా, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్యక్షురాలిగా ఏకగ్రీవం


వహీదాను సన్మానించిన దృశ్యం

తుమకూరు: మధుగిరి తాలూకా కొడిగెనహళ్లి గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షురాలిగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారు వహీదాబాను ముక్తియార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వహీదాబాను మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కేఎన్ రాజణ్ణ గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. తన గెలుపునకు కృషి చేసిన రాజణ్ణ, ఆర్ రాజేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

మైసూరు: విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొడగు జిల్లా విరాజపేట సమీపంలోని కల్లుబాణాలో జరిగింది. కల్లుబాణ గ్రామ నివాసి అరుణ్ అనే వ్యక్తి కుమారుడు ఆదిత్య (19). ఇతడు గోణికొప్పలోని కావేరి కాలేజీలో బీసీఏ మొదటి ఏడాది చదువుతున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. విరాజ్‌పేట నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

బైక్ ఢీకొని పాదచారి మృతి

మైసూరు: బైక్ ఢీకొని పాదచారి మృతి చెందిన ఘటన సరగూరు తాలూకా బి.మటకెరె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన నాగేంద్ర (47) తన స్నేహితులతో కలసి మటకెరె నుంచి మొళెయూరు సర్కిల్ వరకు వాకింగ్ వెళ్లాడు. మటకెరె నుంచి హీరేహళ్లి గ్రామానికి వెళ్తున్న మనోజ్ అనే వ్యక్తి బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నాగేంద్రను 108లో వివేకానంద ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సరగూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

నాణ్యత లేని రోడ్డు పరిశీలన

గౌరిబిదనూరు: నగరంలో రెండేళ్ల క్రితం బిహెచ్ రోడ్డులోని వేసిన తారురోడ్డు పాడైపోవడంతో, తాజాగా రూ. 4.5 కోట్ల వ్యయంతో తారు రోడ్డు వేశారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం కూడా నాణ్యత లేదని బీజేపీ నేతలు కొందరు అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డు నాణ్యతను పరిశీలించారు. నాణ్యత లేనందున ప్రజాపనుల శాఖ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేయడంతో వారు రెండు రోజులలో పనులను పరిశీలించి చర్యలు చేపట్టనున్నట్లు నగరసభ సభ్యుడు, బీజేపీ నగర శాఖ అధ్యక్షుడు మార్కెట్ మోహన్ తెలిపారు. కమిటీలో నగరసభ సభ్యుడు డిజె చంద్రమోహన్, వేణుమాధవ్, కోడీర్లప్ప, ముద్దుకృష్ణ, నారాయణస్వామి వున్నారు.

కళాశాల ఎదుట ఏబీవీపీ ఆందోళన

తుమకూరు: ఫీజులు కట్టలేదని విద్యార్థులను పరీక్ష రాయకుండా అడ్డుకున్న ఓ కళాశాల వైఖరిని వ్యతిరేకిస్తూ ఏబీవీపీ నాయకులు గురువారం ఆందోళన చేశారు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలను నిర్వాహకులు మరో యాజమాన్యానికి అప్పగించారు. ఆ సమయంలో లావాదేవీల్లో గందరగోళం జరిగింది. ఈ క్రమంలో ఆ సమస్యను పరిష్కరించుకోకుండా విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదని ఏబీవీపీ మండిపడింది. తుమకూరు పీయూ శాఖ సబ్ డైరెక్టరేట్‌కు ఈ మేరకు ఏబీవీపీ విజ్ఞప్తి చేసింది.

రాజకీయాలు చేయడానికి రాలేదు


కుట్టు యంత్రాలను వితరణ చేస్తున్న పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: తాను రాజకీయాలు చేయడానికి తాలూకాకు రాలేదని, ప్రజలకు సహాయం చేయడానికి వచ్చానని కెహెచ్‌పీ ఫౌండేషన్ పుట్టస్వామిగౌడ తెలిపారు. బుధవారం సాయంత్రం నదీగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో తమ ఫౌండేషన్ తరపున మహిళలకు కుట్టుయంత్రాల పంపిణీ, కంప్యూటర్‌లో శిక్షణ పొందిన వారికి ప్రమాణ పత్రాలను వితరణ చేసి మాట్లాడారు. తాను నాలుగేళ్లుగా సమాజ సేవలో ఉన్నానని, అందులో భాగంగానే ఇక్కడికి వచ్చానని, వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతామని, ప్రజల ఆశీర్వాదం కావాలన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు రూపా అనంతరాజు, మునిసిపల్ మాజీ అధ్యక్షుడు నరసింహమూర్తి, పద్మావతమ్మ, అబ్దుల్లా, లక్ష్మణరావ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ఒకరు అరెస్ట్

బనశంకరి: మసాజ్ పార్లర్ యువతిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో గురువారం జయనగర పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. నిందితుడిని రవీంద్రశెట్టిగా పోలీసులు గుర్తించారు. జయనగరలో రత్నావతి, జగదీశ్‌కు చెందిన పార్లర్‌లో ఈనెల 14న యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జయనగర పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్ట్ చేశామని డీసీపీ కృష్ణకాంత్ తెలిపారు.

బడుగుజీవుల పైకి దూసుకొచ్చిన బస్సు

- ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఐదుగురు మృతి
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- క్రిష్ణగిరి జిల్లాలో విషాద ఘటన


ప్రమాదానికి గురైన ట్రాక్టర్, చెల్లాచెదురైన సామగ్రి



ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న బస్సు

క్రిష్ణగిరి: పేదరికం పీడిస్తోంది, సొంతూర్లో పనులు లేవు. పొరుగూరికి వెళ్లి ఉపాధి వెతుక్కుందామని బయల్దేరిన బడుగుజీవులపైకి మృత్యు శకటంలా బస్సు దూసుకొచ్చింది. జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలో ట్రాక్టర్‌ను ప్రైవేటు బస్సు ఢీకొన్న ప్రమాదంలో మూడు నెలల చిన్నారితో పాటు ఐదుగురు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో 7 మందికి తీవ్ర గాయాలు తగిలాయి.

కూలీ పనుల కోసం బయల్దేరగా

వివరాల మేరకు ధర్మపురి జిల్లా సొళూరు గ్రామానికి చెందిన 12 మంది కలిసి గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లోని వి.కోట వద్ద కూలీ పనుల కోసం ట్రాక్టర్‌లో బయల్దేరారు. క్రిష్ణగిరి- ధర్మపురి జాతీయ రహదారి కావేరిపట్టణం సమీపంలోని ఎర్రాండహళ్లి వద్ద ఎదురుగా వచ్చిన ఆమ్నీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ధాటికి ట్రాక్టర్ పల్టీలు కొట్టింది, అందులో ప్రయాణిస్తున్న మునుస్వామి (50), ముత్తు (20), వాసంతి (45), మల్లి (60), మూడు నెలల చిన్నారి వర్షిణి ఘటనా స్థలంలోనే తీవ్ర గాయాలతో మృతి చెందారు. పుష్ప, కాశి, అరుళ్, కావ్య, మురుగన్, దినేష్, సెల్లమ్మలకు తీవ్ర గాయాలు తగిలాయి. ట్రాక్టర్, అందులోని బియ్యం, వంటపాత్రలు తదితర సామగ్రి రోడ్డుపై చెల్లాచెదరుగా పడిపోయాయి. బాధితుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం విషాదమయంగా మారింది.

బస్ డ్రైవర్ అరెస్టు

విషయం తెలుసుకొన్న కావేరిపట్టణం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడినవారిని క్రిష్ణగిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ దీపక్‌జేకబ్, డీఎస్పీ రమిళరసి, పోలీసులు ఘటనా స్థలానికెళ్లి పరిశీలించారు. ఈ ఘటన కావేరిపట్టణం ప్రాంతంలో తీవ్ర సంచలనం సృష్టించింది. బంధుమిత్రుల రోదనలతో ఆస్పత్రులు శోకసంద్రంగా మారాయి. బస్ డ్రైవర్ కరుప్పుస్వామి (50) ని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు.

అభివృద్ధిపై పుస్తకం విడుదల



కృష్ణరాజపురం: బెంగళూరు మహదేవపుర విధాన సభ పరిధిలో ఎమ్మెల్యే అరవింద లింబావళి నియోజకవర్గం అభివృద్ధిపై జరిగిన పుస్తకాన్ని సీఎం బసవరాజు బొమ్మై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరవింద లింబావళి, మనోహర రెడ్డి, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఢీకొన్న బొలెరో

మడకశిర రూరల్: అగళి మండలం నుంచి హిందుపురం మార్కెట్‌కు చింత పండు తీసుకువెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి గురువారం ఉదయం మడకశిర మండలం యూ రంగాపురం వద్ద చెట్టుకు ఢీకొంది. వాహనం డ్రైవర్, రైతులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మరొక వాహనంలో చింత పండును మార్కెట్‌కు తరలించారు. వాహనం మరికొంత ముందుకు వెళ్లి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదన్నారు.

ఆలయాల్లో భవాని ప్రత్యేక పూజలు



యశవంతపుర: హాసన జేడీఎస్ రాజకీయాలకు తెర పడనుంది. జేడీఎస్ నాయకురాలు భవాని రేవణ్ణకు సీటు దక్కే అవకాశాలు కనపడుతున్నాయి. గురువారం ఆమె హొళెనరసీపుర పట్టణంలోని లక్ష్మీరంగనాథస్వామి, మావినకెరె కొండతో పాటు 9 దేవస్థానాలలో భర్త రేవణ్ణతో కలిసి పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులతో కలిసి హాసనలో రోడ్డు షో నిర్వహించారు. వీటి మధ్య ఇటీవల ఆమె కమలాకర్ అనే జ్యోతిషుడిని కలిశారు. హాసనలో భవానినీ ఓడించే అభ్యర్థి లేరని చెప్పటంతో ఆమెకు రాజకీయంతో పాటు హంస మాళవిక యోగం ఉన్నట్లు చెప్పటంతో ఆమె హాసనలో పోటీ చేసి తీరుతానంటూ పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. తనే గెలుస్తానంటూ చెప్పుకుంటున్నారు. ఏమి చేస్తావో తెలియదు టికెట్ తీసుకొచ్చే బాధ్యత తను భర్త రేవణ్ణపై వేశారు.

సమ సమాజానికి కృషి


పద్మశ్రీ మునివెంకటప్పను సత్కరిస్తు దృశ్యం

చిక్కబళ్లాపురం: సమాజంలోని మూఢ నమ్మకాలను తొలగించి సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడినవారు కాయక శరణులు అని కన్నడ ఉపన్యాసకులు డాక్టర్ ఎం మాల్తేశ్ పూజార్ అన్నారు. గురువారం అంబేడ్కర్ భవనంలో జిల్లా పాలకమండలి ఏర్పాటు చేసిన కాయకశరణుల జయంతి వేడుకలో వారి చిత్రపటానికి పుష్పమాల వేసి మాట్లాడారు. సమాజంలోని అన్ని కులాలు, మతాలు ఒక్కటే అని చాటి చెప్పిన వారు కాయకశరణులు అన్నారు. పద్మశ్రీ గ్రహీత నాడోజ మునివెంకటప్పను ఘనంగా సత్కరించారు. గ్రేడ్ 2 తహసీల్దార్ తుళసి, కన్నడ ఉపన్యాసకులు చంద్రశేఖర్, సుధా వెంకటేశ్, మంజు శ్రీనివాస్ ఇతరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

యశవంతపుర: చిరునామా అడిగే నెపంతో వృద్ధుడిని హత్య చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... వారం రోజుల క్రితం బెంగళూరు సుకందకట్ట సమీపంలోని విఘ్నేశ్వర నగరలో శివణ్ణ అనే వృద్ధుడిని కృష్ణ, నిరంజన్ అనే వ్యక్తులు బైక్‌పై వస్తూ అడ్రస్ అడిగే నెపంతో హత్య చేసి అతని వద్ద ఉన్న వెయ్యి రూపాయలు తీసుకుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను గాలించి అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు బైకులు, నగదును స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఔను.. నాన్‌వెజ్ తిని గుడికి వెళ్లా

యశవంతపుర: మాంసాహారం తిని ఆలయానికి వెళ్లింది నిజమేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి తెలిపారు. ఆయన గురువారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ తను దేవస్థానంలో గర్భగుడికి వెళ్లలేదని అన్నారు. గుడి నిర్మాణాన్ని ఇతర వర్గీయులు అడ్డుకున్నారు. ఈ విషయం తనకు స్థానికులు చెప్పి తీసుకెళ్లడంతో వెళ్లా, మాంసాహారం తిన్న సంగతి మరచిపోయాను అని అన్నారు. దీనికి కాంగ్రెస్ నాయకులు ఏమి చేస్తారని అన్నారు.

సీటీ.రవిపై సిద్ధు ఆగ్రహం

శివాజీనగర: మాంసం తిని దేవాలయానికి వచ్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి సిటీ రవిపై ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య తన ట్వీటర్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాంసం తినటం, తినకపోవటం, దేవాలయాలకు వెళ్లటం, వెళ్లకపోవటం వారివారి వ్యక్తిగత విషయం. ఇది రాజకీయ చర్చ కారాదు. రాజకీయ నాయకులు ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలి. ఇతరుల దూషణలో నిమగ్నమైన సీ.టీ.రవికి దేవుడు మంచి బుద్ధి ఇవ్వాలని కోరుకున్నారు.

దుష్ప్రచారం చేసిందే బీజేపీ:

మాంసం తిని దేవాలయానికి వెళ్లిన వీడియో ప్రపంచమంతటికి తెలిసినా కూడా తాను తిన్నది నిజమే. దేవాలయం లోపలికి వెళ్లలేదు. రోడ్డులోనే నిల్చుకొని చేతులు జోడించానని సీ.టీ.రవి వాదన కాగా, ఎప్పుడు పచ్చి అబద్ధాలు చెప్పటం పుట్టుకతో వచ్చినట్లుగా ఉంది. తాను చేపలు తిని దేవాలయానికి వెళ్లారనే తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి తనను హిందూ వ్యతిరేకిగా బీజేపీ నాయకులు ప్రచారం చేశారని మండిపడ్డారు.

10 మంది జీపీ సభ్యుల రాజీనామా


రాజీనామాలను సమర్పిస్తున్న దృశ్యం

యశవంతపుర: అధికారుల ప్రవర్తన సరిగా లేదంటూ ఒకే గ్రామ పంచాయతీకి చెందిన 10 మంది సభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేశారు. చిక్కమగళూరు జిల్లా కొప్ప తాలూకా గుడ్డతోటి గ్రామ పంచాయతీకి చెందిన 10 మంది తమ రాజీనామా లేఖలను అధికారులకు సమర్పించారు. రోడ్డు విస్తరణ, లేఔట్ల నిర్మాణానికి అధికారులు సహకరించటంలేదని సభ్యులు ఆరోపించారు. వరదల్లో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు తదితర విషయంపై అనేక సార్లు అధికారుల దృష్టికి తెచ్చిన ప్రయోజనం లేదన్నారు. దీంతో రాజీనామాలు చేసి పంచాయతీ అభివృద్ధి అధికారికి అందించినట్లు తెలిపారు.

అన్నాడీఎంకేలో యడపాడి వర్గం సంబరాలు


సంబరాలు జరుపుకొంటున్న అన్నాడీఎంకే నాయకులు

హోసూరు: అన్నా డీఎంకే పార్టీ ప్రధాన కార్యదర్శి వివాదంపై చెన్నై హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం తీర్పు వెలువడింది. మాజీ ముఖ్యమంత్రి యడపాడి పళనీస్వామికి అనుకూలంగా తీర్పు రావడంతో హోసూరులో అన్నాడీఎంకే పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. అన్నాడీఎంకే పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవి కోసం యడపాడి పళనీస్వామి, ఓ.పన్నీర్‌సెల్వంలు కోర్టులో కేసులు దాఖలు చేశారు. ఈ కేసును విచారణ జరిపిన కోర్టు యడపాడి పళనీస్వామికి అనుకూలంగా తీర్పునివ్వడంతో హోసూరులోని అన్నాడీఎంకే పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం రాయకోట రోడ్డు కూడలిలోని అన్నావిగ్రహానికి పూలమాలలు వేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి జేపీ. జయప్రకాష్ అధ్యక్షత వహించారు, కార్పొరేటర్ పాల నారాయణన్, చిట్టి జగదీష్, కుబేరన్, వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు. డెంకణీకోట పాత బస్టాండు వద్ద పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు నాగేష్ అధ్యక్షతన సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లసంద్రం పంచాయతీ మాజీ అధ్యక్షుడు వెంకటాచలపతిశెట్టి, సంపంగిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కెలమంగలం, సూళగిరి, అంచెట్టి ప్రాంతాల్లో అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

మైసూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను తల్లిని చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా తొండవాడి గ్రామంలో జరిగింది. గ్రామనికి చెందిన మహదేవస్వామి (26)ని అరెస్టు చేశారు. ఇతడు పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించి ఆమెతో శారీరక సంబంధం పెట్టుకుని గర్భిణి చేశారు.

మైసూరు ప్రైవేటు ఆస్పత్రిలో బాలిక శిశువుకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలిసిన సీడీపీవో బేగూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు దాఖలు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

హోసూరు వార్తలు..

చెప్పకుండా భర్త తీర్థయాత్ర

- అలిగి భార్య, అత్త ఆత్మహత్య

హోసూరు: భర్త తమకు చెప్పకుండా తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లాడని ఆవేదన చెందిన అతని భార్య, అత్త ఆత్మహత్య చేసుకొన్న ఘటన హోసూరు సమీపంలో వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని ఎస్‌బీఎం కాలనీలో వెంకటేశప్ప, భార్య సుశీలమ్మ (38), ఆమె తల్లి సుశీలమ్మ ఉంటున్నారు. ఐదర రోజుల క్రితం వెంకటేశప్ప ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల విచారించగా తిరుమల వెంకన్న స్వామి ఆలయానికెళ్లినట్లు తెలిసింది. ఆలయానికెళ్లిన విషయం తమతో చెప్పలేదని విరక్తి చెందిన సుశీలమ్మ తల్లితో పాటు పట్టణంలోని శివకుమార్‌నగర్ వద్ద రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాలను స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

గొంతు కోసి కార్పెంటర్ హత్య

శివాజీనగర: ఓ కార్పొంటర్‌ను గుర్తు తెలియని దుండగులు గొంతు కోసం అతి దారుణంగా హతమార్చిన ఘటన బుధవారం రాత్రి జ్ఞానభారతి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగనహళ్లి వద్ద జరిగినది. హతుడిని దినేశ్‌గా గుర్తించారు. దినేశ్ నైస్ రోడ్డు సమీపంలోని మంగనహళ్లిలో కుటుంబంతో ఉంటున్నాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ జీవనం చేస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా దుండగులు మారణాయుధాలతో గొంతు కోసి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు.

జల్లికట్టు ఎద్దు దాడిలో వ్యాపారి మృతి


మృతి చెందిన మంజునాథ్ (ఫైల్)

హోసూరు: హోసూరు తాలూకా తిమ్మసంద్రం గ్రామంలో జల్లికట్టును తిలకించేందుకు వచ్చిన వ్యాపారిపై ఎద్దు దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. వివరాలు... తిప్పసంద్రం గ్రామం వద్ద గ్రామదేవత సప్లమ్మ ఆలయ పశువుల జాతర 20 రోజుల క్రితం జరిగింది. జాతర ఆఖరి రోజు జల్లికట్టు నిర్వహించేందుకు ఆలయ కమిటీ చర్యలు చేపట్టినా ప్రభుత్వం అనుమతించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం జల్లికట్టు నిర్వహణకు అనుమతిచ్చింది. ఈ జల్లికట్టులో హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 400కు పైగా వృషభాలను పరుగెత్తించారు. ఓ ఎద్దు బ్యారికేడ్లపై దూసుకొని వచ్చి ప్రజలపై పడింది. ఈ సమయంలో సూళగిరి సమీపంలోని ఆరుపల్లి గ్రామానికి చెందిన కొబ్బరిబోండా వ్యాపారి మంజునాథ్ (26)ను గాయపరిచింది. తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌ను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పురుగుమందుల వాడకంపై శిక్షణ

హోసూరు: సూళగిరి తాలూకా అత్తిముగం గ్రామంలో నిర్వహిస్తున్న అదియమ్మాన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులచే హోసూరు సమీపంలోని లింగాపురం గ్రామంలో శిలీంద్ర నాశకాలు, పురుగులమందుల వాడకంపై రైతులకు శిక్షణ అందజేశారు. హోసూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొని మెళకువలను వివరించారు. పిచికారి చేయడంలో పాటించవలసిన జాగ్రత్తలు, పురుగుల మందుల వల్ల ఏర్పడే ప్రమాదాలు, పంట పెరుగుదల, మానవ ఆరోగ్యంపై వివరించారు. పంచాయతీ అధ్యక్షులు, గ్రామాధికారి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వెంకటాపురంలో పశువుల పండుగ



కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం పశువుల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. సంక్రాంతి పండుగ తరువాత వేడుక నిర్వహించడం ఆనవాయితీ. పశువులను శుభ్రంగా కడిగి ప్రత్యేకంగా అలంకరించి గ్రామదేవత ఆలయం వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో ప్రత్యేక వంటకాలు చేసుకుని ఆరగించారు.

వెలుగు జిలుగులతో ఎయిర్‌పోర్టు


శివమొగ్గ విమానాశ్రయం

శివమొగ్గ: శివమొగ్గ నూతన విమానాశ్రయం వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 27న విమానాశ్రయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఎంపీ బీవై రాఘవేంద్ర తన సోషల్ మీడియాలో విమానాశ్రయ కొత్త వీడియోను షేర్ చేశారు. డ్రోన్ కెమెరా ద్వారా తీసిన విమానాశ్రయ టెర్మినల్ వీడియో ప్రస్తుతం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. రాత్రి వేళలలో విద్యుత్ దీప కాంతులతో విమానాశ్రయం వెలిగిపోతోంది.

శివమొగ్గకు రెండో విమానం

శివమొగ్గ: శివమొగ్గ కొత్త విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో వైమానిక దళానికి చెందిన రెండో విమానం సురక్షితంగా ల్యాండైంది. ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమం ఉండటంతో ఆయన భద్రత సిబ్బంది, నాలుగు కార్లు, ఇతరత్రా సిబ్బంది క్రమంగా శివమొగ్గకు చేరుకుంటున్నారు. మంగళవారం వైమానిక మొదటి విమానం ల్యాండ్ కాగా, తాజాగా క్యారియర్ సేవలు అందించే విమానం ల్యాండ్ అయింది. ఢిల్లీ నుంచి గురువారం మధ్యాహ్నం శివమొగ్గకు చేరుకుంది. ప్రధాని కార్యక్రమం కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.


విమానాశ్రయంలో ఏటీసీ టవర్



ఎయిర్‌పోర్టులో దిగిన ఎయిర్‌ఫోర్స్ విమానం

రమణీయం.... సిద్దేశ్వరుడి రథోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన హేమావతి గ్రామం


అలంకరణలో సిద్దేశ్వరస్వామి,


రథోత్సవంలో అశేష భక్తజనం

హేమావతి (అమరాపురం): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో హెంజేరు శ్రీసిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రథంపై అధిష్ఠించారు. అశేషభక్తజన సమూహం మధ్య ఓం నమః శివాయా... సిద్దేశ్వర స్వామి మహారాజ్‌కీ జై, శివ.. శివహర శంభో శంకర అన్న శివనామ స్మరణలతో భక్తులు రథోత్సవాన్ని ముందుకు లాగారు. ఈ సందర్భంగా అరటిపండు, బెల్లం, కొబ్బరికాయ, పూలు, మిరియాలు తదితర వాటిని భక్తులు రథంపైకి విసిరి తమ మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక నుంచి వచ్చిన వీరగాసే కళాకారుల నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. బెంగళూరు, మైసూరు, శిర, తుమకూరు, చెళ్లకెర, హిరియూర్, పావగడ, చిత్రదుర్గం, దావణగెర తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా...

నేడు మార్చి నెల శ్రీవారి దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను శుక్రవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్లు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. మార్చి నెలకు సంబంధించిన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ వర్చువల్ సేవా టికెట్ల కోటాను, సంబంధిత దర్శన టికెట్ల కోటాను సాయంత్రం నాలుగు గంటలకు విడుదల చేస్తారు. కాగా, తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 62,101 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.37 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి ఎనిమిది గంటల్లో దర్శనం లభిస్తోంది.

నా వాంగ్మూలాన్ని సీబీఐ వక్రీకరించింది

- పులివెందుల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శశికళ
- నేను చెప్పని విషయాలను వాంగ్మూలంగా నమోదు చేసింది
- వివేకా గుండెపోటుతో చనిపోయారని ఎంపీ అవినాష్ నాతో చెప్పలేదు
- రాజకీయ దురుద్దేశాలతోనే ఈనాడు, ఆంధ్రజ్యోతి దుష్ప్రచారం



పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించినట్లు ఎంపీ అవినాష్‌రెడ్డిగానీ మరెవరూ గానీ తనతో చెప్పలేదని పులివెందుల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శశికళ స్పష్టం చేశారు. తాను చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడాన్ని ఆమె ఖండించారు. కనీసం తనతో సంప్రదించకుండా ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తన పేరును ఉటంకిస్తూ అవాస్తవాలను ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండించారు. పులివెందులలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వివేకానందరెడ్డి చనిపోయిన రోజు ఉదయం తమ స్థలాలకు సంబంధించిన విషయంపై కలిసేందుకు వెళ్లిన మాట వాస్తవమన్నారు. అక్కడ కొంత మంది పనివాళ్లు ఉన్నారని, వివేకానందరెడ్డిని కలవాలని సమాచారం ఇవ్వగా సమాధానం చెప్పలేదన్నారు. దాంతో కాసేపు వేచి చూశానన్నారు. కొద్దిసేపటికి కొన్ని కార్లు వచ్చాయని తెలిపారు. 'అందులో నుంచి వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీకి చెందిన మరికొంతమంది అనుచరులు ఇంటి లోపలికి వెళ్లారు. ఐదు నిమిషాల్లోనే అవినాష్‌రెడ్డి బయటకు వచ్చి ఆందోళనగా వివేకా ఇంటి లాన్‌లో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడ గుమికూడిన వారు వివేకా సార్ చనిపోయారని మాట్లాడుకోవడం విన్నా. వెంటనే లోపలికి వెళ్లి చూడగా వివేకానందరెడ్డి చనిపోయి కనిపించారు. అక్కడ అంతా రకరకాలుగా మాట్లాడుకోవడం కనిపించింది. కొందరు గుండె నొప్పి అని, మరికొందరు రక్తపు వాంతులతో చనిపోయారని చర్చించుకున్నారు. అనంతరం బాధ తట్టుకోలేక ఇంటికి వెళ్లిపోయా. అంతేకానీ వివేకా ఇంటి వద్ద అవినాష్‌రెడ్డి నాతో మాట్లాడలేదు. నేను కూడా ఆయనతో ఏమీ మాట్లాడలేదు. సిట్, సీబీఐ అధికారులు విచారణకు పిలిచినప్పుడు కూడా ఇదే విషయాన్ని చెప్పా' అని శశికళ పేర్కొన్నారు. గత ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డేనని తనతో సహా జిల్లాలో అందరికి తెలుసన్నారు. వైఎస్ వివేకాను పని విషయమై కలవడానికి వెళ్లినప్పుడు కూడా ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి అఖండ మెజార్టీతో గెలిచేలా మీరంతా కృషి చేయాలని తమతో చెప్పేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక చంద్రబాబు నాయుడు, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ నీచమైన రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్ వివేకా ఉంటే అవినాష్‌రెడ్డికి ప్రయోజనమే కానీ ఎలాంటి నష్టం లేదన్నారు. బాలకృష్ణ ఇంట్లో బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు ఎందుకు జరిగాయి? దాని వెనుక రహస్యాల గురించి ఈనాడు, ఆంధ్రజ్యోతి, చంద్రబాబు మాట్లాడితే బాగుంటుందన్నారు.

వివాహితపై 'కందికుంట' అనుచరుడి అత్యాచారయత్నం

తలుపుల : శ్రీసత్యసాయి జిల్లా కదిరి టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ అనుచరుల ఆగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయి. కందికుంట అనుచరుడు కె.హరి.. తలుపుల మండలం కుర్లి గ్రామంలో ఓ వివాహితపై గతంలో అత్యాచారయత్నం చేశాడు. అప్పుడే గ్రామ పెద్దలు అతడిని మందలించి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా పద్ధతి మార్చుకోని హరి.. తాజాగా బుధవారం సదరు మహిళపై మరోసారి అత్యాచారయత్నం చేశాడు. గ్రామస్తులంతా ఏకం కాగా అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకుని గ్రామానికి వెళ్లిన పోలీసులతో మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. హరి ఆగడాలు భరించలేకుండా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, తన అనుచరుడు అత్యాచారయత్నం చేసినా కందికుంట వెంకటప్రసాద్ అతనికే మద్దతుగా నిలిచాడు. గ్రామస్తులే హరిపై దాడి చేసినట్టు సీన్ క్రియేట్ చేసి అతడిని ఆస్పత్రిలో చేర్పించాడు. అనంతరం పరామర్శ పేరుతో పెద్ద డ్రామా నడిపాడు. బుధవారం రాత్రి ఆస్పత్రి వద్ద నుంచి నేరుగా కదిరి రూరల్ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన కందికుంట.. తన అనుచరుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ ధర్నాకు దిగాడు.

వెరీ 'గుడ్డు'..

దేశంలోని టాప్-5 రాష్ట్రాల ఉత్పత్తిలో ఏపీదే అగ్రస్థానం

మాంసం ఉత్పత్తిలో రాష్ట్రానిది నాల్గో స్థానం.. పాల ఉత్పత్తిలో ఐదో స్థానం

వ్యవసాయ రంగంలో 'పశుసంవర్థక' వాటా భారీగా పెరుగుదల

1950–51లో 17.95 శాతం ఉంటే 2020–21 నాటికి 30.13%

దేశంలో పశు సంవర్థకరంగం ఉత్పత్తిపై నాబార్డు నివేదిక



సాక్షి, అమరావతి: పశుసంవర్థక రంగంలోని పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిలో ఐదు రాష్ట్రాలు మంచి ఫలితాలు కనబరిచాయని నాబార్డు నివేదిక వెల్లడించింది. ఇవి కోవిడ్ సంక్షోభంలో ఈ ఘనత సాధించాయని తెలిపింది. గుడ్ల ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని పేర్కొంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పశుసంవర్థక రంగం ఉత్పత్తుల వృద్ధిపై నాబార్డు తన అధ్యయన నివేదికను విడుదల చేసింది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఈ ఐదు రాష్ట్రాలు గుడ్ల ఉత్పత్తిలో 64.77 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో తమిళనాడు, మూడో స్థానంలో తెలంగాణ, నాల్గో స్థానంలో పశ్చిమ బెంగాల్, ఐదో స్థానంలో కర్ణాటక నిలిచాయి. ఏపీ ప్రభుత్వం కోవిడ్ సమయంలో పశు సంవర్థక, వ్యవసాయ కార్యకలాపాలు నిలిచిపోకుండా అవసరమైన చర్యలను తీసుకోవడంవల్లే ఈ ఘటన సాధించింది. అలాగే..

- మాంసం ఉత్పత్తి విషయానికొస్తే.. టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నాల్గో స్థానంలో ఉంది.
- పాల ఉత్పత్తిలో ఏపీ ఐదో స్థానంలో నిలిచింది. 2020–21లో ఏపీ సహా ఐదు రాష్ట్రాలు 52.70 శాతం వాటా కలిగి ఉన్నాయి.
- అలాగే, మాంసం ఉత్పత్తిలో ఈ ఐదు రాష్ట్రాలు 57 శాతం వాటా కలిగి ఉన్నాయి.
- దేశంలో పశువుల జనాభా 1951లో 155.3 మిలియన్లు ఉండగా 2019 నాటికి 193.46 మిలియన్లకు పెరిగింది.

పశు సంవర్థక రంగం వాటా పెరుగుదల

మరోవైపు.. వ్యవసాయ రంగంలో పశుసంవర్థక రంగం వాటా దేశంలో భారీగా పెరిగినట్లు నివేదిక తెలిపింది. 1950–51లో వ్యవసాయ రంగం స్థూల విలువల జోడింపులో పశు సంవర్థక రంగం వాటా 17.95 శాతం ఉండగా 2020–21 నాటికి అది 30.13 శాతానికి పెరిగింది. వ్యవసాయ రంగం స్థిరత్వానికి పశువుల రంగం చాలా ముఖ్యమైనదిగా నివేదిక స్పష్టంచేసింది. గ్రామీణ ఆదాయ వృద్ధికి పశుపోషణ ప్రధాన చోదకశక్తి అని నివేదిక వ్యాఖ్యానించింది. అలాగే, రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు పశుసంవర్థక రంగంలో అధిక ప్రభుత్వ పెట్టుబడులు అవసరమని సూచించింది. పాలు, పాల ఉత్పత్తుల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని నివేదిక పేర్కొంది. ఇటీవల కాలంలో శాస్త్రీయ, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా దేశంలో పశువుల ఉత్పత్తిని పెంచినట్లు నివేదిక పేర్కొంది.

	రాష్ట్రం	ఉత్పత్తి (రూ.కోట్లలో)	దేశంలో వాటా (శాతం)
2020-21లో గుడ్లు ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాల వాటా ఇలా.. (ఉత్పత్తి రూ.కోట్లలో)	ఆంధ్రప్రదేశ్	2496.39	20.45
	తమిళనాడు	2012.08	16.49
	తెలంగాణ	1584.70	12.98
	పశ్చిమ బెంగాల్	1050.08	8.60
	కర్ణాటక	761.99	6.24
2020-21లో మాంసం ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాల వాటా ఇలా..	మహారాష్ట్ర	11,09,000	12.60
	ఉత్తరప్రదేశ్	10,38,000	11.79
	పశ్చిమ బెంగాల్	9,94,000	11.30
	ఆంధ్రప్రదేశ్	9,54,000	10.84
	తెలంగాణ	9,20,000	10.46
2020-21లో పాల ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాల వాటా ఇలా..	ఉత్తరప్రదేశ్	3,13,59,000	14.94
	రాజస్థాన్	3,07,23,000	14.63
	మధ్యప్రదేశ్	1,79,99,000	8.57
	గుజరాత్	1,58,53,000	7.55
	ఆంధ్రప్రదేశ్	1,47,14,000	7.01

కల్పిత కథనాలు.. వక్రీకరణలు

ఎల్లో మీడియాపై కడప నగర మేయర్ సురేష్ బాబు మండిపాటు



కడప కార్పొరేషన్ : కల్పిత కథనాలతో ఎల్లో మీడియా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, వైఎస్సార్‌సీపీని అభిమానించే వారి మనోభావాలను దెబ్బ తీస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్‌బాబు అన్నారు. కడపలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు వాస్తవాలను వక్రీకరించి కథనాలు వండి వారుస్తున్నాయన్నారు. 2011లో వైఎస్ విజయమ్మపై వివేకానందరెడ్డి పోటీ చేసినా, వైఎస్ జగన్ మాత్రం ఆయన్ను పరాయి వ్యక్తిలా భావించలేదన్నారు. తన బాబాయ్ చేదోడు, వాదోడుగా ఉంటాడని భావించి పార్టీలో చేర్చుకున్నారని చెప్పారు. సురేష్ ఇంకా ఏమన్నారంటే..

- 2018లో పార్టీ ముఖ్య నాయకులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వైఎస్ వివేకానందరెడ్డి అయితేనే బాగుంటుందని ప్రతిపాదించారు. ఇందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కూడా మద్దతు ప్రకటించారు. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ సర్వశక్తులు ఒడ్డి ఆయన్ను ఓడించింది.
- 2018 నవంబర్‌లో ప్రత్యేక హోదా కోసం రాజీనామా చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలకు 2019లో మళ్లీ ఎంపీ టికెట్లు ఇవ్వాలని వైఎస్ జగన్ అప్పుడే నిర్ణయించారు. మరణానికి ముందు రోజు కూడా చాపాడులో వైఎస్ అవినాష్‌రెడ్డి, రఘురామిరెడ్డితో కలిసి వారి గెలుపు కోసం వివేకానందరెడ్డి ప్రచారం నిర్వహించారు.
- ఇలాంటప్పుడు టికెట్ ఆశించినందువల్లే వైఎస్ వివేకాను హత్య చేశారని సీబీఐ చెప్పడం దారుణం. వివేకా హత్యా నేరాన్ని వైఎస్ కుటుంబీకులపై మోపేందుకు, ఆ కుటుంబంలో చిచ్చు పెట్టేందుకు ఒక పథకం ప్రకారం కుట్ర జరుగుతోంది. సీబీఐ సరైన రీతిలో దర్యాప్తు చేసి నిజమైన దోషులను శిక్షించాలి. ఈ సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు రామలక్ష్మణ్‌రెడ్డి, ఆర్.చెన్నయ్య, నాయకులు బి.నాగయ్య, రమణ, షఫీ, ఎస్.సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నాం



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి బయటకు వస్తున్నట్లుగా ప్రకటిస్తున్న రెవెన్యూ జేఏసీ నేతలు

- ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు దివాకర్

సాక్షి, అమరావతి : జాయింట్ యాక్షన్ కమిటీలో ఉన్న సంఘాల సమష్టి నిర్ణయం మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ తప్పుకుంటోందని ఆ కమిటీ చైర్మన్ వీఎస్ దివాకర్ స్పష్టం చేశారు. ఇక నుంచి తమకు ఆ సంఘంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చర్యల వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, ఉద్యోగులందరూ ఆ సంఘానికి దూరంగా ఉండాలని సూచించారు. గురువారం ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం తాడేపల్లిలో నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

చర్చలే మార్గం

- ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. హక్కులను ప్రజాస్వామ్యయుత పోరాటాల ద్వారా సాధించుకోవాలి. అలా కాకుండా ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతినేలా, రాజకీయ ప్రయోజనాల కోసం పని చేయడం సరికాదు.
- ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై పబ్లిసిటీ కోసం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరం. ఈ ఘటన వల్ల ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయి.
- ఉద్యోగుల సమస్యలను పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తుందన్న ఆకాంక్షతోనే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో మేము భాగస్వాములమయ్యాం. కానీ ఆ సంఘ నేతలు అప్రజాస్వామికంగా, తమ స్వార్థపర రాజకీయాల కోసం పని చేస్తున్నారు.
- ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న 4 వేల మంది ఆర్ఏలను వీఆర్వోలుగా, వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించింది. ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా 66 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించింది. ఇదే రీతిలో అన్ని తరగతుల రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించింది. ఇలాగే మిగిలిన సమస్యలను పరిష్కరించుకోవాలి.
- ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల రాష్ట్ర నేతలు జి.ధైర్య, పి.జోసెఫ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న చంద్రబాబు

- ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే దాడులు
- హోంమంత్రి తానేటి వనిత
- గన్నవరం అల్లర్లలో గాయపడిన సీఐ కనకారావుకు పరామర్శ




ఆస్పత్రిలో సీఐ కనకారావును పరామర్శిస్తున్న హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే విష్ణు

పెనమలూరు: స్వార్థ రాజకీయాల కోసం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే దాడులు చేయిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 20న కృష్ణా జిల్లా గన్నవరంలో టీడీపీ గూండాల దాడిలో గాయపడి పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఐ కనకారావును హోం మంత్రి గురువారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో, వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గన్నవరంలో విధి నిర్వహణలో ఉన్న సీఐ కనకారావుపై రాయితో, లేడీ కానిస్టేబుల్‌పై కర్రతో టీడీపీ గూండాలు దాడి చేశారని చెప్పారు. ఈ ఘటనకు చంద్రబాబుదే బాధ్యత అని అన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో, ఆయన సీఎంగా ఉన్న సమయంలో పోలీసులే ఆయనకు సేవలందించారని, నేడు అదే పోలీసు యంత్రాంగాన్ని కించపరిచేలా మాట్లాడటం, దాడులు చేయించడం దారుణమని విమర్శించారు. దాడికి బాధ్యుడైన పట్టాభిని పరామర్శించిన చంద్రబాబు టీడీపీ గూండాల దాడిలో గాయపడిన సీఐ, కానిస్టేబుల్‌ను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. అనపర్తిలో కూడా చంద్రబాబు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే సమావేశం పెట్టి ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేశారన్నారు. చంద్రబాబు, లోకేశ్ పబ్లిసిటీ పిచ్చితో గొడవలు సృష్టిస్తున్నారని మండి పడ్డారు. ఇక మీదట పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ

సభకు అనుమతిలేదన్న సీఐని బెదిరించిన లోకేశ్



రేణిగుంట: పోలీసుల తీరుపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ వేయిస్తామని తెలుగుదేశం నాయకుడు లోకేశ్ చెప్పారు. ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర గురువారం తిరుపతి జిల్లా రేణిగుంట మండలం జీపాళెంలో ప్రారంభమై తిరుపతికి చేరుకుంది. గాజులమండ్యం ఎస్సీ కాలనీ సమీపంలో లోకేశ్ బహిరంగసభను తలపించేలా స్టూల్ వేసుకుని మాట్లాడేందుకు ప్రయత్నించారు. బహిరంగసభలకు అనుమతి లేదని గాజులమండ్యం సీఐ ఆరోహణరావు చెప్పారు. దీంతో ఆయనపై లోకేశ్ చిందులు వేశారు. పోలీసుల తీరుపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ వేయిస్తామని హెచ్చరించారు. అనంతరం రేణిగుంట చెక్‌పోస్ట్ సమీపంలో లోకేశ్ యాదవసంఘ నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే యాదవులకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. గతంలో కూడా యాదవ సామాజికవర్గానికి రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అంతకుముందు గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గంలో పాదయాత్రకు అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

మరింత సులభంగా ఎగుమతులు

- రాష్ట్ర ప్రభుత్వ కృషితో కేంద్రం ఎఫ్ఐఈవో రాష్ట్ర చాప్టర్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: దేశ ఎగుమతుల్లో 10 శాతం వాటా సాధించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఎగుమతుల్లో కీలకపాత్ర పోషించే కేంద్ర వాణిజ్యశాఖకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈవో) రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించింది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌కే పరిమితమైన ఎఫ్ఐఈవో ఏపీ చాప్టర్‌ను కేంద్ర వాణిజ్యశాఖతో మాట్లాడి రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్ జి.సృజన 'సాక్షి'కి తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 5.8 శాతంగా ఉందని, దీన్ని 2030 నాటికి 10 శాతానికి పెంచాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని నిర్దేశించారని చెప్పారు. ఇందుకోసం కీలకమైన ఎఫ్ఐఈవో చాప్టర్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ గుణదల సమీపంలో ఉన్న ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అద్దె లేకుండా ఎఫ్ఐఈవో కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించామన్నారు. ఎఫ్ఐఈవోకి దేశ వ్యాప్తంగా ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాల్లో ప్రాంతీయ కార్యాలయాలుండగా, 12 చాప్టర్స్ ఉన్నాయి. ఏపీ చాప్టర్ ఏర్పాటుతో ఈ సంఖ్య 13కు పెరిగింది. ఈ చాప్టర్ ఏర్పాటుతో ఎగుమతులకు సంబంధించిన సమాచారం, అనుమతులు ఒకేచోట లభించడం ద్వారా సులభంగా ఎగుమతులు చేసే అవకాశం ఏర్పడుతుంది.

ఎగుమతి సేవలన్నీ ఒకేచోట

వివిధ దేశాలకు ఎగుమతి అవకాశాలు, అక్కడ దిగుమతి సుంకాల మినహాయింపు వంటి అంశాలపై ఎఫ్ఐఈవో ఎగుమతిదారుల్లో అవగాహన పెంచుతుంది. తద్వారా ఎగుమతులను ప్రోత్సహిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎఫ్ఐఈవోలో 480 మంది వరకు ఎగుమతిదారులు నమోదై ఉన్నారని, త్వరలోనే ఈ సంఖ్యను వెయ్యికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎఫ్ఐఈవో జాయింట్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. రాష్ట్రంలో రైతులతో పాటు హస్తకళాకారులకు లబ్ధిచేకూర్చే విధంగా ఎగుమతులను ప్రోత్సహించడానికి చాప్టర్‌ను ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కార్యకలాపాలను ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని వారు కూడా ఎగుమతులు చేసే విధంగా అన్నిరకాల సేవలను అందిస్తామని, అదే విధంగా ప్రతి జిల్లాను ఒక ఎక్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ జరుగుతున్న తరుణంలో మార్చి 2న విశాఖలో ఎగుమతిదారుల అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఎఫ్ఐఈవో ఏపీ చాప్టర్ హెడ్ జి.రఘునాథబాబు చెప్పారు. ఎగుమతులకు సంబంధించి మరిన్ని వివరాలకు Email ID: fieoap@fieo. org, babu@fieo.org, Phone No. 0866–4617016ల్లో సంప్రదించాలని సూచించారు.

పోలవరం నావిగేషన్ కెనాల్‌పై కదలిక

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పటివరకూ నావిగేషన్ కెనాల్ పనులు ఆపేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు.

2016 నుంచి ఉలుకూ పలుకులేని ఐడబ్ల్యూఏఐ

నిజానికి.. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను 2004–05లోనే కేంద్రం ఇచ్చింది. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ మేరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిపై ఎగువకు, దిగువకు నౌకాయానానికి వీలుగా 36.6 మీటర్ల వెడల్పు.. 9.6 మీటర్ల పూర్తి ప్రవాహ లోతు (ఎఫ్ఎస్‌డీ)తో 1.423 కి.మీల పొడవుతో అప్రోచ్ చానల్.. దానికి కొనసాగింపుగా 40 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల ఎత్తు గేటుతో మూడు నావిగేషన్ లాక్‌లు.. 12 మీటర్ల వెడల్పు, 3.81 మీటర్ల ఎఫ్ఎస్‌డీతో 3.84 కి.మీ.ల పొడవున నావిగేషన్ కెనాల్.. 12 మీటర్ల వెడల్పు, 3.66 మీటర్ల ఎఫ్ఎస్‌డీ, 2.34 మీటర్ల నిలువుతో 890 మీటర్ల పొడవున నావిగేషన్ టన్నెల్ పనులను చేపట్టింది. ఇందులో 2014 నాటికే నావిగేషన్ లాక్‌ల పనులు దాదాపుగా పూర్తిచేసింది. నావిగేషన్ టన్నెల్ పనులు 90 శాతం పూర్తిచేసింది. అలాగే..

- 2013–14 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించిన వ్యయం మేరకు నావిగేషన్ కెనాల్ పనుల అంచనా వ్యయం రూ.261.62 కోట్లు. ఇందులో రూ.137.93 కోట్ల విలువైన పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది.
- ఈ క్రమంలో 2016లో ఐడబ్ల్యూఏఐ గోదావరి, కృష్ణా నదులను జాతీయ జలమార్గం–4గా ప్రకటించి.. అందులో భాగంగానే ధవళేశ్వరం నుంచి భద్రాచలం స్ట్రెచ్‌ను చేర్చింది. ఈ జలమార్గాన్ని క్లాస్–3 ప్రమాణాలతో చేపట్టాలని నిర్ణయించింది.
- క్లాస్–3 ప్రమాణాలతో పోలవరం నావిగేషన్ కెనాల్‌ను నిర్మించాలంటే.. 1.423 కి.మీ.ల పొడవున అప్రోచ్ చానల్‌ను 40 మీటర్ల వెడల్పు, 2.20 ఎఫ్ఎస్‌డీతోనూ.. దానికి కొనసాగింపుగా 70 మీటర్ల వెడల్పు, 15 మీటర్ల ఎత్తు గేటుతో మూడు నావిగేషన్ లాక్‌లు.. 40 మీటర్ల వెడల్పు, 2.20 మీటర్ల ఎఫ్ఎస్‌డీతో 3.84 కి.మీ.ల పొడవున నావిగేషన్ కెనాల్.. 20 మీటర్ల వెడల్పు, 2.20 మీటర్ల ఎఫ్ఎస్‌డీ, 7 మీటర్ల నిలువుతో 890 మీటర్ల పొడవున నావిగేషన్ టన్నెల్ పనులను చేపట్టాలి.
- ఈ పనులకు రూ.876.38 కోట్ల వ్యయమవుతుందని.. ఆ మేరకు నిధులు విడుదలచేస్తే పనులు చేపడతామని ఐడబ్ల్యూఏఐకి అనేకమార్లు రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ప్రతిపాదించారు. కానీ, ఐడబ్ల్యూఏఐ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం కలుసుకున్నారు. తెలుగుదేశం ముఖ్యనేతలు యనమల రామకృష్ణుడు, చినరాజప్ప, కొల్లు రవీంద్ర, నక్కా ఆనంద్‌బాబు, ఏలూరి సాంబశివరావు, కొనకళ్ల నారాయణ, వర్ల రామయ్యలను ఆయనకు పరిచయం చేశారు. సుమారు 40 నిమిషాలపాటు గవర్నర్ వద్ద ఉన్న చంద్రబాబు రాష్ట్రంలోని తాజా పరిస్థితులను వివరించినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడకపోగా, ఫొటోలను కూడా తెలుగుదేశం పార్టీ మీడియాకు విడుదల చేయలేదు.

సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు ఎంపికైన వారి జాబితా వెల్లడి

సాక్షి, అమరావతి : రాష్ట్ర సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఈ మేరకు కమిషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్ ' https:// psc. ap. gov. in' లో పొందుపరచినట్టు కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.

టీడీపీ గూటికి 'కన్నా'

- పార్టీ కండువా వేసి ఆహ్వానించిన చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శ
- సీఎం జగన్‌ను గద్దె దించేందుకే చేరినట్లు 'కన్నా' వ్యాఖ్య

సాక్షి, అమరావతి : బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో 'కన్నా' టీడీపీ కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాజకీయంగా కన్నాతో విభేదించినా వ్యక్తిగతంగా ఎప్పుడూ విమర్శించుకోలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు అమరావతి రాజధానిగా ఉండాలన్న ఆకాంక్ష కన్నాను టీడీపీలోకి వచ్చేలా చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని కాదని ఇక్కడ ప్రతిపక్షంలోని టీడీపీలోకి రావడాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 'మన తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 17 మంది ముఖ్యమంత్రులు అయ్యారు. నేను కూడా సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేశాను. సీఎంల్లో చాలామంది అవినీతి చేశారు. కొందరు అసమర్థులున్నారు. కానీ, రాష్ట్రానికి జగన్ అంత డామేజ్ చేసిన ముఖ్యమంత్రి ఎవరూ లేరు. జగన్ ఆర్థిక ఉగ్రవాది. మెడమీద కత్తి పెట్టి ప్రజల ఆస్తులు రాయించుకుంటున్నారు. పరిశ్రమలు పారిపోవడం, పెట్టుబడులు తరలిపోవడం, ఆస్తులు చేతులు మారడం వెనుక ప్రత్యేక కథ ఉంది. బిహార్ కూడా ఇప్పుడు ఏపీ కంటే చాలా మెరుగ్గా ఉంది' అని చంద్రబాబు విమర్శించారు. జగన్ పాలనలో ప్రజలు పేదలైతే.. జగనొక్కడే ధనవంతుడు అయ్యారని ఆయన ఆరోపించారు. అలాగే, 'కందుకూరులో దురదృష్టకర ఘటనను అడ్డం పెట్టుకుని జీఓ–1 తెచ్చారు. నేను సీఎంగా ఉన్నప్పుడు జగన్ పాదయాత్ర చేయలేదా? నేను అనుకుని ఉంటే జగన్‌ను బయటకు రానిచ్చేవాడినా. కానీ, హుందాగా వ్యవహరించాను. నాలాగే పవన్‌కళ్యాణ్‌ను కూడా ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో హూ కిల్డ్ బాబాయ్ అనేది ప్రధాన చర్చ. వివేకా హత్య వ్యవహారంపై సినిమా కూడా తీయొచ్చు. అసలు వివేకా హత్య అనంతరం డ్రామా మొదలుపెట్టి నారాసుర రక్తచరిత్ర అంటూ నాపై ప్రచారం చేశారు. నిజమేనని ప్రజలు కూడా కొంత నమ్మి జగన్‌కు ఓట్లు వేశారు' అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేవని చంద్రబాబు విమర్శించారు. అనంతరం, కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తొలి నుంచి చంద్రబాబుకు వ్యతిరేకంగా పనిచేసిన తాను సీఎం జగన్‌ను గద్దె దించేందుకే టీడీపీలో చేరినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్ రాష్ట్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారని ఆరోపించారు.

ఫ్యాషన్

జరీ అంచు ఆభరణం



సంప్రదాయ వేడుకలలో
జరీ అంచు చీరల రెపరెపలు మనకు పరిచయమే.
పువ్వులు, హంసలు, గోపురపు డిజైన్లతో అవి అందంగా ఆకట్టుకుంటాయి.
వాటిని అంచు వరకే ఎందుకు పరిమితం చేయాలనే ఆలోచనతో
ఆభరణంగా రూపుకడుతున్నారు డిజైనర్లు.
పాత చీరెల అంచులైనా
కొత్తగా మార్కెట్లో లభించే జరీ బార్డర్స్ అయినా
ఇలా మనసుదోచేలా మురిపిస్తున్నాయి.

గాజుల అందం

రంగు వెలసిన వెడల్పాటి గాజులను వాడకుండా పక్కన పడేయటం ఇళ్లలో సాధారణంగా జరుగుతుంటుంది. వాటితో జరీ అంచును ఇలా అందంగా తయారుచేసుకోవచ్చు.



1. పాత సిల్క్, జరీ అంచు ఉన్న చీరను ఎంపిక చేసుకోవాలి. జరీ అంచు బాగుంటే, దానిని చీర నుంచి కట్ చేసుకోవాలి.
2. ఎంపిక చేసుకున్న గాజుకు కట్ చేసిన జరీ అంచును చుట్టి, అన్నివైపులా గ్లూతో అతికించాలి.
3. ఎక్కడా జరీ పోగులు బయటకు రాకుండా సరి చూసుకోవాలి.
4. పూర్తిగా గాజు తయారీ పూర్తయ్యాక ఫ్యాబ్రిక్ చివర్లు కూడా బయటకు కనిపించకుండా అతికించాలి.
5. రెండు రకాల గాజు మోడల్స్ తయారు చేసుకొని, కాంబినేషన్‌గా ధరించవచ్చు.

సంప్రదాయ వేడుకలు

వేడుకకు తగినట్టు డ్రెస్ ఎంపిక ఉంటుంది. దానికి మ్యాచింగ్‌గా ఈ జరీ మాలలు మరింత అందాన్ని తీసుకువస్తున్నాయి.



ఫ్యాబ్రిక్ రోలర్

నూలు దారాలను ఉండగా చేసి, వాటికి కట్ చేసుకున్న బార్డర్‌ని అతికించి, కావల్సిన పరిమాణంలో ఫ్యాబ్రిక్ బీడ్స్‌ను తయారు చేసుకోవచ్చు.



లాకెట్స్‌తో ప్రత్యేకం

ముగ్గు, గోపురం, దేవతా మూర్తుల లాకెట్స్‌ని ఈ జరీ అంచు చెయిన్స్‌కు జత చేయచ్చు. లేదంటే, బార్డర్ ఫ్యాబ్రిక్‌నే లాకెట్‌లా తయారు చేసి, వేసుకోవచ్చు.















బీడ్స్‌తో జత కట్టి

రంగు రంగుల పూసలను ఎంపిక చేసుకొని, వాటితో జరీ బాల్స్‌ను జత చేసి దండగా సిద్ధంగా చేసుకోవచ్చు.



వైరల్

శ్రమజీవనమే పరమానందం

'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అన్నాడు దేవదాస్.
బాధ సంగతేమిటోగానీ కష్టంలోనే సౌఖ్యాన్ని వెదుక్కుంది చెన్నైకి చెందిన పరమేశ్వరి.
తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం గత ఇరవై సంవత్సరాలుగా రోజుకు మూడు ఉద్యోగాలు చేస్తోంది...



పరమేశ్వరి

పేద ఇంట్లో పుట్టి పెరిగింది పరమేశ్వరి. అష్టకష్టాలు పడి కూతురి పెళ్లి చేశారు తల్లిదండ్రులు. వారి సంతోషం కరిగిపోయి విషాదంగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. దీనికి కారణం... అల్లుడు. అతడు పనిచేసేవాడు కాదు. పైగా మద్యానికి బానిస.

పెళ్లితో కష్టాలన్నీ తీరుతాయి అనుకున్న పరమేశ్వరి పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయింది. ఇల్లు దాటి పని చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఎదురైంది. కొన్ని సంవత్సరాల తరవాత చెల్లి భర్త చనిపోయాడు. ఆమె అక్క దగ్గరకి వచ్చేసింది.

భర్త, పిల్లలు, తల్లి, చెల్లి, ఆమె కూతురు... వీరిని పోషించాలంటే ఒక్క ఉద్యోగం చేస్తే సరిపోదనే విషయం పరమేశ్వరికి అర్థమైంది. అలా రోజుకు మూడు ఉద్యోగాలు చేయడం మొదలుపెట్టింది. పొద్దున నాలుగు గంటలకు లేచి ఒకరి ఇంట్లో ఇంటిపనులు చేస్తుంది.

ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో పని చేస్తుంది (ఉద్యోగులకు టీ, కాఫీలు అందించడం)

సాయంత్రం ఒక హోటల్‌లో పాత్రలు శుభ్రం చేస్తుంది. పరమేశ్వరి ఇంటికి వెళ్లేసరికి రాత్రి పదకొండు అవుతుంది. తన మాటల్లోనే చెప్పాలంటే ఆమెకు వీకెండ్స్, హాలిడేలు, సన్‌డేలు లేవు.

'కష్టాల మధ్య పెరిగాను. అందుకే కష్టపడడాన్ని భారంగా, బాధగా భావించడం లేదు. జీవితం అంటేనే పోరాటం. ఆ పోరాటంలో ప్రతిరోజూ కష్టపడాల్సిందే. సుఖంలోనే కాదు కష్టపడడంలోనూ సంతోషాన్ని వెదుక్కోవచ్చు' అంటుంది చెన్నైలోని ఎంజీఆర్ నగర్‌కు చెందిన 36 సంవత్సరాల పరమేశ్వరి.

పరమేశ్వరికి ఒక కల ఉంది.

సొంతంగా ఒక ఇల్లు, ఒక వెహికిల్ ఉండాలి.

అదృష్టం అనేది కష్టపడేవారి అడ్రస్ వెదుక్కుంటూ వస్తుంది అంటారు. పరమేశ్వరి కోసం ఏ అదృష్టం వెదుక్కుంటూ రాలేదు గానీ తన శ్రమ ఫలితమే ఇల్లుగా, వాహనంగా మారాయి. సంపాదించిన దానిలో ఎంతో కొంత దాచుకునేది. అలా ఆమె తన కలను నెరవేర్చుకుంది. ఈ సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని 'హ్యూమన్స్ ఆఫ్ మద్రాస్' అనే సంస్థ పరమేశ్వరి గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పరమేశ్వరి శ్రమైక జీవనసౌందర్యాన్ని నెటిజనులు వేనోళ్ల పొగిడారు.

విశేషం



శిక్షణలో మహిళా రెజ్లర్లు

అమ్మాయిలకు మాత్రమే

ఆ కుస్తీ శాలకు వెళితే 35 మంది యువతులు భారీ కసరత్తులు చేస్తూ కనిపిస్తారు. హర్యానాలోని సోనిపట్‌లో 'యుద్ధవీర్ అఖాడా' మహిళా రెజ్లర్ల గురుకులంగా వాసికెక్కింది.

ఉదయం 4.30 గంటలు.

ఆ అమ్మాయిలంతా లేచి మొదట చేయవలసిన పని బాదం పప్పును మెత్తగా నూరి చిక్కటి పాలతో తీసుకోవడం. ఆ తర్వాత శరీరంలో చురుకుదనం తెచ్చే చిన్నపాటి వ్యాయామాలు చేయడం. ఆ తర్వాత వ్యాయామ స్థాయిని పెంచుకుంటూ పోవడం. ఆపై గోదాలో దిగి ఒకటి రెండు కుస్తీలు ఆడటం. ఉదయం 8.30 వరకూ ఈ శిక్షణ సాగుతుంది. ఏ మాత్రం మార్పు ఉండదు. మళ్లీ సాయంత్రం ఇలాగే నాలుగు గంటల శిక్షణ ఉంటుంది.

ఢిల్లీకి గంటన్నర దూరంలో ఉన్న సోనిపట్ (హర్యాణ) అనే ఒక మోస్తారు పట్టణం శివార్లలో ఆవాల చేల పక్కన ఉన్న 'యుద్ధ్‌వీర్ అఖాడా' కేవలం మహిళా రెజ్లర్లకు ఉద్దేశించబడినది. దీనిని స్థాపించిన యుద్ధవీర్ స్వయంగా కుస్తీ యోధుడు. విశాలమైన ఈ శిక్షణా కేంద్రంలో గోడల నిండా అతడు తెచ్చిన మెడల్స్ వేలాడదీసి ఉంటాయి. ప్రస్తుతం అతడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నందు వల్ల అతని తండ్రి, శిక్షకులు ఈ అమ్మాయిలకు ట్రైనింగ్ ఇస్తున్నారు.

2016 నుంచి వచ్చిన ఊపు

హర్యాణలో ఆడపిల్లలకు త్వరగా పెళ్లి చేసి పంపడం, ఆటలకు దూరంగా ఉంచడం ఆనవాయితీ. అయితే 2016 రియో ఒలింపిక్స్‌లో హర్యాణ నుంచి సాక్షి మాలిక్ ఒలింపిక్స్‌లో పతకం తేవడంతో ఒక్కసారిగా ఆ రాష్ట్రమంతా మహిళా కుస్తీ గురించి చర్చించుకోవడం మొదలెట్టింది. అదే సంవత్సరం ఆమిర్‌ఖాన్ 'దంగల్' వచ్చి ఆడపిల్లల కుస్తీని కథాంశంగా చూపి సూపర్‌హిట్ కొట్టడంతో అక్కడి తల్లిదండ్రులు, ఆడపిల్లలు కుస్తీని తమ భవిష్యత్తుకు ఒక మంచి మార్గంగా భావించారు. అది గమనించిన యుద్ధ్‌వీర్ ఆ మరుసటి సంవత్సరం ఈ అకాడెమీని తెరిచాడు.

గురుకుల విద్య

యుద్ధ్ వీర్ అఖాడాలో 10 ఏళ్ల నిండిన వయసు నుంచి 15 ఏళ్ల లోపు చేరవచ్చు. 20 ఏళ్ల వయసు వచ్చేవరకు సాధన చేయాల్సి వుంటుంది. అన్నాళ్లు అక్కడే ఉండిపోవాలి. అయితే ఈ విద్య ఉచితం కాదు. ఒక్కో స్టూడెంట్ నెలకు కనీసం 15 వేలు చెల్లించాలి. శిక్షణ ఇస్తూ మంచి ఆహారం కూడా ఇవ్వాలంటే కనీసం ఈ మాత్రం ఫీజు అవసరం అని నిర్వాహకులు అంటారు. సంప్రదాయ జిమ్‌తో పాటు కొయ్యదుంగను ఈడ్చడం, టైర్లను సుత్తితో బాదడం, మట్టి గోదాలో కుస్తీ ఆడటం వంటి శిక్షణ ఉంటుంది. నడుముకు బలం రావడానికి, చేతుల్లో ఒడుపు రావడానికి రకరకాల వ్యాయామాలు చేయిస్తారు.

అలంకరణ లేదు

ఇక్కడ చేరే అమ్మాయిలందరూ మిలట్రీలో లాగా క్రాఫ్ చేయించుకోవాల్సి ఉంటుంది. టీషర్టులు, ట్రాక్ ప్యాంట్లు తప్పనిసరి. గబుక్కున చూస్తే వీరంతా అబ్బాయిలకు మల్లే కనిపిస్తారు. ఆదివారం రోజు ఇచ్చే వెసులుబాటులో సరదాగా వంట చేయడం, ఆ సాయంత్రం నృత్యంతో సేద తీరడం చేస్తారు. 'మేమంతా స్నేహితులమే అయినా గోదాలో ఉన్న కాసేపు శత్రువులమే' అని నవ్వుతారు. 'ఓడినవారు ఐదు నిమిషాల్లో మాట కలిపేయాలి అనేది నియమం' అంటారు.

ఆశలు... ఆకాంక్షలు


ఇక్కడ చేరిన వారంతా ఇప్పటికే అండర్ 15, అండర్ 17 కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో ఆడి పతకాలు తెస్తున్నారు. జూనియర్ ఛాంపియన్ బిపాష దహియా ఇక్కడ ఇంకా శిక్షణలో ఉంది. కామన్‌వెల్త్, ఒలింపిక్స్‌లో ఆడి ప్రభుత్వ ఉద్యోగాలు తెచ్చుకోవాలని, ఆర్మీలో చేరాలని వీరంతా భావిస్తున్నారు. 'మేము ఐదుగురం అక్కాచెల్లెళ్లం. కొడుకు లేని కారణాన మా నాన్న మాలో ముగ్గుర్ని ఇక్కడికి పంపించాడు. మేము దృఢంగా, బలంగా ఉండాలని ఆయన కోరిక' అని ఒకమ్మాయి అంది. సమాజంలో స్త్రీలపై ఉండే వివక్ష, హింసను తట్టుకోవడానికి మానసికంగా, శారీరకంగా బలంగా ఉండటానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అమ్మాయిలు భావిస్తున్నారు.

రెండు నిమిషాల్లో ఎత్తి కిందపడేయగల వీరిని చూస్తే ఎవరైనా సరే ఒళ్లు దగ్గర పెట్టుకోక తప్పదు మరి.

హెయిర్ కేర్ టిప్స్

ప్రతి రోజూ పది నుంచి పదిహేను నిమిషాలపాటు తలకు మసాజ్ చేసినట్లయితే జుట్టు కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం తగ్గుతుంది. రోజూ తలస్నానం చేసేవాళ్లు తల రుద్దుకునేటప్పుడే పది నిమిషాల సేపు మసాజ్ చేసినట్లు రుద్దితే రెండు పనులూ అవుతాయి.

ఉసిరిక పొడి, కుంకుడుకాయ, శీకాయపొడి అన్నీ సమపాళ్లలో అంతా కలిసి రెండు టేబుల్‌స్పూన్లు ఉండేటట్లు చూసుకోవాలి. ఇందులో కోడిగుడ్డు సొన కలిపి అవసరమైతే కొద్దిగా నీటిని కలిపి పేస్టు చేసుకుని తలంతా పట్టించి పది నిమిషాల సేపు మసాజ్ చేయాలి. మసాజ్ పూర్తయిన తర్వాత ఇరవై నిమిషాలకు కడిగేయాలి. అవసరమనిపిస్తే కొద్దిగా గాఢత తక్కువగా ఉన్న షాంపూ వాడవచ్చు. వారానికి కనీసం మూడుసార్ల చొప్పున నెల రోజుల పాటు ఈ ట్రీట్‌మెంట్ చేస్తే హెయిర్ లాస్‌ను పూర్తిగా నివారించవచ్చు.



హెయిర్‌లాస్‌ను కంట్రోల్ చేయడానికి ఆముదం, బాదం నూనె చక్కటి కాంబినేషన్. ఈ రెండింటినీ సమపాళ్లతో తీసుకుని గోరువెచ్చగా చేసి తలకు పట్టించి మసాజ్ చేయాలి. మసాజ్ పూర్తయిన అరగంటకు తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మంచిఫలితం ఉంటుంది. ఆముదం, బాదం బదులుగా కొబ్బరి నూనెను కూడా వాడవచ్చు.

రోజూ పది నిమిషాల సేపు ఆల్మండ్ ఆయిల్‌తో తలకు మసాజ్ చేస్తే జుట్టు రాలదు.

వంటిల్లు

ఎండకు చల్ల గొడుగు

ఇంట్లో పెరుగు ఉంటే ఒంట్లో వేడి పెరగదు

మార్చి నెల రానేలేదింకా...
వాతావరణం మారిపోయింది.
ఎండకు గొడుగు పట్టాల్సిందే.
ఇంట్లోనే 'చల్ల' గొడుగు పడదాం.
పెరుగు చిలికి... లస్సీ చేద్దాం.



రోజ్ లస్సీ

కావలసినవి: పెరుగు – 2 కప్పులు; చల్లటి నీరు – కప్పు; చక్కెర లేదా తేనె – 3 టేబుల్ స్పూన్‌లు; రోజ్ సిరప్ – 2 టేబుల్ స్పూన్‌లు; పిస్తా – 10 (పలుకులు చేయాలి).


తయారీ: మిక్సీ జ్యూస్ జార్‌లో పెరుగు, రోజ్‌సిరప్, చక్కెర, నీరుపోసి బ్లెండ్ చేయాలి. రుచిని బట్టి మరింత తీపి కావాలనుకుంటే మరో రెండు స్పూన్‌ల చక్కెర వేసి కరిగే వరకు కొద్దిసేపు బ్లెండ్ చేయాలి. గ్లాసులో పోసి పిస్తాతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

మసాలా చాస్



కావలసినవి: పెరుగు – కప్పు; జీలకర్ర పొడి – అర టీ స్పూన్; చాట్ మసాలా – పావు టీ స్పూన్; నల్ల ఉప్పు – చిటికెడు; అల్లం తురుము – పావు టీ స్పూన్; పచ్చిమిర్చి – 1 (తరగాలి); మిరియాల పొడి – పావు టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పుదీనా – 5 ఆకులు; కొత్తిమీర తరుగు – టీ స్పూన్; మంచి నీరు – 4 కప్పులు.

తయారీ: ఒక పాత్రలో పెరుగు, జీలకర్ర, చాట్ మసాలా, జీలకర్ర పొడి, నల్ల ఉప్పు, అల్లం తరుగు, పచ్చిమిర్చి తరుగు, మిరియాలపొడి, ఇంగువ, ఉప్పు వేసి బీటర్‌తో బాగా చిలకాలి. ఇప్పుడు నీటిని పోసి అరనిమిషం పాటు చిలకాలి. చివరగా పుదీన, కొత్తిమీర వేసి తాగడమే. రోజూ ఉదయం బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు తాగితే ఎండ వేడిమి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.



కేసర్ ఇలాచీ ...

కావలసినవి: పెరుగు – 2 కప్పులు; కుంకుమ పువ్వు రేకలు – 2; తేనె– 3 టేబుల్ స్పూన్‌లు; యాలకులు – 6 (తొక్క వేరు చేసి గింజలను పొడి చేయాలి); బాదం తరుగు – టేబుల్ స్పూన్; పిస్తా – టేబుల్ స్పూన్.

తయారీ: ఒక పాత్రలో బాదం, పిస్తా మినహా పైన తీసుకున్న అన్నింటినీ వేసి బీటర్‌తో రెండు నిమిషాల సేపు చిలకాలి. తీపి సరి చూసుకుని అవసరమైతే మరికొంత తేనె వేసి కలిసేవరకు చిలకాలి. ఈ మిశ్రమాన్ని గ్లాసుల్లో పోసి పైన బాదం, పిస్తాతో అలంకరించి సర్వ్ చేయాలి. ఇది మధ్యాహ్న భోజనంలో భాగంగా తీసుకుంటే బాగుంటుంది.



స్వీట్ మింట్ ...

కావలసినవి: పెరుగు – కప్పు; తేనె– 2 టేబుల్ స్పూన్‌లు; పుదీన ఆకులు – అర కప్పు; జీడిపప్పు – 20 (వలిచినవి); బాదం – 10 (తరగాలి); పిస్తా – 10 (తరగాలి); మంచి నీరు – 4 కప్పులు.

తయారీ: జీడిపప్పులను చిన్న పలుకులు చేసి, బాదం తరుగు, పిస్తా తరుగులో కలిపి పక్కన ఉంచుకోవాలి. మిక్సీ జార్‌లో పెరుగు, పుదీన, తేనె వేసి బ్లెండ్ చేయాలి. నీటిని కలిపి మరోసారి కలిసేలా తిప్పాలి. ఈ లస్సీని గ్లాసుల్లో పోసి బాదం, పిస్తా, జీడిపప్పుతో అలంకరించి సర్వ్ చేయాలి. ఇష్టమైతే ఐస్‌క్యూబ్స్ వేసుకోవచ్చు.

కేసర్ పిస్తా ...

కావలసినవి: పెరుగు – కప్పు; చక్కెర లేదా తేనె – టేబుల్ స్పూన్; క్రీమ్– పావు కప్పు; కుంకుమ పువ్వు– పది రేకలు; పిస్తా – టేబుల్ స్పూన్; మంచి నీరు – 4 కప్పులు.

తయారీ: మిక్సీజార్‌లో పిస్తా, పెరుగు, క్రీమ్, చక్కెర లేదా తేనె, కుంకుమ పువ్వు నాలుగు రేకలు వేసి బ్లెండ్ చేయాలి. ఈ లస్సీని గ్లాసులో పోసి ఐస్ క్యూబ్స్ వేసి పైన రెండు కుంకుమ పువ్వు రేకలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



పైనాపిల్ ...

కావలసినవి: పైనాపిల్ ముక్కలు – అర కప్పు; చక్కెర – పావు కప్పు; పెరుగు – 2 కప్పులు; క్రీమ్ – పావు కప్పు; పుదీనా – 4 ఆకులు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి;

తయారీ: పెనం వేడి చేసి పైనాపిల్ ముక్కలు, చక్కెర వేసి సన్న మంట మీద కలుపుతూ మగ్గనివ్వాలి. సుమారుగా మూడు నిమిషాల సేపటికి ముక్కలు మెత్తబడతాయి. ఆ తర్వాత చల్లారే వరకు పక్కన ఉంచాలి. ఒక పాత్రలో పెరుగు, క్రీమ్ వేసి బీటర్‌తో బాగా చిలకాలి. ఇందులో ఉడికించిన పైనాపిల్ మిశ్రమాన్ని వేసి చిలకాలి. ఈ లస్సీని గ్లాసులో పోసి పుదీనాతో అలంకరించి ఐస్ క్యూబ్స్ వేసి సర్వ్ చేయాలి. చల్లగా చిక్కగా ఇష్టపడే వాళ్లు ఓ అరగంట ఫ్రిజ్‌లో పెట్టి చల్లబడిన తరవాత తాగవచ్చు.



■ ఇంగ్లీష్ ఇడియమ్



ఒక విషయం గురించి విన్నప్పుడు ఆహా అనిపిస్తుంది. తీరా వాస్తవం తెలిశాక 'వామ్మో' అనిపిస్తుంది. చూడడానికి అమాయకంగా కనిపించే వ్యక్తి కరడుగట్టిన హంతకుడు అని తెలిస్తే షాక్ అవుతాం. అసలు స్వభావానికి విరుద్ధంగా కనిపించే మాయ చేసే వారి విషయంలో ఉపయోగించే ఇడియమ్...నైట్‌మేర్ డ్రెస్‌డ్ లైక్ ఏ డే డ్రీమ్. ఐరిష్, స్కాటిష్ జానపద కథల్లో నుంచి పుట్టిన ఇడియమ్ ఇది. ఈ కథల్లో ఒక పాత్ర పగలు అందమైన అమ్మాయిలాగా కనిపించి, రాత్రి మాత్రం క్రూరమైన రాక్షసిగా మారి రక్తపాతం సృష్టిస్తుంటుంది. ఈ పాత ఇడియమ్ అమెరికన్ పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్ పాట 'బ్లాంక్ స్పేస్'తో బాగా పాపులర్ అయింది. పాటలో 'డార్లింగ్ ఐయామ్ ఏ నైట్‌మేర్ డ్రెస్‌డ్ లైక్ ఏ డే డ్రీమ్' అనే వాక్యం కనిపిస్తుంది.

■ సమ్‌థింగ్ స్పెషల్

అవును... ఇది నిజమే!



● జపాన్‌లోని ఆసోచి కొండల్లో 'విండ్ ఫోన్' అనే టెలిఫోన్ బూత్ ఉంది. 'విండ్ ఫోన్ ఏమిటి? అక్కడెక్కడో కొండల్లో ఉండడం ఏమిటి?' అనుకుంటున్నారా! విషయంలోకి వస్తే...2011లో జపాన్‌లో భూకంపం వచ్చి ఎంతోమంది చనిపోయారు. చనిపోయిన వారితో ఆత్మీయులకు మాట్లాడే అవకాశం లేదు. వారు ఎక్కడో ఉన్నట్లుగానే భావించి ఫోన్‌లో మాట్లాడి మనసులో ఉన్న బాధను దించుకోవడమే ఈ 'విండో ఫోన్' ఉద్దేశం. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లో కూడా 'విండ్ ఫోన్'లు ఏర్పాటయ్యాయి.

● పెరూలో 'టకనాకుయ్' పేరుతో ప్రతి సంవత్సరం 'ఫైటింగ్ ఫెస్టివల్' జరుగుతుంది. 'టకనాకుయ్' అంటే ఒకరితో ఒకరు తలపడడం. అంతమాత్రాన ఈ ఫైటింగ్ ఫెస్టివల్‌లో రక్తం కారేలా కొట్టుకోరు. ఒక విధంగా చెప్పాలంటే ఉత్తుత్తి ఫైటింగ్ అన్నమాట! మనసులో ఉన్న కోపం, ఒత్తిడి, ఆందోళనను వదిలించుకోవడానికి ఈ 'ఫైటింగ్ ఫెస్టివల్' ఉపయోగపడుతుందనే నమ్మకం ఉంది. దీనికి ఎంతో పురాతనమైన చరిత్ర ఉంది.

■ కాలనాళిక

టైమ్ కాప్యూల్ 2047



కాలంతో పాటు నడవడం ఎంత ముఖ్యమో భవిష్యత్ దార్శనికత కూడా అంతే ముఖ్యం.
టైమ్ క్యాప్స్యూల్ అనేది మన వర్తమాన,భవిష్యత్ ఆలోచనల సమ్మేళనం. ఐఐటీ, దిల్లీ శాస్త్రవేత్తలు ఇటీవల రూపొందించిన కాలనాళిక (టైమ్ క్యాప్స్యూల్) సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఇండియా @ 2047' పై అభిప్రాయాలను సేకరించి ఇందులో భద్రపరిచారు. ఈ టైమ్ క్యాప్స్యూల్‌ను స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేశారు. దీని బరువు 75 కిలోలు.
ఈ కాలనాళికను 2047లో తెరుస్తారు. భవిష్యత్‌కు సంబంధించిన మన ఆశాజనకమైన అంచనాలు వాస్తవమైతే అంతకంటే సంతోషం ఏమున్నది!

■ యంగ్ టాలెంట్



హసన్ అరుణ్

మంచుఖండం మనసైన సాహసం

అంటార్కిటికా విహారం తెర మీద చూసినంత సౌకర్యంగా ఉండదు. కానీ మాటల్లో చెప్పలేనంత ఆహ్లాదంగా ఉంటుంది జర్నీ. అంటార్కిటికా గురించి తెలుసుకోవాలంటే స్వయంగా పర్యటించాల్సిందే అనుకున్నాడు హైదరాబాద్ కుర్రాడు హసన్ అరుణ్. లండన్, కింగ్స్ కాలేజ్‌లో ఎకనమిక్స్ చదువుతున్న అరుణ్ గత డిసెంబర్‌లో అంటార్కిటికా సాహసయాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. విశేషాలను లండన్ నుంచి సాక్షితో పంచుకున్నాడు.

మూడు సముద్రాల కలయిక

''అంటార్కిటికా గురించి తెలుసుకోవాలని ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఇంటర్నెట్‌లో ఉన్న సమాచారం నాకు సంతృప్తినివ్వలేదు. స్వయంగా ఎక్స్‌ప్లోర్ చేయాల్సిందే అనుకున్నాను. ఆ అడ్వెంచర్‌ని ఎంజాయ్ చేయాలని కూడా. హైదరాబాద్ నుంచి గత డిసెంబర్ 21వ తేదీ బయలుదేరి దాదాపుగా ఒక రోజంతా ప్రయాణం చేసిన తర్వాత బ్రెజిల్ లోని 'రియో డీ జెనీరో'మీదుగా అర్జెంటీనా రాజధాని 'బ్యూనోస్ ఎయిరిజ్'కి చేరాను. అక్కడ మూడు రోజులున్నాను. ప్రపంచం అంచు అని చెప్పే 'ఉషయాయియా' ను చూశాను. అంటార్కిటికా క్రూయిజ్ అక్కడి నుంచే మొదలవుతుంది. ఉషయాయియా నుంచి 26వ తేదీ ఉదయం క్రూయిజ్ ప్రయాణం మొదలైంది. బీగెల్ చానెల్‌లో సాగుతుంది క్రూయిజ్ ప్రయాణం. డ్రేక్ ప్యాసేజ్ మీదుగా ఒకటిన్నర రోజు ప్రయాణించాలి. ఈ జర్నీలో అత్యంత క్లిష్టమైన ప్రదేశం ఇదే. అట్లాంటిక్, పసిఫిక్, సదరన్ ఓషన్ ఈ మూడు సముద్రాలు కలిసే ప్రదేశం ఇది. అలలు నాలుగు మీటర్ల నుంచి పదకొండు మీటర్ల ఎత్తు లేస్తుంటాయి. సీ సిక్‌నెస్ వచ్చేది ఇప్పుడే. తల తిరగడం, వాంతులతో ఇబ్బంది పడతారు. సిక్‌నెస్ తగ్గడానికి మందులు, సీ బ్యాండేజ్ ఇస్తారు. ఈ స్థితిలో నిద్ర సమయం కూడా పెరుగుతుంది. ఉష్ణోగ్రత మైనస్ రెండు ఉంటుంది. క్రూయిజ్ లోపల ఏసీ ఉంటుంది, కాబట్టి ఇబ్బంది ఉండదు. ఓపెన్ ప్లేస్‌లో నాలుగైదు నిమిషాలకంటే ఎక్కువసేపు ఉండలేం. అలలు పైకి లేచినప్పుడు అంత భారీ క్రూయిజ్ కూడా నీటి తాకిడికి కదిలిపోతుంటుంది. అలలు ఆరు మీటర్ల ఎత్తు వస్తున్నంత వరకు ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. అంతకు మించితే మాత్రం క్రూయిజ్ ఆగాల్సిందే. లంగరు వేసి వాతావరణం నెమ్మదించిన తర్వాత కదులుతుంది. మా జర్నీలో నాలుగు మీటర్లకు మించలేదు, కాబట్టి ఆగాల్సిన అవసరం రాలేదు.

మనిషి వల్లే హాని

అంటార్కిటికా గురించి ప్రయాణంలోనే ఎక్కువ తెలుసుకోగలిగాను. క్రూయిజ్‌లో మెరైన్ ఇంజనీర్‌లు, సైంటిస్టులు, నేచరిస్టులు కూడా ఉంటారు. ఒక ప్రదేశానికి వెళ్లడానికి ముందు ఆ ప్రదేశం వివరాలు, అక్కడ మెలగాల్సిన విధానం కూడా చెప్తారు. పెంగ్విన్‌లకు కనీసం ఐదు మీటర్ల దూరంగా ఉండాలని, మనుషుల నుంచి వాటికి ఇన్‌ఫెక్షన్ సోకితే ఏకంగా వేలకొద్దీ ఉన్న కాలనీలే తుడిచిపెట్టుకుపోతాయని తెలిసింది. మనిషి ఎంత హానికారకుడో, ప్రకృతికి ఎంత పెద్ద శత్రువో మొదటిసారి తెలిసింది. వాళ్లు పర్యాటకులను ఆహ్వానిస్తూనే మంచుఖండం పర్యావరణ సమతుల్యతను పరిరక్షించుకుంటున్నారు. ఇక్కడ పర్యటించడానికి డిసెంబర్ రెండవ వారం నుంచి జనవరి మొదటి వారం వరకు అనుకూలమైన సమయం.

– హసన్ అరుణ్, సాహస యాత్రికుడు

నేలను పలకరిస్తూ నీటిలో ప్రయాణం

వెడెల్ సీలోకి ప్రవేశించామంటే అంటార్కిటికా ఖండంలోకి అడుగుపెట్టినట్లే. వెడెల్ సీ లో దాదాపు సగం రోజు సాగుతుంది ప్రయాణం. గ్లేసియర్‌లు, ఐస్ బెర్గ్‌లు, పర్వతాలు, పెంగ్విన్ కాలనీలు, వేల్స్, సీల్స్ కనిపిస్తుంటాయి. అంటార్కిటికా చేరిన తర్వాత ఆరు రోజుల పాటు రోజుకు రెండు దీవులు లేదా ద్వీపకల్పాల మీద ల్యాండ్ అవుతూ ఆరు రోజుల్లో పన్నెండింటిని కవర్ చేశాను. జనవరి రెండవ తేదీ తిరుగు ప్రయాణం. 'బ్యూనోస్ ఎయిరిజ్' నుంచి నేను లండన్‌కి వచ్చేశాను.

రోజంతా పగలే!

అంటార్కిటికాలో రోజంతా నింగికీ నేలకూ మధ్యనే గడిపినప్పటికీ ఆ వారం రోజులూ సూర్యాస్తమయాన్ని చూడలేకపోయాను. సూర్యుడు చండప్రచండంగా ఉదయించే ఉన్నాడు. ఇది అద్భుతమైన అనుభూతి. కాలుష్యం అంటే ఏమిటో తెలియని స్వచ్ఛమైన నీరు, లెక్కకు మించిన హిమనీనదాలు, గుంపుల కొద్దీ పెంగ్విన్‌లు, సహజమైన దారుల్లో ట్రెకింగ్ నాకు మరిచిపోలేని జ్ఞాపకాలు. నేను అడ్వెంచర్స్‌ని బాగా ఇష్టపడతాను, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లో కూడా ట్రెకింగ్ చేశాను. కానీ అంటార్కిటికా ట్రెకింగ్ సహజత్వం ఒడిలో సాగిన సాహసం అనిపించింది''.

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి

■ గేమింగ్ నేడే విడుదల



అతడి అడుగులో ప్రతి అంగుళం ఆయుధమే!

రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'ఆక్టోపాత్ ట్రావెలర్-2' నేడు విడుదల అవుతోంది. 2018లో వచ్చిన 'ఆక్టోపాత్ ట్రావెలర్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది. ఈ ఆటలో ఎనిమిది క్యారెక్టర్లు ఉంటాయి. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన ప్రత్యేకత ఉంటుంది. 'హికారి' ఒక యోధుడు...ఏ జర్నీ ఫర్ హోమ్ 'అగ్నేయ' ఒక డాన్సర్...ఏ జర్నీ ఫర్ స్టార్‌డమ్ 'పార్టిటియో' ఒక వ్యాపారి...ఏ జర్నీ ఫర్ ప్రాస్పెరిటీ 'ఒస్వాల్డ్' ఒక విద్యావేత్త....ఏ జర్నీ ఫర్ రివెంజ్ 'థ్రోన్' ఒక దొంగ...ఏ జర్నీ ఫర్ ఫ్రీడమ్ 'టెమెనోస్' ఒక మతగురువు...ఏ జర్నీ ఫర్ ట్రూత్ 'ఔచెట్' ఒక హంటర్...ఏ జర్నీ ఫర్ లెజెండ్స్ 'కస్టీ' ఒక మందుల వ్యాపారి...ఏ జర్నీ ఫర్ మెమోరీస్. ఈ టర్న్-బేస్‌డ్ బ్యాటిల్ గేమ్‌లో ప్రతి ఎనిమీకి కొన్ని బలహీనతలు ఉంటాయి. అయితే సులభంగా కనుక్కునేలా ఉండవు. అవి ఏమిటో తెలుసుకుంటే ఆటలో అడుగులు ముందుకుపడతాయి. ఈ గేమ్‌లో డే టైమ్, నైట్ టైమ్ అనే రెండు సెగ్మెంట్‌లు ఉంటాయి. డే టైమ్‌లో ఆడే విధానానికి, నైట్ టైమ్‌లో ఆడే విధానానికి తేడా ఉంటుంది. డే టైమ్‌లో ఆడాల్సి వస్తే కొత్త స్కిల్స్‌లో ప్రావీణ్యం సంపాదించాల్సి ఉంటుంది.
జానర్: రోల్ ప్లేయింగ్ మోడ్స్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్, ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్

■ టెక్...టాక్

వివో వి27 ప్రో



సైజ్: 6.78 అంగుళాలు బరువు: 182 గ్రా.
మెమోరీ: 128 జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ 256జీబి 12జీబి ర్యామ్
డిస్‌ప్లే: 1080×2400 పిక్సెల్స్
ఫీచర్స్: డ్యూయల్-ఎల్‌ఈడీ ఫ్లాష్ వోఎస్: ఆండ్రాయిడ్ 13, ఫన్‌టచ్ 13
కలర్స్: బ్లాక్, మింట్

రీయూజబుల్ నోట్‌బుక్



పేపర్ వృథా కాకుండా రూపొందించిన ఎకో-ఫ్రెండ్లీ రీయూజబుల్ నోట్‌బుక్ ఇది.
బ్రాండ్: రాకెట్ సైజ్: 8.5×9.5
పేజీలు: 82 ● పైలెట్ ఫ్రిక్సియన్ పెన్

డెస్క్‌టాప్ వాక్యూమ్ క్లీనర్



బ్రాండ్: రెమ ఎక్స్‌ఎక్స్ ఫిల్టర్ టైప్: ఫోమ్
● మల్టీపుల్: డెస్క్‌టాప్, లాప్‌టాప్...మొదలైనవి.
● హైస్పీడ్ సెంట్రిఫిగల్ ఫ్యాన్ ● ఫామ్ ఫ్యాక్టర్: హ్యాండ్ హెల్డ్

■ బ్రెయిన్ జిమ్

ప్రశ్న స్థానంలో ఉండాల్సిన నంబర్ ఏమిటి?

70	91	120
14	13	24
5	7	?



జవాబు:

70/14=5 91/13=7 120/24=5

సినిమా



● రామ్‌చరణ్

గుడ్ మార్నింగ్ అమెరికా!

అమెరికాలోని ప్రముఖ టెలివిజన్ టాక్ షో 'గుడ్ మార్నింగ్ అమెరికా'లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు రామ్‌చరణ్. హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డుల వేడుకలో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన ఈ షోలో సందడి చేశారు. ఇందులో భాగంగా 'ఆర్ఆర్ఆర్'తో పాటు వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు రామ్‌చరణ్. ''ఆర్ఆర్ఆర్' స్నేహం నేపథ్యంలో సాగుతుంది. మా దర్శకుడు రాజమౌళిని మేం ఇండియన్ స్పీల్‌బర్గ్ అని పిలుస్తాం. తన తర్వాతి చిత్రంతో ఆయన గ్లోబల్ సినిమాలోకి అడుగుపెడతారనుకుంటున్నాను. ఇక భారతీయ సినిమా చరిత్రలో తొలిసారి ఓ పాట ('ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..') బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్‌కి నామినేట్ కావడం మాకెంతో గర్వంగా ఉంది'' అన్నారు చరణ్. కాగా 'గుడ్ మార్నింగ్ అమెరికా' షోలో పాల్గొన్న తొలి తెలుగు నటుడు రామ్‌చరణ్ కావడం విశేషం. 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ రేసులో ఉన్న నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా యూనిట్ అక్కడకు వెళుతోంది. చరణ్ కూడా అందుకే వెళ్లారని, ఎన్టీఆర్ కూడా వెళతారని టాక్.

200 థియేటర్స్‌లో రీ రిలీజ్.. ఆస్కార్ అవార్డ్స్ వేడుక మార్చి 12 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13)న లాస్ ఏంజిల్స్‌లో జరగనుంది. అవార్డ్స్ వేడుకకు పది రోజుల ముందు (మార్చి 3న) అమెరికాలోని 200 థియేటర్లలో 'ఆర్ఆర్ఆర్'ని రీ రిలీజ్ చేయనున్నట్లు వేరియన్స్ ఫిలింస్ ప్రకటించింది. డిమాండ్‌ని బట్టి థియేటర్ల సంఖ్య పెంచుతామని కూడా ఆ సంస్థ తెలిపింది.


అమెరికాకు ఉపాసన.. ప్రముఖ అమెరికన్ గైనకాలజిస్ట్ జెన్నిఫర్ ఆస్టన్ 'గుడ్ మార్నింగ్ అమెరికా' షోలో కో హోస్ట్‌గా పాల్గొన్నారు. ఈ షోలో రామ్‌చరణ్‌ని 'త్వరలో తండ్రి కాబోతున్నారు.. ఆ అనుభూతి ఎలా ఉంది?' అని అడగ్గా.. 'ఇన్నేళ్ల పాటు ఉపాసనకు నేను అంతగా దొరికేవాణ్ణి కాదు.. ఇప్పుడు తప్పడం లేదు (నవ్వుతూ). జెన్నిఫర్ ఆస్టన్‌ను కలవడం హ్యాపీగా ఉంది. మీ ఫోన్ నంబర్ ఇవ్వండి. నా భార్య ఉపాసన త్వరలో అమెరికా వస్తుంది'' అన్నారు. 'మీతో జర్నీకి నేను రెడీ. మీ తొలి బేబీకి ప్రసవం చేయడం నాకు గౌరవమే'' అన్నారు జెన్నిఫర్ ఆస్టన్. దీంతో ఉపాసన డెలివరీ అమెరికాలోనే అనే వార్త వైరల్‌గా మారింది.

కనుల చాటు మేఘమా...



● నాగశౌర్య, మాళవిక

నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహించారు. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా మార్చి 17న రిలీజ్ కానుంది. కళ్యాణీ మాలిక్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'కనుల చాటు మేఘమా..' అంటూ సాగే మొదటి పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు లక్ష్మీ భూపాల సాహిత్యం అందించగా ఆభాస్ జోషి పాడారు. రఘు మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ– ''ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' కథ అనుకున్నాక కళ్యాణీ మాలిక్‌గారితో 'ఒక లవ్ స్టోరీ చేస్తున్నాం.. దానికి మంచి పాట కావాలి' అన్నాను. ఆయన అద్భుతమైన మెలోడీని స్వరపరిచారు'' అన్నారు. ''కనుల చాటు మేఘమా..' పాట ఇచ్చిన తృప్తి నా 20 ఏళ్ల సినీ జీవితంలో ఏ పాటా ఇవ్వలేదు'' అన్నారు కళ్యాణీ మాలిక్.



● రెజీనా

రెండు కాలాలతో...

రెజీనా ప్రధాన పాత్రలో కార్తీక్ రాజు దర్శకత్వంలో రాజశేఖర్ వర్మ నిర్మించిన చిత్రం 'నేనే నా'. ఈ చిత్రం ప్రపంచవ్యాప్త థియేట్రికల్, నాన్-థియేట్రికల్ రైట్స్‌ని ఎస్పీ సినిమాస్ దక్కించుకుంది. ''1920, ప్రస్తుతం.. ఇలా రెండు విభిన్న కాలాల నేపథ్యంలో రూపొందించిన ఫ్యాంటసీ అడ్వంచరస్ థ్రిల్లర్ ఇది. ఇందులో రెజీనా పురావస్తు శాస్త్రవేత్త పాత్ర చేశారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ వేసవిలో సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్.

తల్లితండ్రులు.. పిల్లలకు సందేశం




● అమీర్తా, సాత్విక్, మంజీరా

సాత్విక్ వర్మ, జాక్ రాబిన్‌సన్, మంజీరా రెడ్డి, అమీర్తా హల్దర్ హీరో హీరోయిన్లుగా ముత్తు యం. దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చిక్లెట్స్'. తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసన్ గురు నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రామ్ కార్తీక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''చిక్లెట్స్' ట్రైలర్ చాలా బాగుంది. పిల్లలకు, పేరెంట్స్‌కి మంచి సందేశం ఇచ్చేలా తెరకెక్కిన ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలి'' అన్నారు. ముత్తు యం. మాట్లాడుతూ– ''1990 జనరేషన్‌కి చెందిన పేరెంట్స్‌కు, 20కె జనరేషన్ పిల్లలకు మధ్య జరుగుతున్నటువంటి సంఘర్షణని ఈ సినిమాలో చూపించాం. ఇందులో లవ్, ఎంటర్‌టైన్మెంట్, ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు. ''తల్లితండ్రులు, పిల్లలకు మధ్య ఉన్న అన్ని భావోద్వేగాలు మా సినిమాలో ఉన్నాయి'' అన్నారు శ్రీనివాసన్ గురు. లైన్ ప్రొడ్యూసర్ డానియల్, దర్శకుడు శివమ్ మాట్లాడారు.

తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి.
ఎన్ని వచ్చినా ఈ 'అనుబంధం' ఎవర్ గ్రీన్. అందుకే ఈ రిలేషన్ చుట్టూ కొత్త కథలు అల్లుకుని సినిమాలు తీస్తుంటారు.
'నాన్నకు ప్రేమతో' అంటూ ఈ అనుబంధం నేపథ్యంలో కొన్ని సినిమాలు రానున్నాయి. ఆ విశేషాలు తెలుసుకుందాం.



● కియారా, రామ్‌చరణ్




● కమల్‌హాసన్



● ప్రభాస్

నాన్నకు ప్రేమతో....



● రణ్‌బీర్ కపూర్



● సుధీర్‌బాబు

★ కమల్‌హాసన్ తండ్రీకొడుకుగా రెండు పాత్రలు చేసిన ఓ చిత్రం 'ఇండియన్' (భారతీయుడు). 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి, అతని తనయుడు, ప్రభుత్వ ఉద్యోగి చంద్రబోస్ సేనాపతి పాత్రల్లో కమల్‌హాసన్ ద్విపాత్రాభినయం చేశారు. దేశభక్తుడైన సేనాపతి లంచగొండి అయిన తన తనయుడు చంద్రబోస్‌ను హత్య చేయడం ఈ సినిమాకే ప్రధాన హైలైట్. భారీ ఎత్తున ప్రేక్షకాదరణ పొందిన ఈ 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా పాతికేళ్ల తర్వాత కమల్‌హాసన్, శంకర్ 'ఇండియన్ 2' చేస్తున్నారు. ఈ సినిమా కూడా ప్రధానంగా తండ్రీకొడుకుల నేపథ్యంలోనే సాగుతుందని తెలిసింది. ఇండియన్ సినిమాలో మాదిరిగానే 'ఇండియన్ 2'లో కూడా కమల్ హాసన్ తండ్రీకొడుకుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారని కోలీవుడ్ టాక్. కథలోని కీలక సన్నివేశాలు 1920 నేపథ్యంలో ఉంటాయని తెలిసింది. అంటే కథ.. స్వాతంత్ర్యానికి పూర్వం సేనాపతి, అతని తండ్రికి ఉన్న అనుబంధం నేపథ్యంలో ఉంటుందన్నట్లుగా ఈ చిత్రరచయితల్లో ఒకరైన జయ మోహన్ ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలనుకుంటున్నారు.

★ ప్రభాస్ చేస్తున్న తాజా చిత్రాల్లో 'సలార్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే రెండు లుక్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రంలో ప్రభాస్ డ్యూయల్ రోల్ చేస్తున్నారని వినికిడి. అలాగే ఈ సినిమా కథకు తండ్రీకొడుకుల సెంటిమెంట్‌ను జోడించారట ప్రశాంత్ నీల్. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తండ్రి బాధ్యతను కొనసాగించి, సక్సెస్ అయ్యే కొడుకు పాత్రలో ప్రభాస్ కనిపిస్తారన్నది ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రం సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది.

★ దర్శకుడు శంకర్, హీరో రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. కథాంశం తండ్రీతనయుల అనుబంధమేనట. ఈ రెండు పాత్రలనూ చరణే చేస్తున్నారు. ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఓ వ్యక్తి శ్రమిస్తాడు. కానీ కొందరు స్వార్థపరుల కారణంగా అతనికి అన్యాయం జరుగుతుంది. ఆ తర్వాతి కాలంలో ఆ వ్యక్తి తనయుడు ఐఏఎస్ ఆఫీసర్ అవుతాడు. తండ్రిని ఇబ్బంది పెట్టినవారిని శిక్షిస్తూనే, డబ్బు, స్వార్థం లేని రాజకీయాల కోసం ప్రజలు ఎలా చైతన్యవంతులై ఉండాలి? ఐఏఎస్ ఆఫీసర్లు ఏ విధంగా విధులు నిర్వర్తించాలి? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

★ సుధీర్‌బాబు ప్రస్తుతం 'మామా మశ్చీంద్ర' అనే సినిమా చేస్తున్నారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రధానంగా తండ్రీకొడుకుల ఎమోషన్ నేపథ్యంలో సాగుతుందని, ఇందులో మూడు డిఫరెంట్స్ లుక్స్‌లో సుధీర్‌బాబు కనిపిస్తారని టాక్.

★ తండ్రీకొడుకుల ఎమోషన్ నేపథ్యంలో సాగే చిత్రాలు బాలీవుడ్‌లోనూ కొన్ని ఉన్నాయి. ప్రధానంగా చెప్పుకోవాల్సిన చిత్రం 'యానిమల్'. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తండ్రి కోసం గ్యాంగ్‌స్టర్‌గా మారే ఓ యువకుడి కథే 'యానిమల్' అని బాలీవుడ్ టాక్. ఇందులో రణ్‌బీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ కనిపిస్తారని సమాచారం.

గ్రాండ్ సాంగ్.. భారీ ఫైట్



● ప్రభాకర్

'బాహుబలి' ప్రభాకర్ ప్రధాన పాత్రలో పాలిక్ (పాలిక్ శ్రీనివాసా చారి) దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. రమేష్ రావుల నిర్మిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో 'బాహుబలి' ప్రభాకర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నా పాత్ర కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం ఫైట్ సీన్ షూటింగ్ జరుగుతోంది'' అన్నారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నాం. ప్రభాకర్‌పై ఓ పాటను గ్రాండ్‌గా చిత్రీకరించాం. ఇప్పుడు రవి మాస్టర్ సారథ్యంలో ప్రభాకర్‌పై భారీ ఫైట్ చిత్రీకరిస్తున్నాం. వింద్యారెడ్డి మంచి కథ అందించారు. జాన్ భూషణ్ మూడు అద్భుతమైన పాటలిచ్చారు'' అన్నారు పాలిక్. ''మార్చిలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు రమేష్ రావుల.

ప్రేమ.. వినోదం..



● కృష్ణ, అర్చన

''మిస్టర్ కళ్యాణ్' మూవీ ట్రైలర్ బాగుంది. మేకింగ్, లొకేషన్స్, డైలాగ్స్ అన్నీ బాగున్నాయి. ఈ సినిమా మంచి విజయం సాధించి దర్శకుడు పండు, నిర్మాత ఎన్వీ సుబ్బారెడ్డి మరిన్ని మంచి సినిమాలు చేయాలి'' అని డైరెక్టర్ నక్కిన త్రినాథరావు అన్నారు. మాన్యం కృష్ణ, అర్చన జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ కళ్యాణ్'. పండు దర్శకత్వంలో ఉషశ్రీ సమర్పణలో ఎన్వీ సుబ్బారెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ని నక్కిన త్రినాథరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పండు, ఎన్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ– ''ఫ్యామిలీ, లవ్, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'మిస్టర్ కళ్యాణ్'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
139	43
59,606	17,511

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	11,461	▽	46
డోజోన్స్	32,814	▽	232
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,908	▽	23
డాక్స్	15,476	△	76
షాంఘై	3,287	▽	4
నిక్కాయ్ (బుధవారం ముగింపు)	27,104	▽	369

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	56,080 ▽ 416
బంగారం (22 క్యారెట్)	55,855 ▽ 415
వెండి (కిలో)	65,182 ▽ 804

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.03	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.30	101.64
€	యూరో	ఎస్‌బీఐ	86.49	89.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.52	62.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.53	57.89
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.94	62.92
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.01	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.87	12.94

క్రిప్టోల కట్టడికి అంతర్జాతీయ విధానం అవసరం




అమెరికా ఆర్థిక మంత్రి జేనెట్ యెలెన్‌తో నిర్మలా సీతారామన్ భేటీ

- ఆర్థిక మంత్రి సీతారామన్ వెల్లడి
- జీ20 మంత్రులతో చర్చలు

న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ విధానం అవసరమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే అంతర్జాతీయ రుణ సమస్యలను ఎదుర్కొనేందుకు, బహుళపక్ష అభివృద్ధి బ్యాంకులను పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. జీ20 మంత్రుల సమావేశానికి ముందు అమెరికా, జపాన్, స్పెయిన్ తదితర దేశాల ఆర్థిక మంత్రులతో ఆమె ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇందులో పలు అంశాలు చర్చించారు. శుక్రవారం నుంచి 2 రోజుల పాటు జరిగే జీ20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల (ఎఫ్‌ఎంసీబీజీ) సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాల నేతలు భారత్ వచ్చారు. ఈ సందర్భంగా అమెరికా ఆర్థిక మంత్రి జేనెట్ యెలెన్, జపాన్ ఫైనాన్స్ మినిస్టర్ షునిచి సుజుకీ తదితరులతో సీతారామన్ భేటీ అయ్యారు. సార్వభౌమ రుణాల పునర్‌వ్యవస్థీకరణలో భారత్ కీలక పాత్ర పోషిస్తుండటంపై యెలెన్ అభినందించినట్లు అమెరికా ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కొత్త బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు చోటేది?

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శ



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల మొదట్లో ప్రవేశపెట్టిన 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఉపాధి కల్పనకు 'తగినంత ప్రాధాన్యత' ఇవ్వలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు పేర్కొన్నారు. వృద్ధిరేటు ఉద్యోగాలను సృష్టిస్తుందనే విశ్వాసం అయితే ఉందికానీ, నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి ఈ విశ్వాసం ఒక్కటే దోహదపడబోదని ఆయన అభిప్రాయపడ్డారు. కోవిడ్‌కు ముందు కూడా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ఆయన పేర్కొంటూ, మహమ్మారి ఫలితంగా ఇది మరింత ఆందోళనకరంగా మారిందని ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. దువ్వూరి అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

- ఉద్యోగాలపై (2023–24 బడ్జెట్‌లో) తగినంత ప్రాధాన్యత లేకపోవడంతో నేను నిరాశ చెందాను. కేవలం వృద్ధితోనే ఉపాధి కల్పనను సాధించలేము. మనకు ఉపాధి కల్పనే ధ్యేయంగా జరిగే వృద్ధి అవసరం.
- ప్రతి నెలా దాదాపు లక్ష మంది శ్రామిక శక్తిలో చేరుతున్నారు. అయితే వారిలో సగానికి కూడా భారత్ ఉద్యోగాలను కూడా సృష్టించలేకపోతోంది. ఫలితంగా నిరుద్యోగ సమస్య పెరగడమే కాకుండా సంక్షోభంగా మారుతోంది.
- భారీ సంఖ్యలో యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించగలిగినప్పుడే, దేశంలోని అధిక యువత ద్వారా ప్రయోజనం ఉంటుంది.
- ఎన్నికల కారణంగా 2023–24 బడ్జెట్ ప్రజాకర్షక చర్యలతో ఉంటుందని భావించారు. అయితే ఇందుకు భిన్నంగా వృద్ధి, ద్రవ్యలోటు కట్టడిపైనా బడ్జెట్ దృష్టి సారించడం కొంత హర్షణీయ అంశం.

ఉపాధికి బడ్జెట్ ప్రోత్సాహం: ఆర్థికశాఖ

కాగా, ఆర్థిక మంత్రిత్వశాఖ గురువారం నెలవారీ సమీక్షను విడుదల చేస్తూ, బడ్జెట్‌లో చేసిన ప్రకటనలు వృద్ధిని, ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని పేర్కొనడం గమనార్హం. మూలధన పెట్టుబడుల పెంపు, గ్రీన్ ఎకానమీకి ప్రోత్సాహం, ఫైనాన్షియల్ మార్కెట్ల పటిష్టానికి చొరవలు వంటి అంశాలు వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడతాయని ఆర్థికశాఖ సమీక్ష పేర్కొంది.

ఐఐటీ మద్రాస్‌లో సింథటిక్ వజ్రాల ల్యాబ్

5 ఏళ్లలో రూ. 243 కోట్లు వెచ్చింపు



న్యూఢిల్లీ: దేశీయంగా సింథటిక్ వజ్రాల తయారీకి సంబంధించిన సెంటర్‌ను (ఇన్‌సెంట్–ఎల్‌జీడీ) ఐఐటీ–మద్రాస్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. దీనికి 5 ఏళ్లలో సుమారు రూ. 243 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొంది. దేశీయంగా సింథటిక్ వజ్రాల తయారీ పరిశ్రమకు, వ్యాపారవేత్తలకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించేందుకు ఈ ప్రాజెక్టు తోడ్పడుతుందని వివరించింది. స్టార్టప్‌లకు చౌకగా టెక్నాలజీని అందించేందుకు, ఉపాధి అవకాశాలను .. ఎల్‌జీడీ ఎగుమతులను పెంచేందుకు ఇన్‌సెంట్–ఎల్‌జీడీలో పరిశోధనలు ఉపయోగపడగలవని వాణిజ్య శాఖ తెలిపింది. ల్యాబ్స్‌లో తయారయ్యే వజ్రాలను ఆభరణాల పరిశ్రమలోనే కాకుండా కంప్యూటర్ చిప్‌లు, ఉపగ్రహాలు, 5జీ నెట్‌వర్క్‌లు మొదలైన వాటిల్లోనూ ఉపయోగిస్తారు. అంతర్జాతీయంగా ఈ మార్కెట్ 2020లో బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. 2025 నాటికి సింథటిక్ డైమండ్ ఆభరణాల మార్కెట్ 5 బిలియన్ డాలర్లకు, 2035 నాటికి 15 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందన్న అంచనాలు ఉన్నాయి. 2021–22లో వీటికి సంబంధించి అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌కు 25.8% వాటా ఉంది. కెమికల్ వేపర్ డిపోజిషన్ (సీవీడీ) టెక్నాలజీతో వజ్రాలను తయారు చేసే టాప్ దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. అయితే, కీలక యంత్ర పరికరాలు, ముడి వనరు అయిన సీడ్స్ కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది.

మార్కెట్‌కు వడ్డీరేట్ల పెంపు భయం

- అయిదోరోజూ అమ్మకాలే
- నాలుగు నెలల కనిష్టానికి నిఫ్టీ



ముంబై: వడ్డీరేట్ల పెంపు భయాలు వెంటాడటంతో స్టాక్ సూచీలు వరుసగా అయిదోరోజూ నష్టపోయాయి. ఆసియా మార్కెట్లలో బలహీనతలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఫిబ్రవరి నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో తీవ్ర ఒడిదుడుకుల ట్రేడింగ్ చోటు చేసుకుంది. ముఖ్యంగా ద్రవ్యోల్బణ కట్టడికి కఠిన ద్రవ్య విధాన వైఖరిని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫెడ్ రిజర్వ్, ఆర్‌బీఐ మినిట్స్‌లో వెల్లడి కావడం ఇన్వెస్టర్లను కలవరపెట్టింది. ఇంట్రాడేలో 554 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ 139 పాయింట్లు నష్టపోయి 59,606 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 59,406 కనిష్టాన్ని, 59,960 గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 43 పాయింట్లు తగ్గి 17,511 వద్ద నిలిచింది. ఈ ముగింపు నిఫ్టీకి నాలుగు కనిష్ట స్థాయి. రోజంతా 17,455–17,620 పాయింట్ల శ్రేణిలో ట్రేడైంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు మాత్రమే స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. రియల్టీ, ఇంధన, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ, ఆటో, బ్యాంకింగ్, ఇంధన షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.40 %, 0.10 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1586 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1417 కోట్ల షేర్లను కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 15 పైసలు నష్టపోయి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ఇంట్రాడేలో 14% నష్టపోయి రూ.177 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. ఈ సంస్థపై దివాళా పరిష్కార చర్యలు చేపట్టేందుకు ఇండస్ఇండ్ బ్యాంక్‌కు ఎన్‌సీఎల్‌టీ అనుమతులు ఇవ్వడం షేరు పతనానికి కారణమైంది. చివరికి 3.5% నష్టంతో రూ.199 వద్ద నిలిచింది.
- అదానీ గ్రూప్‌లోని పదింటిలో ఎనిమిది కంపెనీల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ 5 శాతం చొప్పున పతనమయ్యాయి. అదానీ విల్మార్ 3.41%, ఏసీసీ 0.81%, ఎన్డీటీవీ స్వల్పంగా నష్టపోయాయి. అయితే అదానీ పోర్ట్స్ 1.19%, అంబుజా సిమెంట్స్ 0.69% లాభపడ్డాయి.

ఒలెక్ట్రా హైడ్రోజన్ బస్

త్వరలో భారత్ రోడ్ల పైకి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌కు (ఎంఈఐఎల్) చెందిన ఎలక్ట్రిక్ వాహన రంగ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ హైడ్రోజన్‌తో నడిచే బస్‌ను తయారు చేసింది. రిలయన్స్ భాగస్వామ్యంతో ఈ వాహనాన్ని రూపొందించినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. ఏడాదిలోగా వాణిజ్యపరంగా వీటి ఉత్పత్తి ప్రారంభించాలని ఒలెక్ట్రా లక్ష్యంగా చేసుకుంది. పూర్తి ఇంధన సామర్థ్యంతో 400 కిలోమీటర్ల వరకు ప్రయాణించడం బస్ ప్రత్యేకత.



బస్ పైభాగంలో టైప్–4 హైడ్రోజన్ సిలిండర్లను ఏర్పాటు చేశారు. 12 మీటర్ల పొడవు ఉన్న ఈ బస్సులో డ్రైవర్ సీటు కాకుండా ప్రయాణికులకోసం 32–49 సీట్లు ఏర్పాటు చేయవచ్చు. హైడ్రోజన్ నింపడానికి 15 నిమిషాలు పడుతుంది.

విదేశీ స్టాక్స్‌లో రికార్డు పెట్టుబడులు

- 2022లో 2.1 బిలియన్ డాలర్లు
- 12 నెలల కాలంలో గరిష్ట స్థాయి ఇది



న్యూఢిల్లీ: విదేశాల్లో భారతీయుల పెట్టుబడులు ఎప్పటికప్పుడు పెరుగుతూ పోతున్నాయి. 2022లో విదేశీ సెక్యూరిటీలు, ప్రాపర్టీ, డిపాజిట్లలో భారతీయులు చేసిన పెట్టుబడులు రికార్డు స్థాయిలో 2.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక 12 నెలల కాలంలో విదేశాల్లో భారతీయులు చేసిన అత్యధిక పెట్టుబడులు ఇవేనని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విభాగం వారీగా చూసుకున్నా కానీ గతేడాది పెట్టుబడులు అత్యధికంగా ఉన్నాయి. ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) కింద ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో 2,50,000 డాలర్లను విదేశాలకు పంపించుకోవచ్చు. విదేశీ యాత్రలు, విదేశీ విద్య, వైద్యం, పెట్టుబడులకు ఈ పరిమితి వర్తిస్తుంది. బహుమతులు, విరాళాలకూ ఇదే పరిమితి అమలవుతుంది. 2009కి ముందు 12 నెలల కాలంలో విదేశీ షేర్లు, ప్రాపర్టీలు, డిపాజిట్లలో భారతీయుల పెట్టుబడులు 350 మిలియన్ డాలర్లుగానే ఉండడం గమనించొచ్చు. 2022 డిసెంబర్‌తో అంతమైన 12 నెలల కాలంలో విదేశీ ఈక్విటీ లేదా డెట్‌లో పెట్టుబడులు రికార్డు స్థాయిలో 969.50 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. డిసెంబర్ నెల వరకే చూసుకున్నా ఇలా విదేశాలకు వెళ్లిన పెట్టుబడులు 120 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

స్టాక్స్ పట్ల ఎక్కువ ఆసక్తి

ముఖ్యంగా విదేశీ స్టాక్స్ పట్ల భారతీయులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో బ్రోకరేజీ సంస్థలు విదేశీ బ్రోకరేజీలతో ఒప్పందాలు చేసుకుని పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ తదితర షేర్లలో దేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెడుతున్నారు. మ్యూచువల్ ఫండ్స్ మార్గంలో ఈ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. 2022 డిసెంబర్ నాటికి మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు పోర్ట్‌ఫోలియోలో రూ.27,055 కోట్ల విలువైన విదేశీ స్టాక్స్‌ను కలిగి ఉన్నాయి. అది ఈ ఏడాది జనవరి చివరికి రూ.29,012 కోట్లకు వృద్ధి చెందింది. విదేశీ పెట్టుబడుల పరంగా మ్యూచువల్ ఫండ్స్‌కు కొన్ని నియంత్రణపరమైన పరిమితులు ఉన్నాయి. ఫండ్స్ విదేశీ పెట్టుబడుల విలువ అనుమతించిన గరిష్ట స్థాయికి చేరిపోవడంతో.. తాజా పెట్టుబడుల స్వీకరణను సెబీ నిలిపివేసింది. పైగా విదేశాలకు పంపించే మొత్తం రూ.7 లక్షలకు మించితే మొదట్లోనే 20 శాతాన్ని టీడీఎస్ కింద మినహాయించాలంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన విదేశీ పెట్టుబడులకు పెద్ద ప్రతిబంధకం అవుతుందన్నది నిపుణుల అభిప్రాయంగా ఉంది. సాధారణంగా ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే విదేశాలకు పంపించే మొత్తం ఎక్కువగా ఉంటుంది.

సాక్షి స్పోర్ట్స్

ఫైనల్లో రోహన్ బోపన్న జోడీ

ఖతర్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దోహాలో గురువారం జరిగిన సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–4, 6–3తో డేనియల్ ఇవాన్స్–జానీ ఒమారా (బ్రిటన్) జంటపై విజయం సాధించింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌లో మూడు బ్రేక్ పాయింట్లు సాధించారు.



షూటర్ అనీశ్‌కు కాంస్యం

కైరోలో జరిగిన ప్రపంచకప్ షూటింగ్ టోర్నీని భారత్ కాంస్య పతకంతో ముగించింది. చివరిరోజు గురువారం భారత్‌కు అనీశ్ భన్వాలా కాంస్య పతకం అందించాడు. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్లో అనీశ్ 21 పాయింట్లు స్కోరు మూడో స్థానంలో నిలిచాడు.



విజయం దూరమైంది...

2017 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్... 2018 టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్... 2020 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్... 2022 కామన్వెల్త్ గేమ్స్ ఫైనల్... గత కొన్నేళ్లుగా భారత మహిళల క్రికెట్ జట్టుకు వేదన మిగులుతున్న నాకౌట్ మ్యాచ్‌ల పరాజయాల జాబితాలో మరొకటి చేరింది. ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాతో పోరులో చివరి వరకు పోరాడినా మన జట్టుకు ఓటమి తప్పలేదు. తాజా టీ20 వరల్డ్‌కప్‌లో మన జట్టు ప్రస్థానం సెమీస్‌కే పరిమితమైంది. రెండు మెరుపు బ్యాటింగ్ ప్రదర్శనలు గెలుపు ఆశలు రేపినా... గెలుపు గీత దాటలేక జట్టు నిరాశగా నిష్క్రమించింది.

- మహిళల టీ20 ప్రపంచకప్ సెమీస్‌లో భారత్ ఓటమి
- 5 పరుగులతో ఆస్ట్రేలియా విజయం
- హర్మన్, జెమీమా పోరాటం వృథా





హర్మన్ రనౌట్‌తో...

మ్యాచ్‌కు కొద్దిసేపు క్రితం వరకు కూడా జ్వరం కారణంగా ఆడలేని స్థితిలో ఉన్న కెప్టెన్ హర్మన్ పట్టుదలగా బరిలోకి దిగింది. మెరుపు బ్యాటింగ్‌తో విజయానికి చేరువగా తెచ్చింది. విజయం కోసం 33 బంతుల్లో 41 పరుగులు కావాలి. ఈ దశలో రెండో పరుగుకు ప్రయత్నిస్తూ క్రీజ్‌లో చేరే సమయంలో బ్యాట్ పిచ్‌లో ఇరుక్కుపోవడంతో హర్మన్ దురదృష్టవశాత్తూ రనౌట్‌గా వెనుదిరిగింది. దాంతో ఆట ఆసీస్ వైపు మొగ్గింది.





ఆ క్యాచ్‌లు పట్టి ఉంటే...

ఫీల్డింగ్‌లో వదిలేసిన రెండు క్యాచ్‌లు భారత్‌ను నష్టపరిచాయి. లానింగ్ 1 వద్ద ఇచ్చిన క్యాచ్‌ను కీపర్ రిచా, 32 వద్ద మూనీ క్యాచ్‌ను షఫాలీ వర్మ వదిలేశారు. వీటి నష్టం ఏకంగా 70 పరుగులు! వీటిని పట్టి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో.

కేప్‌టౌన్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఆట ముగిసింది. గత టోర్నీ రన్నరప్ అయిన భారత్ ఈసారి సెమీఫైనల్లో ఆసీస్‌కే తలవంచింది. గురువారం ఆసక్తికరంగా జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 5 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. బెత్ మూనీ (37 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్), మెగ్ లానింగ్ (34 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లీ గార్డ్‌నర్ (18 బంతుల్లో 31; 5 ఫోర్లు) ఆసీస్ స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 43; 6 ఫోర్లు) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. ఆసీస్‌కు ఇది ఏడో ఫైనల్ కాగా, నేడు ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో ఆదివారం తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు తలపడుతుంది.

లానింగ్ జోరు...

ఆస్ట్రేలియాకు ఓపెనర్లు అలీసా హీలీ (26 బంతుల్లో 25; 3 ఫోర్లు), మూనీ శుభారంభం అందించారు. రేణుక వేసిన తొలి బంతినే హీలీ ఫోర్‌గా మలచడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ప్రారంభమైంది. తొలి వికెట్‌కు 52 పరుగులు (45 బంతుల్లో) జోడించిన అనంతరం రాధా యాదవ్ బౌలింగ్‌లో హీలీ స్టంపౌట్ అయింది. అనంతరం మూనీ, లానింగ్ కలిసి జట్టును నడిపించారు. భారత ఫీల్డర్లు వదిలేసిన రెండు క్యాచ్‌లు కూడా వీరికి కలిసొచ్చాయి. సగం ఇన్నింగ్స్ ముగిసేసరికి ఆసీస్ 69 పరుగులకు చేరింది. అయితే ఆ తర్వాత ఆస్ట్రేలియా జోరు పెంచింది. శిఖా ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన మూనీ అదే ఓవర్లో వెనుదిరిగినా... స్నేహ్ రాణా ఓవర్లో లానింగ్, రాధ ఓవర్లో గార్డ్‌నర్ రెండేసి ఫోర్లు కొట్టారు. చివర్లో ఐదు బంతుల వ్యవధిలో భారత్ 2 కీలక వికెట్లు తీసినా... రేణుక వేసిన ఆఖరి ఓవర్లో 2 సిక్స్‌లు, 1 ఫోర్‌తో 18 పరుగులు రాబట్టి లానింగ్ ఘనంగా ముగించింది. చివరి 10 ఓవర్లలో ఆస్ట్రేలియా 103 పరుగులు సాధించగా... ఇందులో ఆఖరి 5 ఓవర్లలో వచ్చిన 59 పరుగులు ఉన్నాయి.

కీలక భాగస్వామ్యం...

భారీ ఛేదనలో భారత్ ఆరంభంలోనే తడబడింది. 4 ఓవర్లు ముగిసేలోపే 28 పరుగులకు టాప్–3 బ్యాటర్లు షఫాలీ (9), స్మృతి మంధాన (2), యస్తిక భాటియా (4) పెవిలియన్ చేరారు. ఈ దశలో జెమీమా, హర్మన్ భాగస్వామ్యం గెలుపుపై ఆశలు రేపింది. వీరిద్దరు ఒకరితో మరొకరు పోటీ పడి ధాటిగా ఆడారు. వీరి దూకుడుకు ఆసీస్ బౌలర్లు కొద్దిసేపు అచేతనంగా మారిపోయారు. అయితే ఇదే జోరులో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి జెమీమా వెనుదిరిగింది. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 41 బంతుల్లోనే 69 పరుగులు జోడించారు. మరో వైపు హర్మన్ మాత్రం తగ్గకుండా చక్కటి షాట్లతో దూసుకుపోయింది. 36, 37 పరుగుల వద్ద కీపర్ హీలీ తన క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన హర్మన్ 32 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే కీలక దశలో హర్మన్ రనౌట్ కావడం భారత్ అవకాశాలను దెబ్బ తీసింది. చివర్లో రిచా (14), దీప్తి శర్మ (17 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు) పోరాడినా విజయానికి అది సరిపోలేదు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలీసా హీలీ (స్టంప్డ్) రిచా (బి) రాధ 25; మూనీ (సి) షఫాలీ (బి) శిఖా 54; లానింగ్ (నాటౌట్) 49; గార్డ్‌నర్ (బి) దీప్తి 31; హారిస్ (బి) శిఖా 7; ఎలీస్ పెర్రీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు)** 172. **వికెట్ల పతనం:** 1–52, 2–88, 3–141, 4–148. **బౌలింగ్:** రేణుకా సింగ్ 4–0–41–0, దీప్తి శర్మ 4–0–30–1, శిఖా పాండే 4–0–32–2, రాధ యాదవ్ 4–0–35–1, స్నేహ్ రాణా 4–0–33–0.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీ) (బి) షుట్ 9; స్మృతి (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 2; యస్తిక (రనౌట్) 4; జెమీమా (సి) హీలీ (బి) బ్రౌన్ 43; హర్మన్‌ప్రీత్ (రనౌట్) 52; రిచా (సి) తాలియా (బి) బ్రౌన్ 14; దీప్తి (నాటౌట్) 20; స్నేహ్ రాణా (బి) జొనాసెన్ 11; రాధ (సి) పెర్రీ (బి) గార్డ్‌నర్ 0; శిఖా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 167. **వికెట్ల పతనం:** 1–11, 2–15, 3–28, 4–97, 5–133, 6–135, 7–157, 8–162. **బౌలింగ్:** యాష్లీ గార్డ్‌నర్ 4–0–37–2, షుట్ 4–0–34–1, డార్సీ బ్రౌన్ 4–0–18–2, ఎలీస్ పెర్రీ 1–0–14–0, జొనాసెన్ 3–0–22–1, వేర్‌హామ్ 3–0–29–0, తాలియా మెక్‌గ్రాత్ 1–0–13–0.

ఫైనల్లో సీకామ్ డిగ్రీ కాలేజి

- వరుసగా రెండు విజయాలతో తుది పోరుకు అర్హత
- సాక్షి ప్రీమియర్ లీగ్ ఆంధ్రప్రదేశ్ రీజియన్ టోర్నీ



చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం క్రికెట్ టోర్నీలో శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ (సీకామ్) డిగ్రీ కాలేజి (తిరుపతి) జట్టు రెండు వరుస విజయాలతో ఫైనల్లోకి దూసుకెళ్లింది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ (సీకామ్) డిగ్రీ కాలేజి (తిరుపతి) 75 పరుగుల తేడాతో ఎంవీజీఆర్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)పై గెలిచింది. మొదట సీకామ్ కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. ధరణి కుమార్ (21 బంతుల్లో 55 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), శశాంక్ శ్రీవాస్ (23 బంతుల్లో 43 పరుగులు; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టారు. అనంతరం 149 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంవీజీఆర్ కాలేజి 9 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసి ఓడిపోయింది. రవికిరణ్ (20; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సీకామ్ బౌలర్లలో షాలు నవాజ్ 3 వికెట్లు, ఆశిష్, నవీన్‌లు చెరో రెండు వికెట్లతో ఆకట్టుకున్నారు. ధరణి కుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి (ఏలూరు)తో జరిగిన రెండో మ్యాచ్‌లో సీకామ్ కాలేజి 'సూపర్ ఓవర్'లో గెలిచింది. తొలుత సీఆర్ రెడ్డి కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. వై.కృష్ణ (27; 3 ఫోర్లు), నాగ వెంకట్ (19; 2 ఫోర్లు) రాణించారు. అనంతరం సీకామ్ కాలేజీ కూడా నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి సరిగ్గా 76 పరుగులు చేయడంతో మ్యాచ్ 'టై' అయింది. చివరి బంతికి ఆయూబ్ ఫోర్‌తో స్కోరు సమమైంది. 'సూపర్ ఓవర్'లో సీకామ్ కాలేజి 21 పరుగులు చేయగా... సీఆర్ రెడ్డి కాలేజి ఐదు పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది.

ఎన్‌ఆర్‌ఐ ఆల్‌రౌండ్ షో

రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం మొదటి మ్యాచ్‌లో ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ) కేవలం పరుగు తేడాతో సాయి గణపతి కాలేజి (విశాఖపట్నం)పై గెలిచింది. మొదట ఎన్‌ఆర్‌ఐ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లకు 60 పరుగులు చేసింది. రేవంత్ 18 (3 ఫోర్లు), ఎం.రూపేష్ 16 (2 ఫోర్లు) రాణించారు. అనంతరం సాయి గణపతి కాలేజి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసి ఓడిపోయింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా మార్క్‌రమ్



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఐపీఎల్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఎయిడెన్ మార్క్‌రమ్‌ను నియమించారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన ఎస్‌ఏ20 లీగ్‌లో మార్క్‌రమ్ నాయకత్వంలో సన్‌రైజర్స్ యాజమాన్యానికే చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు విజేతగా నిలిచింది. ఈ లీగ్‌లో మార్క్‌రమ్ 366 పరుగులు చేయడంతోపాటు 11 వికెట్లు పడగొట్టాడు. గత ఐపీఎల్ సీజన్లలో మార్క్‌రమ్ 20 మ్యాచ్‌లు ఆడి 527 పరుగులు సాధించాడు. గత ఏడాది ఐపీఎల్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ సారథ్యంలో సన్‌రైజర్స్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ సీజన్‌కు సంబంధించిన వేలం సమయంలో సన్‌రైజర్స్ యాజమాన్యం విలియమ్సన్‌ను విడుదల చేసింది. వేలంలో గుజరాత్ టైటాన్స్ విలియమ్సన్‌ను కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ మార్చి 31 నుంచి మే 28 వరకు జరుగుతుంది.

ఆడ పిల్లలంటే వాటికీ వివక్షే

అత్యంత వేగంగా అంతరిస్తున్న ఓర్కా తిమింగలాలు

మగబిడ్డపై ఎక్కువ ప్రేమ చూపడం.. ఆడపిల్లపై వివక్ష చూపడమనేది మానవ సమాజంలో మాత్రమే కనిపించే అవలక్షణం అనుకుంటాం. కానీ.. మగ పిల్లవానిపై మమకారంతో జీవితంలో మరో బిడ్డకు జన్మనివ్వని జాతులు సైతం ఈ సృష్టిలో ఉన్నాయి. ఆ జాబితాలో ఓర్కా తిమింగలాలు ముందు వరసలో ఉన్నాయట. ఈ కారణంగా ఆ జాతి తిమింగలాల ఉనికికే ప్రమాదం ముంచుకొస్తోందనే విభ్రాంతికర వాస్తవం వెలుగులోకి వచ్చింది.

- మగబిడ్డ పుడితే దాదాపు 25 ఏళ్లు సాకుతాయి
- ఆడ బిడ్డను మాత్రం పుట్టిన కొన్ని నెలలకే వదిలేస్తాయి
- మగబిడ్డను సాకేందుకు మరో బిడ్డకు జన్మనివ్వకపోవడం వీటి ప్రత్యేకత
- ఫలితంగా వృద్ధి చెందని కిల్లర్ తిమింగలాల జాతి
- ప్రస్తుతం కేవలం 73 మాత్రమే మిగిలి ఉన్నాయట



సాక్షి, అమరావతి: పుత్ర ప్రేమతో వంశాన్నే నాశనం చేసుకున్న ధృతరాష్ట్రుడి గురించి మహాభారతంలో చదివే ఉంటారు. కానీ.. మగ బిడ్డలపై తల్లి ప్రేమ ఏకంగా ఓ జాతి మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఆ జాతే ఓర్కా తిమింగలాలు. వీటినే కిల్లర్ తిమింగలాలు అని కూడా పిలుస్తారు. పసిఫిక్ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో కనిపించే అరుదైన తిమింగలాలు ఇవి. అత్యంత తెలివైనవిగా గుర్తింపు పొందిన డాల్ఫిన్ జాతికి చెందిన ఓర్కా తిమింగలాల ప్రవర్తన అత్యంత సంక్లిష్టంగా ఉంటుంది. ఫలితంగా వాటి ఉనికే పెను ప్రమాదంలో పడింది. మానవులు వాటిని వేటాడుతుండటమో.. శత్రు జీవుల నుంచి తలెత్తుతున్న ముప్పు వంటివి దీనికి కారణం కాదు. కేవలం మగ బిడ్డల పట్ల తల్లి తిమింగలాలకు మితిమీరిన మమకారమే కారణమన్నది ఆశ్చర్యకరమైన వాస్తవం.

గుంపునకు నాయకత్వం వహిస్తాడనే ఆశతో..

సగటున 70 ఏళ్లు జీవించే ఓర్కా తిమింగలాలు గుంపులుగా సంచరిస్తాయి. పాడ్స్ అని పిలిచే ఆ గుంపునకు ఓ బలమైన మగ తిమింగలం నేతృత్వం వహిస్తుంది. ప్రతి తల్లి తిమింగలం తాను కన్న మగ బిడ్డే ఆ గుంపునకు నాయకత్వం వహించాలని కోరుకుంటాయి. అందుకోసం తాము జన్మనిచ్చే మగ తిమింగలాల పట్ల విపరీతమైన మమకారాన్ని కనబరుస్తాయి. ఎంతగా అంటే ఆడబిడ్డను పెద్దగా పట్టించుకోవు. ఆడ తిమింగలం ఓ కాన్పులో ఒక బిడ్డకే జన్మనిస్తాయి. ఆడబిడ్డ పుడితే తల్లి తిమింగలం కేవలం 15 నెలల వరకే సాకుతుంది. ఆ తరువాత ఆడబిడ్డను వదిలేస్తుంది. మగబిడ్డ జన్మిస్తే మాత్రం తల్లి తిమింగలం చేసే హడావుడి అంతాఇంతా కాదు. మగ బిడ్డను ఎంతో సుకుమారంగా చూసుకుంటాయి. బిడ్డకు 20 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసు వరకు సాకుతాయి. అంతవరకు మగబిడ్డకు తల్లి తిమింగలమే ఆహారాన్ని తెచ్చి పెడుతుంది. తాను వేటాడి తెచ్చిన ఆహారంలో సగానికిపైగా మగబిడ్డకే తినిపిస్తుంది. తాను కన్న మగ తిమింగలమే ఆ గుంపునకు నాయకత్వం వహించాలని తల్లి తిమింగలం ఎంత చేయాలో అంతా చేస్తుంది.



జీవవైవిధ్యంలో ప్రధానమైనవి



ఓర్కా తిమింగలాలు అత్యంత అరుదైనవి. జీవ వైవిధ్యంలో అత్యంత ప్రధానమైనవి కూడా. మగబిడ్డను అత్యంత మమకారంతో సాకడం కోసం తల్లి తిమింగలం మరో బిడ్డకు జన్మనివ్వకపోవడమన్నది వీటిలోనే మనం గమనిస్తాం. దాంతో వాటి సంఖ్య ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. వాటిని పరిరక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు.

– ప్రొఫెసర్ భరతలక్ష్మి, జువాలజీ విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

మగ బిడ్డ పుడితే.. మరో బిడ్డకు జన్మనివ్వవు

మగ బిడ్డను బలంగా తయారు చేసేందుకు తల్లి తిమింగలాలు మరో పెద్ద నిర్ణయం తీసుకుంటాయి. ఓ సారి మగబిడ్డ పుడితే ఆ తల్లి తిమింగలం జీవితాంతం పిల్లల్ని కనదు. ఎందుకంటే ఆడ తిమింగలం గర్భధారణ సమయం 18 నెలలు. అంతకాలం తాను గర్భంతో ఉంటే అప్పటికే పుట్టిన మగబిడ్డను సక్రమంగా పెంచలేనని.. తగినంత ఆహారం అందించలేనని తల్లి తిమింగలం భావిస్తుంది. అందుకే మగబిడ్డ పుడితే తల్లి తిమింగలం మగ తిమింగలంతో జత కట్టవు. ఈ నిర్ణయమే ఓర్కా తిమింగలాల జాతికి పెనుముప్పుగాపరిణమిస్తోంది. ప్రధానంగా 1990 నుంచి క్రమంగా అంతరిస్తున్న వీటి ఉనికి 2005 తరువాత అత్యంత ప్రమాదంలో పడింది. ప్రస్తుతం ప్రపంచంలో ఓర్కా తిమింగలాలు కేవలం 73 మాత్రమే ఉన్నాయని లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెసర్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. వాటిలో కేవలం మూడు మాత్రమే గర్భంతో ఉండటం గమనార్హం. అంటే ఓర్కా తిమింగలాల్లో పునరుత్పత్తి గణనీయంగా తగ్గిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్నేళ్లలో ఓర్కా తిమింగలాలు కనుమరుగైపోతాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితి ఓర్కా తిమింగలాలను అత్యంత వేగంగా అంతరించిపోయే ప్రమాదం ఉన్న జీవుల జాబితాలో చేర్చి వాటి పరిరక్షణకు పరిశోధనలను ప్రోత్సహిస్తోంది.

ఓర్కా తిమింగలాల ప్రత్యేకతలు ఇవీ

- ఓర్కా తిమింగలాల పైభాగం ముదురు నలుపు రంగులోనూ.. కిందిభాగం స్వచ్ఛమైన తెలుపు రంగులో ఉండటంతోపాటు కళ్ల మీద దళసరిగా తెల్లని మచ్చ ఉంటుంది.
- ఇవి అత్యంత తెలివైన జీవులు. నోటితో ఈల వేస్తాయి. ఈలలు, సంజ్ఞలు, శబ్దాలు చేస్తూ పరస్పరం సంభాషించుకుంటాయి.
- మానవుల మాటలు, హావభావాలను సరిగా అర్థం చేసుకుంటాయి. మానవులతో అత్యంత స్నేహంగా ఉంటాయి.
- పసిఫిక్ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతం కిల్లర్ తిమింగలాల ఆవాసాలు.
- అమెరికాలోని అలస్కా, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, ఫ్లోరిడా రాష్ట్రాలు, ఒమన్ దేశంలో ఓర్కా తిమింగలాలను వీక్షించేందుకు ప్రత్యేక టూర్స్ నిర్వహిస్తున్నారు.
- మన దేశంలోని లక్షద్వీప్, అండమాన్ దీవులతోపాటు తమిళనాడు, పాండిచ్చేరి, మహారాష్ట్ర తీర ప్రాంతంలో అప్పుడప్పుడు ఈ తిమింగలాలు కనిపిస్తుంటాయి.

ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతం!



చంద్రునితోపాటు శుక్రుడు, గురుడు నింగిలో కనబడిన అద్భుత దృశ్యం గురువారం గుంటూరులో ఆవిష్కృతమైంది. ఆకాశంలో ఒకే వరుసలో గ్రహాలు కనబడటంతో ప్రజలు డాబాలు, అపార్ట్‌మెంట్‌లపైకెక్కి బైనాక్యులర్స్ పెట్టుకుని ఈ దృశ్యాన్ని వీక్షించారు. అరుదుగా కనిపించిన దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ఎందుకొచ్చారు?

ఢిల్లీకి వచ్చిన ఏపీ బీజేపీ నేతలపై పార్టీ ఏపీ ఇన్‌చార్జ్ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ బీజేపీ అసమ్మతి నేతలపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధరన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అంతర్గత విషయాలపై రచ్చకెక్కొద్దని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ వ్యవహారాలపై చర్చించాలనుకుంటే ఇద్దరు ముగ్గురు రావాలిగానీ.. ఇంతమంది ఢిల్లీకి ఎందుకొచ్చారని ప్రశ్నించారు. గురువారం ఢిల్లీకి వచ్చిన ఏపీ బీజేపీ ద్వితీయ శ్రేణి నాయకులతో 20 నిమిషాలపాటు మురళీధరన్ మాట్లాడి పంపించారు. తాను రాష్ట్రానికి వచ్చినప్పుడు కలవాలని, పార్టీ వ్యవహారాలపై సమీక్ష అప్పుడే చేద్దామని వారికి సూచించారు.

ఆరుగురికి జాతీయ సంగీత, నాటక అకాడమీ అవార్డులు

128 మంది కళాకారులకు అవార్డులు అందించిన రాష్ట్రపతి ముర్ము, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ సంగీతం సముద్రమంత విశాలమైనదని, మన నాటకాలు అజరామరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సంగీత, నాటకాల ద్వారా భారత సంస్కృతిని కాపాడేందుకు కృషి చేస్తున్న కళాకారుల జీవితాలు ధన్యమని అన్నారు. గురువారం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సంగీత, నాటక అకాడమీ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఘనంగా జరిగింది. కరోనా కారణంగా 2019, 2020, 2021 సంవత్సరాలకు అందించని జాతీయ సంగీత, నాటక అకాడమీ అవార్డులను గురువారం రాష్ట్రపతి ముర్ము, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విజేతలకు అందించారు. మొత్తం 128 మంది కళాకారులకు రాష్ట్రపతి అవార్డులు ఇవ్వగా, ఇందులో 50 మంది మహిళలే ఉండటం ఈ రంగాల్లో స్త్రీశక్తి చేస్తున్న సేవకు నిదర్శనమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో కళా, సంగీత సేవ చేస్తున్న ఆరుగురికి అవార్డులు దక్కాయి. హరికథ కళాకారిణి డి. ఉమామహేశ్వరి(హరికథ), కథక్ నృత్యకారులు రాఘవరాజ్ భట్, మంగళభట్(సంయుక్తంగా) 2019 సంవత్సరానికిగాను ఈ అవార్డులు అందుకున్నారు. 2020 సంవత్సరానికి కర్ణాటక సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, ప్రఖ్యాత గాయని ప్రేమరామ్మూర్తి, కూచిపూడి నృత్యకళాకారులు పసుమర్తి విఠల్, పసుమర్తి భారతి దంపతులు (సంయుక్తంగా) అవార్డులు అందుకున్నారు. 2021 సంవత్సరానికిగాను తెలుగులో నాటకరంగాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్న శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) నిర్వాహకులు ఆర్.వేణుగోపాల్ రావు సంగీత, నాటక అకాడమీ అవార్డును అందుకున్నారు.

పొత్తుపై జనసేనతో చర్చిస్తున్నాం: సోము వీర్రాజు

చిత్తూరు కలెక్టరేట్: పొత్తు విషయమై జనసేనతో చర్చిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్ దాఖలు సందర్భంగా గురువారం ఆయన చిత్తూరు వచ్చారు. జనసేన పార్టీతో పొత్తు ఉంటుందా అని మీడియా ప్రశ్నించగా జనసేన పార్టీతో మాట్లాడుతున్నామని.. త్వరలో నిర్ణయం ప్రకటిస్తామని సోము వీర్రాజు తెలిపారు.

- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.7.89 కోట్ల విలువజేసే బంగారం పట్టుబడింది. సుడాన్ జాతీయులైన 23 మంది మహిళలు సుడాన్ నుంచి జీ9–458 విమానంలో గురువారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. లగేజీల స్కానింగ్‌లో బంగారం బయటపడడంతో అధికారులు అప్రమత్తమై మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.